



www.navabhoomi.in | epaper.navabhoomi.in
RNI No:TELTEL:82083

# నవభూమి

ANUKSHANAM
NAVABHOOMI TELUGU DAILY
నవతరం తెలుగు దినపత్రిక






Published from Hyderabad and Vijayawada
ఎడిటర్ : అజీద్
హైదరాబాద్ | 23 ఆదివారం | ఫిబ్రవరి 2025 | పేజీలు 8-12 | వెల: రూ.6 | సంపుటి:2 సంచిక: 159
Navabhoomi daily fallows..
Circulated at: Hyderabad, Rangareddy, Adilabad, Karimnagar,Warangal,Khammam, Nalgonda, Mahabubnagar,Medak, Nizamabad, Krishna,Guntur,Easrt Godavari, West Godavari,Prakasam, Nellore,Srikakulam,Vizianagaram,Visakhapatanam,Kurnool,Chittoor,Kadapa,and Anantapur


# కుప్పకూలిన టన్నెల్

- కుప్పకూలిన శ్రీశైలం ఎడమగట్టు కాలువ సొరంగం పైకప్పు
- సొరంగం పనుల్లో 50 మందికి పైగా కార్మికులు
- ప్రమాదాన్ని ముందే పసిగట్టి తప్పించుకున్న కార్మికులు
- పైకప్పు కూలడంతో పలువురికి గాయాలు
- 14 కిలోమీటర్ల పరిధిలో ఉండే పైకప్పులో 3కిమీ కుంగుబాటు
- నాగర్‌కర్నూలు జిల్లా దోమలపెంట వద్ద ఘటన
- సహాయక చర్యలకు రంగంలోకి దిగిన రేవంత్ సర్కార్
- ఎస్సెల్బీసీ ఘటనపై రేవంత్‌కు ఫోన్ చేసిన ప్రధాని మోదీ

2





**నాగర్‌కర్నూలు-నవభూమిబ్యూరో:** శ్రీశైలం ఎడమ గట్టు కాలువ సొరంగం పనులలో ఈరోజు ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ఐదేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత తిరిగి ఇటీవల కాలంలో పనులను ప్రారంభించిన శ్రీశైలం ఎడమ గట్టు కాలువ సొరంగం పనులలో నేడు చోటు చేసుకున్న ప్రమాదంలో కార్మికులు సొరంగంలో చిక్కుకుపోయారు. సొరంగంలో పనిచేస్తున్న కార్మికుల మీద సొరంగం మార్గం వద్ద ఉన్న రిటైన్ వాల్ ఒక్కసారిగా కుప్పకూలడంతో కూలీలు టన్నెల్లో చిక్కుకుపోయారు. శ్రీశైలం ఎడమ గట్టు కాలువ సొరంగం పనులలో కుప్పకూలిన రిటైన్ వాల్ ఈ దుర్ఘటనలో పలువురు కూలీలకు గాయాలు కాగా మరి కొంత మంది సిబ్బంది సొరంగంలోనే ఇరుక్కుపోయారు.నాగర్ కర్నూల్ జిల్లా దోమలపెంట సమీపంలో ఎస్ ఎల్ బి సి ఎడమ సొరంగం 14 వ కిలోమీటర్ల వద్ద ఈ ఘోర ప్రమాదం చోటుచేసుకుంది .రిటైన్ వాల్ కుప్పకూలడంతో సొరంగ మార్గం వద్ద సుమారు మూడు కిలోమీటర్ల మేర పైకప్పు కుంగింది. ప్రమాద సమయంలో సొరంగంలో 50 మంది కార్మికులు ఈ ప్రమాదం జరిగిన సమయం 50 మంది కార్మికులు ఉన్నట్లుగా తెలుస్తుంది. ప్రస్తుతం అధికారులు అక్కడ సహాయ చర్యలు చేపట్టారు. ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్నారు. నల్గొండ జిల్లాకు సాగునీటిని తాగు నీటిని అందించడం కోసం శ్రీశైలం ఎడమ గట్టు కాలువ సొరంగం ప్రాజెక్టును రూపొందించారు. శ్రీశైలం జలాశయం నుండి నల్గొండ జిల్లాకు 30 టీఎంసీల నీటిని తరలించాలి అన్నది ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశం. గతంలో వైఎస్సార్ హయాంలో పరిపాలనా అనుమతులు గతంలో ఈ ప్రాజెక్టుకు వైఎస్ఆర్ ప్రభుత్వం 2200 కోట్ల రూపాయలతో పరిపాలన అనుమతులను ఇచ్చింది. 1925 కోట్ల రూపాయలతో దీనిని 60 నెలలలో పూర్తి చేయాలని ఓ నిర్మాణ సంస్థకు పనులకు

# 60 కోట్లు

దాటేసిన మహా కుంభమేళా భక్తజనం

- అధికారికంగా ప్రకటించిన యుపి సర్కార్
- కేంద్రమంత్రులు నడ్డాతో పాటు ప్రముఖుల స్నానం
- అంచనాలకు మించి పుణ్యస్నానాలు
- 26 నాటికి భక్తుల సంఖ్య 65 కోట్లకు చేరే ఛాన్స్



2

**నాగర్‌కర్నూలు-నవభూమిబ్యూరో:**మహా కుంభమేళా రికార్డుల మీద రికార్డులు క్రియేట్ చేస్తుంది. ఈ క్రమంలోనే జనవరి 13న ప్రారంభమైన మహా కుంభమేళాలో ఇప్పటివరకు 60 కోట్లకు పైగా భక్తులు పుణ్య స్నానాలు చేశారని యూపీ ప్రభుత్వం శనివారం అధికారికంగా ప్రకటించింది.

ప్రయాగ్‌రాజ్ మహా కుంభమేళాకు దేశంతోపాటు ప్రపంచం నలుమూలల నుంచి కోట్లాది మంది భక్తులు తరలివస్తున్నారు. ఈ క్రమంలోనే మరో అరుదైన రికార్డుకు చేరువైంది. ఈరోజు అంటే శనివారం (ఫిబ్రవరి 22న) సాయంత్రం 6 గంటల వరకు 1.29 కోట్ల మంది భక్తులు స్నానాలు ఆచరించారు. దీంతో ఇప్పటివరకు మొత్తం 60.2 కోట్లకు పైగా భక్తులు సంగమంలో పుణ్య స్నానాలు చేసినట్లు ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది.

అంతేకాదు ఫిబ్రవరి 26 నాటికి ఈ భక్తుల సంఖ్య 65 కోట్లకు పైగా చేరుకుంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఎందుకంటే చివరి రోజుకు మరో నాలుగు రోజుల సమయం ఉంది. ఈ క్రమంలో ముఖ్యంగా శివరాత్రి చివరి పవిత్ర స్నానోత్సవం కోసం భారీగా భక్తులు వచ్చే అవకాశం ఉంది.

మళ్లీ స్నానం చేసిన సీఎం..

## 14వేల ఉద్యోగాల భర్తీకి

# గ్రీన్ సిగ్నల్

- అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల ఖాళీల భర్తీకి ప్రభుత్వం అంగీకారం
- మహిళా శిశు సంక్షేమ శాఖలో 14,236 పోస్టుల భర్తీకి అనుమతి
- 399 అంగన్వాడీ, 7837 హెల్పర్ పోస్టుల భర్తీకి ఆమోదం
- ఎన్నికలకోడ్ ముగియగానే నోటిఫికేషన్

2

**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

రాష్ట్రంలోని నిరుద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల ఖాళీల భర్తీకి ప్రభుత్వం తాజాగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు మహిళా శిశు సంక్షేమ శాఖలో 14,236 పోస్టుల భర్తీకి అనుమతిచ్చింది. 6399 అంగన్వాడీ, 7837 హెల్పర్ పోస్టుల భర్తీకి ఆమోదం తెలుపుతూ మంత్రి సీతక్క సంబంధిత ఫైల్‌పై సంతకం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగియగానే నోటిఫికేషన్ విడుదల చేసేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారు. ఎన్నికల కోడ్ ముగియగానే జిల్లాల వారీగా కలెక్టర్లు

## ముస్లింలను బీసీలో చేర్చిన

# ప్రధాని మోదీ

- పారదర్శకంగా కులగణన.. మనం తేల్చిన లెక్క నూటికి నూరు శాతం పక్కా
- సర్వేలో పాల్గొనకుండా ఫాంహౌస్‌లో ఉన్నోడు మంచోడైండు..
- నన్ను విలన్‌ను చేశారు.. చిన్న చిన్న తప్పులంటూ పార్టీ నేతలు మాట్లాడొద్దు
- మార్చి 10 లోగా కులాల వారీగా భేటీల్లో లెక్క పక్కా అని తీర్మానం చేయాలి
- బీసీలకు ఇదే బైబిల్, భగవద్గీత, ఖురాన్.. కాంగ్రెస్ బీసీ నేతలతో రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** ప్రభుత్వం నిర్వహించిన కులగణన ఎట్లా తప్పో చెప్పాలంటూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిలకు సీఎం రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. బట్ట కాల్చి మీద వేయడం కాదని, రాష్ట్రంలోని ఏ బ్లాక్‌లోని ఏ ఇంట్లో లెక్క తప్పు జరిగిందో చూపాలన్నారు. కులగణన లెక్కలను అసెంబ్లీలో పెట్టి, వాటికి చట్టబద్దత కల్పిస్తే.. ముఖ్యమంత్రిగా తన బాధ్యత అయిపోయినట్లేనని, అక్కడి నుంచి ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత బీసీ నేతలదేనన్నారు. ప్రభుత్వం నిర్వహించిన కులగణన లెక్క పక్కా అంటూ కులాల వారీగా సమావేశాలను ఏర్పాటు చేసుకుని, తీర్మానాలను ఆమోదించాలంటూ కాంగ్రెస్ పార్టీ బీసీ నేతలకు సూచించారు. ఈ ప్రక్రియను మార్చి 10లోపు పూర్తి చేయాలన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో శనివారం ప్రజాభవన్‌లో పార్టీలోని బీసీ సామాజిక వర్గానికి చెందిన

## నేడు గ్రూప్ 2 పరీక్షలు

# యధాతథం

## వాయిదా వేయలేమన్న ఏపీపీఎస్సీ

**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో:**ఆంధ్రప్రదేశ్ గ్రూప్ 2 పరీక్షలు రేపు (ఫిబ్రవరి 23న) యథాతథంగా నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రకటించింది. ఇటీవల ఈ పరీక్షలు వాయిదా వేస్తున్నట్లు వచ్చిన వార్తలపై ఏపీపీఎస్సీ క్లారిటీ ఇచ్చింది. కమిషన్ తెలిపిన ప్రకారం, MLC కోడ్ అమలులో ఉన్నందున గ్రాడ్యుయేట్ అభ్యర్థులకు ప్రయోజనం కల్పించే నిర్ణయాలను తీసుకోవడం సాధ్యం కాదని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో అభ్యర్థులు తమ హాల్ టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని కమిషన్ సూచించింది. గ్రూప్ 2 పరీక్షలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. పరీక్షా కేంద్రాలు, సమయాలు, ఇతర వివరాలను అభ్యర్థులు తమ హాల్ టిక్కెట్లలో చూసుకోవాలని కమిషన్ తెలిపింది.కారణమిదే..ఏపీపీఎస్సీ తెలిపిన ప్రకారం MLC కోడ్ అమలులో ఉన్నందున, ఈ సమయంలో గ్రాడ్యుయేట్ అభ్యర్థులకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకోవడం కష్టమని కమిషన్ పేర్కొంది. ఈ కోడ్ ప్రకారం ఎన్నికల సమయంలో ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలు, పరీక్షలు వాయిదా వేయడం వంటి చర్యలు తీసుకోవడం నిషిద్ధం. అందువల్ల గ్రూప్ 2 పరీక్షలను వాయిదా వేయడం సాధ్యం కాదని కమిషన్ స్పష్టం చేసింది.

## ప్రధాని మోదీ ప్రిన్సిపల్ సెక్రటరీగా

# శక్తికాంత దాస్

- శక్తికాంత దాస్ ఆర్బీఐ మాజీ గవర్నర్
- ఆర్థిక పునరుద్ధరణతో సహా క్లిష్టమైన ఆర్థిక సవాళ్ల మధ్య
- భారత్ ముందుకెళ్లడంలో శక్తికాంత దాస్ కీలక పాత్ర



**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో:** ఆర్‌బీఐ మాజీ గవర్నర్ శక్తికాంత దాస్‌కు అరుదైన గౌరవం దక్కింది. ప్రధాని మోదీ ప్రిన్సిపల్ సెక్రటరీగా ఆయన నియమితులయ్యారు. ఈ సందర్భంగా శనివారం సాయంత్రం కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వుల ప్రకారం శక్తికాంత దాస్ నియామకం ప్రధానమంత్రి పదవి కాలంతో పాటు..తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు కో-టెర్మినస్‌గా ఉంటుంది. మాజీ ఐఏఎస్ అధికారి పీకే మిశ్రా ప్రస్తుతం ప్రధాని మోదీకి మొదటి ప్రిన్సిపల్ సెక్రటరీగా పనిచేస్తున్నారు. 2019 సెప్టెంబర్ నుంచి ఆయన ఈ పదవిలో ఉన్నారు. కాగా ఇప్పుడు శక్తికాంత దాస్ రెండో ప్రిన్సిపల్ సెక్రటరీగా నియమితులయ్యారు. ఇక శక్తికాంత దాస్ ఆర్బీఐ గవర్నర్‌గా 2018 నుంచి 2023 వరకు పనిచేశారు. కోవిడ్-19 మహమ్మారి, దేశం తదుపరి ఆర్థిక పునరుద్ధరణతో సహా క్లిష్టమైన ఆర్థిక సవాళ్ల మధ్య భారత్ ముందుకెళ్లడంలో ఆయన కీలక పాత్ర పోషించారు.

# డబ్బులిచ్చింది భారత్‌కే?

- యుఎస్ ఎయిడ్ భారత ఎన్నికల్లో ఖర్చు పెట్టిందని ట్రంప్ ఆరోపణ
- భారతీయ ఎన్నికలపై ప్రభావం చూపేందుకు 21 మిలియన్ డాలర్ల ఖర్చు
- ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రికల్లో బంగ్లాదేశ్‌కు ఖర్చు చేసినట్లు కథనం
- బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు పరస్పరం ఆరోపణలతో రచ్చ రచ్చ
- యుఎస్ ఎయిడ్ విదేశీ నిధులు రాజకీయ చర్చలకు కేంద్రబిందువు

2



**వాషింగ్టన్ డీసీ-నవభూమిబ్యూరో**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు భారత్‌లో రాజకీయ దుమారం రేపుతున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు భారత్‌లో రాజకీయ దుమారం రేపుతున్నాయి. (యునైటెడ్ స్టేట్స్ ఏజెన్సీ ఫర్ ఇంటర్నేషనల్ డెవలప్మెంట్) ద్వారా భారతీయ ఎన్నికలపై ప్రభావం చూపేందుకు 21 మిలియన్ డాలర్లు ఖర్చు చేశారని ట్రంప్ ఆరోపించారు. DOGE (డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియెన్సీ) విడుదల చేసిన నివేదిక ఆధారంగా ఈ ఆరోపణలు వెలువడ్డాయి. ఈ విషయంపై భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ స్పందిస్తూ, "అమెరికా ప్రభుత్వ కార్యకలాపా లపై వచ్చిన సమాచారం చూసి ఖండిస్తున్నాం. ఇది భారత అంతర్గత వ్యవహారాల్లో విదేశీ జోక్యానికి దారితీస్తుంది" అని పేర్కొంది. ఈ విషయంపై ఇంకా స్పందించలేదు. అయితే, 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' పత్రికలో వచ్చిన కథనం ప్రకారం.. ట్రంప్ పేర్కొన్న 21 మిలియన్ డాలర్లు భారత్‌కు కాకుండా బంగ్లాదేశ్‌కు కేటాయించబడ్డాయని వెల్లడించింది. ఈ వివాదం నేపథ్యంలో భారతీయ రాజకీయ పార్టీలైన భారతీయ జనతా పార్టీ (బీజేపీ) , కాంగ్రెస్ పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్నా

# అసెంబ్లీకి వైఎస్ జగన్!

- పక్కా ప్లాన్‌తో మాజీ ముఖ్యమంత్రి జగన్ ఎంట్రీ
- శాసనసభ్యులుగా ప్రమాణస్వీకారం చేసేందుకు మాత్రమే అసెంబ్లీకి వెళ్లిన జగన్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యులు
- అప్పటి నుంచి అసెంబ్లీ సమావేశాలకు పూర్తి దూరంగా ఉన్న వైసీపీ
- కూటమి ప్రభుత్వం తొలిసారి పూర్తిస్థాయి బడ్జెట్ పెట్టనుండటంతో తన నిర్ణయాన్ని మార్చుకున్న మాజీ ముఖ్యమంత్రి జగన్

2



**అమరావతి-నవభూమిబ్యూరో:**వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్ కీలక నిర్ణయం తీసుకున్నారు. వచ్చే అసెంబ్లీ సమావేశాలకు హాజరు కావాలని ఆయన నిర్ణయించుకున్నారు. జగన్ అసెంబ్లీ సమావేశాలకు హాజరుకావడంపై వైసీపీ కీలక అప్డేట్ ఇచ్చింది. బడ్జెట్ సమావేశాలకు పార్టీ అధినేత జగన్‌తో పాటు, ఎమ్మెల్యేలు సైతం హాజరుకానున్నట్టు ఆ పార్టీ ప్రకటించింది. అధికారం కోల్పోయిన తర్వాత జగన్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యులు కేవలం శాసనసభ్యులుగా ప్రమాణస్వీకారం చేసేందుకు మాత్రమే అసెంబ్లీకి వెళ్లారు. అనంతరం జరిగిన అసెంబ్లీ సమావేశాలకు వైసీపీ పూర్తి దూరంగా ఉంది. తమకు ప్రతిపక్ష హోదా ఇవ్వాలని.. సాధారణ ఎమ్మెల్యేగానే తనకు సమయం కేటాయిస్తే అసెంబ్లీలో గళం వినిపించలేమని జగన్ పేర్కొంటూ వస్తున్నారు.ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీ సమావేశాలకు వెళ్తామని జగన్ పలు సందర్భాల్లో చెప్పడం జరిగింది.అయితే కూటమి ప్రభుత్వం తొలిసారి పూర్తిస్థాయి బడ్జెట్ పెట్టనుండటంతో జగన్ తన నిర్ణయాన్ని మార్చుకున్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారి పూర్తిస్థాయి బడ్జెట్

## నల్గొండ జిల్లాలో

# బర్డ్‌ఫ్లూ కలకలం

- నల్లగొండ జిల్లాలో 7వేల కోళ్ళు మృతి..వెంటాడుతున్న బర్డ్ ఫ్లూ భయం
- కేతేపల్లి మండలం చెరుకుపల్లి గ్రామంలోని ఒక పౌల్ట్రీఫారంలో ఒక్కసారిగా కోళ్లు మృతి
- జేబీసీ సాయంతో పూడిక తీసి,కోళ్లను పూడ్చి పెట్టిన కోళ్లఫారం యజమాని
- 3 లక్షల రూపాయలు ఖర్చు పెట్టినప్పటికీ కోళ్లను కాపాడుకోలేకపోయానన్న రైతు

2



**కేతేపల్లి-నవభూమి:** తెలంగాణ రాష్ట్రంలో బర్డ్ ఫ్లూ విస్తరిస్తోంది. గత కొద్దిరోజుల క్రితం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మొదలైన బర్డ్ ఫ్లూ ఇప్పుడు తెలంగాణ రాష్ట్రంలో కూడా కోళ్లప్రాణాలు తీస్తోంది. తాజాగా నల్గొండ జిల్లాలో బర్డ్ ఫ్లూ కలకలం రేపింది. నల్గొండ జిల్లాలో కేతపల్లి మండలం చెరుకుపల్లి గ్రామంలోని ఒక పౌల్ట్రీ ఫారంలో సుమారు 7000కోళ్లు చనిపోయాయని తెలుస్తుంది. ఒక్కసారిగా ఇన్ని కోళ్లు చనిపోవడంతో వాటికీ బర్డ్ ఫ్లూ సోకిందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఏడు వేల కోళ్ళు మృతి.. లబోదిబో అంటున్న పౌల్ట్రీ ఫారం యజమాని కోళ్ల ఫారం యజమానులు చనిపోయిన కోళ్లను జేసీబీ సహాయంతో పూడిక తీసి మట్టిలో పూడ్చిపెట్టారు. గత కొన్ని రోజులుగా వ్యాధికి గురైన ఈ కోళ్లకు చికిత్స అందించడం కోసం వారు హైదరాబాద్ నుంచి వైద్యులను పిలిపించి

# ఆస్పత్రిలో పవన్ కళ్యాణ్

- గత కొంత కాలంగా సయాటికాతో బాధపడుతున్న పవన్ కళ్యాణ్
- హైదరాబాద్‌లోని అపోలోలో పలు వైద్య పరీక్షలు
- ఈ నెలాఖరు,మార్చి మొదటివారంలో మళ్లీ వైద్య పరీక్షలు
- 24న బడ్జెట్ సమావేశాలకు హాజరుకానున్న పవన్

2


**అమరావతి-నవభూమిబ్యూరో:**ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పలు ఆరోగ్య సమస్యలతో ఆస్పత్రిలో చేరారు. శనివారం హైదరాబాద్ అపోలో ఆసుపత్రిలో పవన్ కళ్యాణ్ పలు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. స్కానింగ్, తత్సంబంధిత పరీక్షలు నిర్వహించారు. రిపోర్ట్స్ పరిశీలించిన వైద్యులు పలు సూచనలు చేశారు. మరికొన్ని వైద్య పరీక్షలు అవసరం ఉంది. ఈ నెలాఖరునగానీ, మార్చి మొదటి వారంలోగానీ మిగిలిన వైద్య పరీక్షలు చేయించుకొంటారు. 24వ తేదీ నుంచి మొదలయ్యే బడ్జెట్ సమావేశాలకు పవన్ కళ్యాణ్ హాజరవుతారు. అని జనసేన పార్టీ తన అధికారిక సోషల్ మీడియా ఖాతాలో వెల్లడించింది. , పవన్ కళ్యాణ్ గత కొంత కాలంగా సయాటికాతో బాధపడుతున్నారు. అందుకే ఆయన ఇటీవల సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దర్శిస్తే ఆరోగ్యం నయమవుతుందని భావించి.. కేరళ, తమిళనాడులోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాలను సందర్శించారు. అంతేగాక, ప్రయాగ్‌రాజ్‌లో మహా కుంభమేళాకు వెళ్లి త్రివేణి సంగమంలో పవన్ కళ్యాణ్ దంపతులు పుణ్యస్నానాలు ఆచరించారు. కుమారుడు అకీరా కూడా వారితో ఉన్నాడు. అయితే, సుదీర్ఘ ప్రయాణం అనంతరం పవన్ కళ్యాణ్ తాజాగా



# మస్తాన్ సాయి కన్ఫెషన్ రిపోర్ట్‌లో సంచలన విషయాలు



**హైదరాబాద్-నవభూమి:**నగ్న వీడియోలు, డ్రగ్స్ పార్టీల కేసులో అరెస్ట్ అయిన మస్తాన్ సాయి కన్ఫెషన్ రిపోర్ట్‌లో సంచలన విషయాలు బయటకు వచ్చాయి. మస్తాన్ సాయిని మూడు రోజుల పాటు పోలీసులు విచారించారు. హార్డ్ డిస్క్, డ్రగ్స్, పార్టీస్, సాఫ్ట్ వేర్ అన్నింటి గురించి పోలీసులు ప్రశ్నించారు. అయితే డ్రగ్స్‌పై మాత్రం మస్తాన్ సాయి నోరు మెదపనట్టు తెలుస్తోంది. ఎక్కడి నుంచి డ్రగ్స్ వచ్చాయి, ఎవరెవరికి డ్రగ్స్ ఇచ్చారు అనే ప్రశ్నలకు మస్తాన్ సాయి ఎలాంటి సమాధానం ఇవ్వలేదు. అయితే హార్డ్ డిస్కుల గురించి పోలీసులకు వివరణ ఇచ్చాడు మస్తాన్. హార్డ్ డిస్క్‌లో మొత్తం 17 ఫోల్డర్లు ఉండగా... 17 ఫోల్డర్లను మస్తాన్ సాయి ముందు పోలీసులు తెరిచారు. హార్డ్ డిస్క్ మొత్తంలో ఆరుగురు అమ్మాయిలకు సంబంధించిన వీడియోలను కాప్స్ గుర్తించారు. వీటిలో ఎక్కువగా వాట్సాప్ వీడియో కాల్ స్క్రీన్ రికార్డింగ్స్ బయటపడ్డాయి. లావణ్యతో పాటు మస్తాన్ గర్ల్ ఫ్రెండ్స్, తన భార్యకు సంబంధించిన వీడియోలను పోలీసులు గుర్తించారు. అలాగే కొన్ని నార్మల్ వీడియోస్, మరికొన్ని ప్రైవేట్ వీడియోస్ బయటపడ్డాయి. 2500కు పైగా ఫోటోలు, 505కు పైగా వీడియోలు, 734 ఆడియో రికార్డింగ్స్‌ను పోలీసులు గుర్తించారు.



## హైదరాబాద్ నగరవాసులకు అలర్ట్.. వెంటనే ఈ పని చేయండి, లేదంటే ప్రాపర్టీస్ సీజ్..!




**హైదరాబాద్-నవభూమి:**హైదరాబాద్ నగరవాసులకు జీహెచ్ఎంసీ అలర్ట్ జారీ చేసింది. ప్రాపర్టీస్ ట్యాక్స్ విషయంలో కఠినంగా వ్యవహరించాలని డిసైడ్ అయింది. ఈ ఫైనాన్షియల్ ఇయర్ ముగుస్తుండటంతో.. మార్చి నెలాఖరు నాటికి మరో రూ.600 కోట్ల ఆదాయాన్ని సమకూర్చుకోవడమే టార్గెట్‌గా కఠిన చర్యలకు రెడీ అయింది. ట్యాక్స్ చెల్లించని ప్రైవేటు హాస్పిటల్స్, విద్యా సంస్థలు, రెస్టారెంట్లు, హోటళ్లు, ఇతరత్రా వ్యాపార సముదాయాలకు తాళం వేయాలని నిర్ణయించారు. గత వారం రోజుల వ్యవధిలో 100 భవనాలను సీజ్ చేశారు.జీహెచ్ఎంసీ అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. ప్రాపర్టీ ట్యాక్స్ బకాయిలు రూ.5 లక్షలకు మించి ఉన్న భవనాలు నగరంలో 4 వేలకుపైగా ఉన్నాయి. అత్యధికంగా జూబ్లీహిల్స్ సర్కిల్‌లో 700 వరకు నిర్మాణాలు ఉన్నట్లు గుర్తించారు. ఆ తర్వాత ఖైరతాబాద్‌లో 650 నిర్మాణాలు, గోషామహల్‌లో 550 నిర్మాణాలు, బేగంపేటలో 280, సరూర్‌నగర్‌లో 180, అంబర్‌పేట్‌లో 140 నిర్మాణాలు, మెహిదీపట్నంలో 150 వరకు నిర్మాణాలున్నాయి. వాటి నుంచి రూ.4 వేల కోట్ల వరకు పన్ను వసూలు కావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ట్యాక్స్ వసూళ్లపై స్పెషల్ ఫోకస్ పెట్టింది. ప్రస్తుతం శేరిలింగంపల్లి జోన్ నుంచి ఆశించిన స్థాయిలో వసూళ్లు లేవని జీహెచ్ఎంసీ అధికారులు తెలిపారు.మల్టీ లెవల్ బిల్డింగులు, అనేక వ్యాపార సంస్థలున్న హైటెక్‌సిటీ, మాదాపూర్, గచ్చిబౌలి, చందానగర్, మియాపూర్, కొండాపూర్ ప్రాంతాల్లో బకాయిదారులను సంప్రదించి పన్ను వసూలుపై దృష్టి పెట్టారు. ఇప్పటికే ఇప్పటికే 6 లక్షల మంది యజమానులకు నోటీసులు జారీ చేసేందుకు జీహెచ్ఎంసీ సిద్ధమైంది. ట్రేడ్ లైసెన్సులు తీసుకోని వారికి, గతంలోని లైసెన్సులు పునరుద్ధరించుకోని వారిని మరో లక్షన్నర మందిని గుర్తించి వారికి కూడా నోటీసులు జారీ చేసింది. పెండింగ్‌లో ఉన్న పన్నులు చెల్లించాలని లేదంటే బిల్డింగులు సీజ్ చేస్తామని జీహెచ్ఎంసీ అధికారులు హెచ్చరిస్తున్నారు.ఇక నుంచి పన్ను వసూళ్లపై కఠినంగా వ్యవహరిస్తామని.. ఎంతటివారైనా పన్నులు చెల్లించకపోతే తాళాలు పడాల్సిందేనని చెబుతున్నారు. కాబట్టి ఇంకా ఎవరైనా ట్యాక్స్ కట్టని వారు ఉంటే వెంటనే వాటిని క్లియర్ చేయాలని సూచిస్తున్నారు.

## లిఫ్ట్‌లో ఇరుక్కున్న బాలుడు.. చికిత్స పొందతూ మృతి



**హైదరాబాద్-నవభూమి:**హైదరాబాద్‌లోని ఓ అపార్ట్‌మెంట్ లిఫ్ట్‌లో ఇరుక్కుపోయి గాయపడ్డ బాలుడు అర్నవ్(6) మృతి చెందాడు. నిలోఫర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఇవాళ (ఫిబ్రవరి 22న) కన్నుమూశాడు. శుక్రవారం (ఫిబ్రవరి 21న) మాసబ్‌ట్యాంక్ శాంతినగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో మూడో ఫ్లోర్ నుంచి కిందకు దిగే క్రమంలో ఒక్కసారిగా లిఫ్ట్ ఆగిపోడంతో.. లిఫ్ట్-స్లాబ్ మధ్య బాలుడు అర్నవ్ ఇరుకుపోయాడు. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు, డీఆర్ఎఫ్ సిబ్బంది ఎంతో కష్టపడి బాలుడి రక్షించి ఆస్పత్రికి తరలించారు. అయితే.. దాదాపు 2 గంటల పాటు లిఫ్ట్‌లో ఇరుక్కుపోవడంతో పొట్ట, వెన్ను భాగంలో బాలుడికి తీవ్రంగా గాయాలైనట్లు వైద్యులు గుర్తించారు. అర్నవ్ కడుపు పూర్తిగా నలిగిపోవడంతో పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే నిన్న లాపరోటమీ సర్జరీ చేసి వెంటిలేటర్‌పై బాలుడికి చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో అర్నవ్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. బాలుడి మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

## మార్చి 1 నుంచి నిప్పుల కుంపటే.. జాగ్రత్తగా ఉండండి, హెచ్చరికలు జారీ

**హైదరాబాద్-నవభూమి:**తెలంగాణలో భానుడు ఉగ్రరూపం దాల్చుతున్నాడు. ఈ ఏడాది చాలా త్వరగా ఎండా కాలం సీజన్ మొదలైంది. జనవరి చివరి వారం నుంచే సూర్యుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. ఇక ఫిబ్రవరి నుంచి పలు ప్రాంతాల్లో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం 8 తర్వాత కాలు బయటపట్టేందుకు ప్రజలు జంకుతున్నారు. ఉదయం 10 గంటల నుంచి ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుండటంతో హైదరాబాద్‌తో పాటు పలు ప్రధాన నగరాల్లోని రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. మధ్యాహ్నం పూట ప్రజలు బయటకు రావాలంటేనే భయపడిపోతున్నారు.రానున్న రోజుల్లో ఎండ తీవ్రత మరింత ఎక్కువగా ఉంటుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు హెచ్చరిస్తున్నారు. మరీ ముఖ్యంగా మార్చి 1 నుంచి తెలంగాణ నిప్పుల కుంపటిగా మారటం ఖాయమని అంటున్నారు. రానున్న 5 రోజుల పాటు కొన్ని ప్రాంతాల్లో ఎండ తీవ్రత తక్కువగా ఉన్నా.. ఆ తర్వాత మాత్రం భానుడి భగభగలు తప్పవని అంటున్నారు. ఎండల తీవ్రత చాలా ఎక్కువగా ఉంటుందని చెబుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం 35.3 డిగ్రీల నుంచి 38.2 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని చెప్పారు. ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్‌పేటలో అత్యధికంగా 38.2 డిగ్రీలు, జగిత్యాల జిల్లా బీర్‌పూర్‌లో 38.1 డిగ్రీలు, నిర్మల్ జిల్లా గింగాపూర్‌లో 38.1 డిగ్రీలు, నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దముద్నూర్‌లో 38 డిగ్రీల చొప్పున టెంపరేచర్ రికార్డయింది.ఇక ఎండల తీవ్రతతో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగింది. శుక్రవారం రాష్ట్ర చరిత్రలోనే అత్యధికంగా 16,293 మెగావాట్లు నమోదైనట్లు విద్యుత్ అధికారులు తెలిపారు. ఇలా అత్యధిక డిమాండ్ నమోదవడం ఫిబ్రవరి నెలలో ఇది నాలుగోసారని చెప్పారు. గత ఏడాది మార్చి 8న అత్యధిక డిమాండ్ 15,623 మెగావాట్లు నమోదు కాగా.. ఫిబ్రవరి 5న 15,820 మెగావాట్లు నమోదై ఆ రికార్డును దాటేసింది. మళ్లీ ఈ నెలలోనే 10, 19 తేదీల్లో అంతకుమించి నమోదైనట్లు చెప్పారు.తాజాగా శుక్రవారం మళ్లీ అత్యధిక డిమాండ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు.

# కుషాయిగూడలో దారుణం.. నడిరోడ్డుపై తండ్రిని చంపిన కొడుకు



**హైదరాబాద్-నవభూమి:**హైదరాబాద్ కుషాయిగూడలో దారుణం చోటు చేసుకుంది. పట్టపగలు నడిరోడ్డుపై అందురూ చూస్తుండగానే.. ఓ కుమారుడు కన్న తండ్రిని హతమార్చాడు. కత్తితో విచక్షణారహితంగా పొడిచి దారుణంగా చంపేశాడు. ఈ ఘటన స్థానికులను ఉలిక్కిపడేలా చేసింది. కుషాయిగూడ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ లాలాపేటకు చెందిన ఆరెల్లి మొగిలి, అతని కుమారుడు సాయి కుమార్ ఇద్దరూ కూడా ప్యాకర్స్ అండ్ మూవర్స్‌లో పని చేస్తున్నారు. అయితే తండ్రి మొగిలి మద్యానికి బానిసయ్యాడు. వచ్చే డబ్బులు మొత్తం తాగుడుకు ఖర్చు పెడుతూ ప్రతి రోజూ ఇంట్లో గొడవకు దిగేవాడు. తాగి గొడవ చేయవద్దని కుమారుడు సాయికుమార్ ఎన్నిసార్లు చెప్పినా వినిపించుకోలేదు.
దీంతో విసిగిపోయిన కుమారుడు తండ్రి మొగిలిని హతమార్చేందుకు సిద్ధమయ్యాడు. అందుకు సమయం కోసం ఎదురు చూశాడు. ఇవాళ మధ్యాహ్నం లాలాపేట ఇంటి నుంచి మొగిలి ఆర్టీసీ బస్సులో బయలుదేరగా.. అతడిని సాయి కుమార్ తన బైక్‌పై వెంబడించాడు. ఈసీఐఎల్ బస్ టెర్మినల్ వద్ద తండ్రి మొగిలి బస్సు దిగగా.. ఆ వెంటనే ఆకస్మాత్తుగా అతడిపై దాడికి తెగబడ్డాడు. తన వెంట తెచ్చుకున్న కత్తితో విచక్షణారహితగా పొడిచాడు. తండ్రి మొగిలి తప్పించుకునే ప్రయత్నం చేసినా.. వెంబడించి వేటాడి దారుణంగా పొడిచి చంపాడు. అందుకు సంబంధించిన దృశ్యాలు అక్కడే ఉన్న సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. మొగిలిని కుమారుడు హత్య చేస్తుంటే.. అక్కడ ఉన్నవారు వేడుక చూశారే తప్ప ఏ ఒక్కరూ కూడా రక్షించే ప్రయత్నం చేయలేదు. కొందరైతే తమ సెల్‌ఫోన్లలో హత్యోదంతాన్ని వీడియోలు తీశారు.సాయి కుమార్ అక్కడి నుంచి వెళ్లిపోయిన తర్వాత.. తీవ్రంగా గాయపడిన మొగిలిని స్థానికులు ఆసుపత్రికి తరలించారు. సమీపంలో ఉన్న శ్రీకర హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ అతడు ప్రాణాలు కోల్పోయాడు. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ హాస్పిటల్‌కు తరలించారు. కుటుంబ కలహాలు, ఆస్తి తగాదాల కారణంగానే తండ్రి మొగిలిపై సాయికుమార్ దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు విచారణను కొనసాగిస్తున్నారు.

# తెలంగాణలోని వారందరికీ గుడ్‌న్యూస్.. రూ.3 వేల కోట్లతో, డిప్యూటీ సీఎం కీలక ప్రకటన



**హైదరాబాద్-నవభూమి:**తెలంగాణ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోంది. ఇప్పటికే రైతులకు రైతుభరోసా, రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలు అమలు చేసింది. త్వరలోనే చేనేత రుణాలు సైతం మాఫీ చేస్తామని స్పష్టం చేసింది. తాజాగా.. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీలకు గుడ్‌న్యూస్ చెప్పింది. రూ.3 వేల కోట్లతో స్వయంఉపాధి పథకాలను తీసుకొస్తామంది. ఈ మేరకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కీలక ప్రకటన చేశారు. రానున్న రెండు నెలల్లో ఈ పథకాలు అమలు చేయాలని భట్టి అధికారులను ఆదేశించారు. స్వయం ఉపాధి పథకాల అమలు కోసం సంబంధిత శాఖలు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు.
ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా సంక్షేమ శాఖల్లోని హాస్టల్స్, గురుకులాలకు సంబంధించిన అద్దెలు, డైట్ బిల్లులు పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు చెల్లించాలని స్పష్టం చేశారు. పోడు భూముల్లో సోలార్ పవర్ ఆధారంగా సాగు విస్తీర్ణం కూడా పెంచాలన్నారు. రాష్ట్రంలో అటవీ విస్తీర్ణం పెంచేందుకు రైతులకు మేలు జరిగేలా కొత్తగా అవకాడో, వెదురు వంటి పంటల సాగుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. రెండేళ్లలో ఫలితాలు వచ్చేలా చేయాలని అధికారులకు సూచించారు. సంక్షేమ శాఖల్లో పథకాల అమలు కోసం ఎన్ని నిధులైనా ఖర్చుచేస్తామని ఈ సందర్భంగా భట్టి స్పష్టం చేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలోనే రూ.3 వేల కోట్లతో పథకాలు అమలు చేయనున్నట్లు వెల్లడించారు. గురుకులాలు, హాస్టల్స్ పెండింగ్ బిల్లులపై సంబంధిత అధికారులు బాధ్యత తీసుకుని ఆర్థికశాఖ నుంచి ఎప్పటికప్పుడు వీటిని మంజూరు చేయించుకోవాలని అధికారులకు సూచించారు.కేంద్ర ప్రభుత్వ పథకాల నిధుల ఖర్చుకు వినియోగపత్రాలు సమర్పించి, వెంటనే నిధులు రాబట్టాలన్నారు. సంక్షేమ గురుకులాలు, హాస్టల్స్‌లో మంత్రులు, ఎమ్మెల్యేలు, సంబంధిత అధికారుల పర్యటనలు నిరంతరం కొనసాగాలన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధుల ఖర్చుపై అధికారులు నిరంతరం సమీక్ష నిర్వహించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ ఆవాసాల పరిధిలో నిరుపయోగంగా ఉన్న ఎత్తిపోతల పథకాలకు ఆలస్యం చేయకుండా వెంటనే మరమ్మతులు చేయాలని డిప్యూటీ సీఎం భట్టి అధికారులకు సూచించారు.

# కుప్పకూలిన టన్నెల్

**(1వపేజీ తరువాయి)**కూడా ఒప్పుకుంది. అయితే గతంలో టన్నెల్ బోరింగ్ మిషన్ తో సొరంగం తవ్వకం చేపట్టగా సాంకేతిక సమస్యలు. వరద సమస్యలు వచ్చి పనులు ఆగుతూ వచ్చాయి. చాలా కాలం తర్వాత పనులు ప్రారంభం .. కానీ ప్రమాదం ఆ తర్వాత నిధుల కేటాయింపు జరగకపోవడం, టన్నెల్ బోరింగ్ మిషన్ మరమ్మతులకు గురవడం వంటి కారణాలతో ప్రాజెక్టు పనులు మూలనపడ్డాయి. 2019 డిసెంబర్ నుంచి ఇంతకాలం వరకు ప్రాజెక్టు పనులు కొనసాగలేదు. అయితే ఇటీవల నల్గొండ మంత్రుల చొరవతో సొరంగం పనులు ఈ మధ్యనే మళ్లీ ప్రారంభమయ్యాయి. ఇక ఈ సమయంలోనే మరొక ఘోర ప్రమాదం చోటు చేసుకోవడం గమనార్హం.

**టన్నెల్‌లో చిక్కుకున్న 8 మంది, కాపాడేందుకు రంగంలోకి స్పెషల్ రెస్క్యూ టీంలు**

ఎస్ఎల్బీసీ టన్నెల్ వద్ద శనివారం ఉదయం ప్రమాదం జరిగిన స్థలాన్ని మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు పరిశీలించారు. ఎస్ఎల్బీసీ ఎడమవైపు సొరంగం 14వ కిలోమీటర్ వద్ద మూడు మీటర్ల మేర పైకప్పు పడిపోయింది. దీంతో పలువురు ఇంజినీర్లు అందులోనే చిక్కుకున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం వారిని కాపాడేందుకు అన్ని చర్యలు చేపడుతోంది.

ఎస్ఎల్బీసీ ప్రమాదస్థలిని పరిశీలించిన అనంతరం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. శనివారం ఉదయం 8 గంటలకు కార్మికులు టన్నెల్ లోపలికి వెళ్లారని.. ఆ తర్వాత అరగంటకు బోరింగ్ మిషన్ ఆన్ చేశారని చెప్పారు. ఈ క్రమంలో టన్నెల్‌లో ఒకవైపు నుంచి నీరు లీకై మట్టి కుంగి పెద్ద శబ్ధం వచ్చిందని తెలిపారు. టీబీఎం ఆపరేటర్ ప్రమాదాన్ని ముందు పసిగట్టారని చెప్పారు. వెంటనే అప్రమత్తమైన 42 మంది కార్మికులు బయటకు తీసుకొచ్చారు. అయితే, బోరింగ్ మిషన్ ముందున్న 8 మంది చిక్కుకుపోయారని, వారిని కాపాడేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. వారి ప్రాణాలు రక్షించేందుకు సర్వశక్తులు ఒడ్డుతున్నామన్నారు. ఉత్తరాఖండ్‌లో ఇలాంటి ఘటన జరిగితే టన్నెల్‌లో వారిని రెస్క్యూ చేసిన నిపుణులతో మాట్లాడామని మంత్రి తెలిపారు. టన్నెల్ లో చిక్కుకుపోయినవారు ఉత్తరాఖండ్, జార?ండ్ వాసులున్నారని చెప్పారు. వారిలో ఒక ప్రాజెక్ట్ ఇంజినీర్, ఫీల్డ్ ఇంజినీర్, నలుగురు కార్మికులు, జమ్మూకాశ్మీర్, పంజాబ్‌కు చెందిన ఇద్దరు బోరింగ్ మిషన్ ఆపరేటర్లు ఉన్నారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. 14 కిలోమీటర్ల లోపల ఇరుక్కుపోవడంతో వారిని బయటకు తీసుకురావడం కష్టసాధ్యంగా మారిందన్నారు. రెస్క్యూ టీంలు శనివారం రాత్రి ప్రమాద ఘటనా స్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపడతామని మంత్రి వివరించారు.

**టన్నెల్ ప్రమాదంపై సీఎం రేవంత్ రివ్యూ, కీలక ఆదేశాలు**

నాగర్‌కర్నూల్ జిల్లాలోని ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో ప్రమాదంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్షించారు. ఘటన స్థలాన్ని సందర్శించి వచ్చిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సాగునీటి పారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్ ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలను ముఖ్యమంత్రికి తెలియజేశారు. ఈ సమీక్ష సమావేశంలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డితో పాటు ఇతర ఉన్నతాధికారులు ఉన్నారు. సొరంగంలో చిక్కుకున్న 8 మంది కార్మికులను కాపాడేందుకు సహాయక చర్యల్లో మరింత వేగం పెంచాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ సూచించారు. గాయపడ్డ వారి పరిస్థితిని ఆరా తీశారు. గాయపడిన వారికి మెరుగైన వైద్య సాయం అందించాలని చెప్పారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించాలని చెప్పారు. ఎన్‌డీఆర్ఎఫ్ , ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు ప్రమాద స్థలికి చేరుకున్నాయని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సీఎంకు వివరించారు. సహాయక చర్యల విషయంలో అన్ని విభాగాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ స్పష్టం చేశారు.

**రేవంత్ రెడ్డికి నరేంద్ర మోదీ ఫోన్.. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదంపై ఆరా**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఫోన్ చేశారు. నాగర్‌కర్నూలు జిల్లా దోమలపెంట సమీపంలో ఎస్ఎల్‌బీసీ పనులు జరుగుతుండగా టన్నెల్‌లో ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో పలువురు కార్మికులు గాయపడ్డారు. మరికొందరు అందులోనే చిక్కుకుపోయారు. ఈ నేపథ్యంలో ప్రధానమంత్రి ముఖ్యమంత్రికి ఫోన్ చేసి వివరాలు అడిగారు.
ఎస్ఎల్‌బీసీ ప్రమాద ఘటనపై ప్రధాన మంత్రి ఆరా తీశారు. ఈ ప్రమాదం గురించిన పూర్తి వివరాలను రేవంత్ రెడ్డి వివరించారు. టన్నెల్‌లో చిక్కుకున్న ఎనిమిది మందిని సురక్షితంగా బయటకు తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు ప్రధాని దృష్టికి తీసుకు వెళ్లారు. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావులు దగ్గర ఉండి పరిస్థితులను సమీక్షిస్తున్నారని వెల్లడించారు. ప్రమాదం నేపథ్యంలో అన్ని విధాలా సహకరిస్తామని ప్రధాన మంత్రి హామీ ఇచ్చారు. మరోవైపు, మూడు ఎన్డీఆర్ఎఫ్ బృందాలు ప్రమాద ఘటనాస్థలికి చేరుకున్నాయి. విజయవాడ నుంచి రెండు, హైదరాబాద్ నుంచి ఒక బృందం చేరుకుంది. టన్నెల్‌లో చిక్కుకున్న వారిలో ఇద్దరు ఇంజినీర్లు, ఇద్దరు ఆపరేటర్లు, నలుగురు కూలీలు ఉన్నారు.

# ముస్లింలను బీసీలో చేర్చిన ప్రధాని మోదీ

**(1వపేజీ తరువాయి)**మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, సీనియర్ నేతల సమావేశం జరిగింది. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. కులగణన సర్వే నిర్వహించిన తీరును వివరించారు. "తెలంగాణలో కాంగ్రెసను అధికారంలోకి తీసుకువస్తే.. కులగణన చేసే బాధ్యతను తీసుకుంటామంటూ రాష్ట్ర ప్రజలకు రాహుల్‌గాంధీ మాట ఇచ్చారు. ఆయన మాటను విశ్వసించిన ప్రజలు అధికారం కట్టబెట్టిన తర్వాత.. ఆ మాటను నిలబెట్టడం నా బాధ్యత. ఎదురయ్యే రాజకీయ పరిణామాలకు భయపడి.. దేశంలోని ఏ రాష్ట్ర ప్రభుత్వమూ కులగణన ప్రక్రియ చేపట్టే సాహసం చేయలేదు. మా ప్రభుత్వం.. ప్రజల్ని, ప్రభుత్వాన్ని పూర్తిస్థాయిలో భాగస్వాములను చేసి, ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. ఉత్తమ్ నేతృత్వంలోని మంత్రివర్గ ఉపసంఘం చర్చించి.. కోర్టుల్లో ఇబ్బందులు రాకుండా.. ప్రణాళిక శాఖను నోడల్ ఏజెన్సీగా నియమించి, సర్వేను నిర్వహించాం. ప్రతి 150 ఇళ్లను ఒక క్లస్టర్‌గా తీసుకుని.. సర్వే జరిపాం. మొత్తం 1.03 లక్షల మంది ఉద్యోగులు 50 రోజుల పాటు ఇంటింటికీ తిరిగి, సమాచారాన్ని సేకరించారు. ఆ సమాచారంపై సర్వేలో పాల్గొన్న ఇంటి యజమాని, ఎన్యుమరేటర్, సూపర్‌వైజర్ సంతకాలుంటాయి. ఎన్యుమరేటర్ల పర్యవేక్షణలో 36 వేల మంది డాటా ఎంట్రీ ఆపరేటర్లు ఆ సమాచారాన్ని క్రోడీకరించి కంప్యూటరీకరించారు.మాన్యువల్‌గా సేకరించిన 8 పేజీల సమాచారా న్ని.. క్లస్టర్ల వారీగా బండిల్స్ కట్టి భద్రపరిచాం" అని రేవంత్‌రెడ్డి వివరించారు. కులగణన తప్పంటున్నవారు.. ఏ బ్లాక్‌లో ఎక్కడ తప్పు జరిగిందో చెబితే.. ఆ కట్టను తెరిచి, వారికి చూపిస్తామన్నారు. భవిష్యత్తులో ఎవరైనా కోర్టులో కేసు వేసి, ప్రక్రియను నిర్వీర్యం చేసే అవకాశం ఇవ్వకుండా సమాచారాన్ని భద్రపరిచామని చెప్పారు.

## 14వేల ఉద్యోగాల భర్తీకి గ్రీన్‌సిగ్నల్

**(1వపేజీ తరువాయి)**నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. మహిళా శిశు సంక్షేమ ద్వారా ఒకేసారి 14,236 ఉద్యోగాలు భర్తీ చేస్తుండటంపై మంత్రి సీతక్క హర్షం వ్యక్తం చేశారు. మహిళ శిశు సంక్షేమ శాఖలో ఏకకాలంలో 14వేలకుపైగా ఉద్యోగాలు భర్తీ చేపట్టడం ఇదే తొలిసారని మంత్రి సీతక్క తెలిపారు. తాజా పోస్టుల భర్తీతో అంగన్వాడీలు మరింత పటిష్ఠం కానున్నాయన్నారు.

## డబ్బులిచ్చింది భారత్‌కే?

**(1వపేజీ తరువాయి)**యి. బీజేపీ, కాంగ్రెస్ పార్టీ విదేశీ నిధులను ఉపయోగించి ప్రధాని మోదీని అడ్డుకోవడానికి ప్రయత్నించిందని ఆరోపించగా.. కాంగ్రెస్ ఈ ఆరోపణలను ఖండించింది. USAID నిధుల వివాదం ప్రస్తుతం భారత్‌లో రాజకీయ చర్చలకు కేంద్రబిందువుగా మారింది. ఈ అంశంపై మరింత స్పష్టత కోసం సంబంధిత సంస్థల నుండి అధికారిక ప్రకటనలు ఎదురుచూడాల్సి ఉంది. అయితే తాజాగా మరోసారి ట్రంప్ ప్రభుత్వం క్లారిటీ ఇచ్చింది. డొనాల్డ్ ట్రంప్ స్వయంగా మరోసారి ప్రకటించారు. భారత్ కు ఏకంగా 21 మిలియన్ల డబ్బులు ఇచ్చారని.. ఇక బంగ్లాదేశ్ కు ప్రత్యేకంగా 29 మిలియన్ డాలర్లు ఇచ్చారని బాంబు పేల్చారు. USAID డబ్బులు ఇచ్చింది భారత్ కు ఇవ్వలేదన్న ఇండియన్స్ ఎక్స్ ప్రెస్ కథనం అవాస్తవమని ట్రంప్ ఏకంగా వివరాలు బయటపెట్టడం సంచలనంగా మారింది.

## నల్గొండ జిల్లాలో బర్డ్‌ఫ్లూ కలకలం

**(1వపేజీ తరువాయి)**ప్రయత్నం చేసినప్పటికీ కోళ్లను మాత్రం కాపాడుకోలేకపోయారు. మూడు లక్షల రూపాయలు ఖర్చు చేసి వాటిని కాపాడే ప్రయత్నం చేసిన సదరు పౌల్ట్రీ ఫారం యజమాని ఒక్కసారిగా ఏడు వేల కోళ్లు మృతి చెందడంతో లబోదిబోమంటున్నాడు. జీవనోపాధి పోయిందని, ఆదుకోవాలని విజ్ఞప్తి అయితే కోళ్లు ఎందుకు చనిపోయాయి అన్న విషయం వైద్యం అందించిన డాక్టర్లు కూడా తనకు చెప్పలేదని పౌల్ట్రీ నిర్వాహకుడు చెబుతున్నారు. ఎంతో కాలం కష్టపడి పెంచిన కోళ్లు చనిపోవడంతో ఒక తీవ్ర నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం, ప్రీమియం సంస్థలు తమను కాపాడాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. ఒక్కసారిగా పౌల్ట్రీ ఫారం లోని కోళ్ళన్నీ చనిపోవడంతో తమ జీవనోపాధి అస్తవ్యస్తం అయిందని ఆయన లబోదిబోమంటున్నారు. నల్గొండ జిల్లాలో 7000 కోళ్లు మృతి ఎఫెక్ట్.. జనాల్లో భయం ఇక నల్గొండ జిల్లాలో ఒకసారిగా 7000 కోళ్లు మృతి చెందడంతో ప్రజలు చికెన్ షాపుల వంక చూడాలంటేనే భయపడుతున్నారు. ఇదిలా ఉంటే తెలంగాణ రాష్ట్రంలో బర్డ్ ఫ్లూ వ్యాప్తిని అరికట్టడానికి వెటర్నరీ వైద్యుల బృందం తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. ఇక తెలంగాణ ప్రభుత్వం ప్రస్తుతం అప్రమత్తమై తెలంగాణ వ్యాప్తంగా 24 చెక్ పోస్టులను ఏర్పాటు చేసింది.

## 60 కోట్లు దాటేసిన మహా కుంభమేళా భక్తజనం

**(1వపేజీ తరువాయి)**బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా శనివారం సంగమంలో పవిత్ర స్నానం చేశారు. ఈ సందర్భంగా ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, ఉప ముఖ్యమంత్రి బ్రిజేష్ పాఠక్, మంత్రులు స్వతంత్ర దేవ్ సింగ్, నంద్ గోపాల్ గుప్తా కూడా ఆయనతో పాటు పాల్గొన్నారు. ఈ నాయకులందరూ కలిసి సంగమంలో స్నానం ఆచరించారు. ఆ తర్వాత నడ్డా తన కుటుంబంతో కలిసి సూర్య భగవానుడికి ప్రార్థనలు చేసి, గంగా తల్లికి చీర, కొబ్బరికాయ, పూలు భక్తితో సమర్పించారు. ఈ సందర్భంగా నడ్డా ఇద్దరు పిల్లలు కూడా సంగమంలో స్నానం చేయడానికి ఆయనతో కలిసి వచ్చారు.
ఈ ప్రముఖులు కూడా..మహా కుంభమేళాలో ఇప్పటివరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉప రాష్ట్రపతి జగదీప్ ధంఖర్, ప్రధాని నరేంద్ర మోదీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు, రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ, ఎంపీ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ పుణ్య స్నానం చేశారు.దీంతోపాటు ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామి, హర్యానా సీఎం నయాబ్ సింగ్ సైనీ, మణిపూర్ సీఎం ఎన్ బిరేన్ సింగ్, సీఎం యోగి, ఆయన మొత్తం మంత్రివర్గం, అఖిలేష్ యాదవ్, రవి కిషన్, కవి కుమార్ విశ్వాస్ కూడా పవిత్ర స్నానం చేశారు. మరోవైపు 73 దేశాల ప్రతినిధులు, భూటాన్ రాజు జిగ్మే ఖేసర్ నాంగ్యాల్ వాంగ్‌చుక్ సహా అనేక మంది ఇతర ప్రముఖులు కూడా ఈ సంగమంలో స్నానం చేశారు.

**సనాతన ధర్మాన్ని పాటించేవారి సంఖ్య..**

ఈసారి మహా కుంభమేళాలో 40 కోట్ల మంది భక్తులు పవిత్ర సంగమంలో స్నానమాచరిస్తారని యూపీ ప్రభుత్వం మొదట అంచనా. కానీ ప్రభుత్వ అంచనా ప్రకారం ఇప్పటికే 60 కోట్ల మందికిపైగా భక్తులు స్నానం ఆచరించారు. ప్యూ రీసెర్చ్ సర్వే 2024 ప్రకారం ప్రపంచవ్యాప్తంగా సనాతన ధర్మాన్ని పాటించే వారి సంఖ్య 1.2 బిలియన్లు (120 కోట్లు) ఉంటే, అందులో దాదాపు 50 శాతం కంటే ఎక్కువ మంది సంగమంలో స్నానం చేశారని తెలిపింది. అంతేకాదు ఇండియాలో 143 కోట్ల మంది ఉంటే, వారిలో సుమారు 110 కోట్ల మంది సనాతన ధర్మాన్ని అనుసరిస్తున్నట్లు వెల్లడించింది.

## అసెంబ్లీకి వైఎస్ జగన్!

**(1వపేజీ తరువాయి)**ప్రవేశపెట్టనుంది. ఈ క్రమంలోనే జగన్ అసెంబ్లీ సమావేశాలకు హాజరుకావాలని భావిస్తున్నారు. ఎన్నికల సమయంలో భారీ హామిలిచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం , ఇప్పుడు ఆ హామీలను అమలు చేయడానికి నిధులు లేవని చెప్పి తప్పించుకునే ప్రయత్నం చేస్తోంది. సూపర్ సిక్స్ అమలు సాధ్యంపై చంద్రబాబు సైతం అసెంబ్లీలోనే తేల్చేశారు. దీంతో బడ్జెట్‌లో సూపర్ సిక్స్ అమలు , వాటి కేటాయింపులపై నిలదీయడానికే జగన్ అసెంబ్లీ సమావేశాలకు హాజరుకానున్నారని తెలుస్తోంది. ఇటువంటి పరిస్థితుల్లో జగన్ అసెంబ్లీకి రావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. జగన్‌తో పాటుగా వైసీపీ ఎమ్మెల్యేలు కూడా సోమవారం అసెంబ్లీకి హాజరుకానున్నారు. బడ్జెట్ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై ఇప్పటికే జగన్ తమ పార్టీ ఎమ్మెల్యేలకు దిశా నిర్దేశం చేసినట్టు తెలుస్తోంది.


## ఆస్పత్రిలో పవన్ కళ్యాణ్

**(1వపేజీ తరువాయి)**ఆస్పత్రిలో చేరడంతో జనసేన పార్టీ కార్యకర్తలు, ఆయన అభిమానులు కొంత ఆందోళన చెందుతున్నారు. పవన్ కళ్యాణ్ ఎలాంటి అనారోగ్యం నుంచైనా త్వరగా కోలుకోవాలని ఆయన అభిమానులు సోషల్ మీడియా వేదికగా స్పందిస్తున్నారు. పవన్ కళ్యాణ్ బాగుంటేనే తాము బాగుంటామని కొందరు అభిమానులు నెట్టింట్లో పోస్టులు పెట్టడం గమనార్హం. అయితే, చిన్నపాటి వైద్య పరీక్షల కోసమే వపన్ ఆస్పత్రిలో చేరినట్లు తెలుస్తోంది. 24 నుంచి ప్రారంభం కానున్న ఏపీ అసెంబ్లీ సమావేశాలకు కూడా పవన్ కళ్యాణ్ హాజరవుతారని జనసేన వెల్లడించిన విషయం తెలిసిందే. దీంతో పవన్ ఆరోగ్యంగా ఉన్నట్లు తెలుస్తోంది.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
3 హైదరాబాద్
ఆదివారం
23 । ఫిబ్రవరి । 2025



# 498.. వరకట్నం సెక్షన్ మాత్రమే కాదు!



**న్యూఢిల్లీ-నవభూమి:** భర్త, అత్తింటివారి నుంచి వివాహితలకు రక్షణ ఛత్రంగా తీసుకువచ్చిన ఐపీసీ 'సెక్షన్ 498'లో అన్ని రకాల వేధింపులను ఇమిడ్చారని సుప్రీంకోర్టు పేర్కొంది. భర్తలపై క్రూరత్వ అభియోగాలు మోపడానికి 'వరకట్నం డిమాండ్' అవసరం లేదని పేర్కొంది. ఐపీసీ సెక్షన్ 498ఏ కింద వరకట్నం డిమాండ్ చేయడాన్ని ప్రత్యేక నేరంగా పరిగణించాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ ప్రసన్న బి.వరాలేతో కూడిన ధర్మాసనం గత ఏడాది డిసెంబరు 12న వ్యాఖ్యానించింది. ఐపీసీ సెక్షన్ 498ఏలోనే క్రూరత్వ చర్యలు ఇమిడి ఉన్నాయని, భర్త, అత్తమామలపై ఈ సెక్షన్‌ను అమలు చేయడానికి అదనంగా వరకట్నం డిమాండ్‌ను జోడించాల్సిన అవసరం లేదని తేల్చి చెప్పింది. భార్యలపై జరిగే క్రూరత్వం ఏ రూపంలో ఉన్నా అది 498 సెక్షన్ కింద శిక్షార్హమైందేనని పేర్కొంది. సెక్షన్ 498ఏ, బీ క్లాజులలో అంశాలు ఎలాంటి వేధింపులకైనా వర్తిస్తాయని స్పష్టం చేసింది. క్లాజ్-ఏ ప్రకారం.. భార్యను శారీరకంగా, మానసికంగా హింసించడం, క్లాజ్-బీ ప్రకారం.. భార్య లేదా ఆమె పుట్టింటి వారి నుంచి చట్టవిరుద్ధమైన డిమాండ్‌ను(అదనపు కట్నం, కానుకలు వంటివి) బలవంతంగా నెరవేర్చుకునేందుకు చేసే వేధింపులు వర్తిస్తాయని పేర్కొంది. ఈ నేపథ్యంలో సెక్షన్ 498ను ప్రవేశ పెట్టిన సందర్భంగా పార్లమెంటులో చేసిన ప్రకటనను కూడా సుప్రీంకోర్టు ప్రస్తావించింది.

## కేరళలో సంచలనం సృష్టిస్తున్న సామూహిక ఆత్మహత్యలు.. అసలేం జరిగిందంటే..



**కొచ్చి-నవభూమి:** కేరళ రాష్ట్రం ఎర్నాకుళం జిల్లాలో దారుణ ఘటన వెలుగు చూసింది. సెంట్రల్ ఎక్సైజ్, జీఎస్టీ అదనపు కమిషనర్ మనీశ్ విజయ్ కుటుంబం సామూహిక ఆత్మహత్య తీవ్ర కలకలం రేపుతోంది. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ఒక్కసారిగా బలవన్మరణానికి పాల్పడడం కేరళలో సంచలనం సృష్టిస్తోంది. ఎందుకు ఆత్మహత్య చేసుకున్నారనే విషయం ఏమాత్రం తెలియడం లేదు. మనీశ్ కుటుంబం సూసైడ్?కు గల కారణాలపై సర్వత్రా ఉత్కంఠ నెలకొనగా.. అసలేం జరిగిందో అంతుపట్టక కేరళ పోలీసులు తలలు పట్టుకుంటున్నారు.

కేరళ రాష్ట్రం ఎర్నాకుళం జిల్లా కొచ్చిలో సెంట్రల్ ఎక్సైజ్, జీఎస్టీ అదనపు కమిషనర్‌గా జార?ండ్‌కు చెందిన మనీశ్ విజయ్ పని చేస్తున్నారు. నాలుగు రోజుల క్రితం మనీశ్ సెలవు తీసుకున్నారు. అయితే సెలవు ముగిసినా అతను కార్యాలయానికి రాలేదు, ఫోన్ చేసినా సమాధానం లేదు. దీంతో అనుమానం వచ్చిన తోటి అధికారులు అసలేం జరిగిందో తెలుకునేందుకు మనీశ్ ఉంటున్న కక్కనాడ్ కస్టమ్స్ క్వార్టర్స్‌కు వెళ్లారు. వారి ఇంటి తలుపు తీసే ప్రయత్నం చేయగా.. భరించలేని దుర్గంధం వచ్చింది. దీంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. హుటాహుటిన అక్కడికి చేరుకుని ఇంటి తలపులు బద్దలుకొట్టారు ఖాకీలు. అక్కడ కనిపించిన దృశ్యాలు చూసి షాక్ అయ్యారు.మనీశ్ ఇంట్లోకి వెళ్లిన అధికారులకు షాకింగ్ దృశ్యాలు కనిపించాయి. మనీశ్ అతని సోదరి షాలిని వేర్వేరు గదుల్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని కనిపించారు. వారి తల్లి శంకుతల మృతదేహం సైతం మంచంపై పడి ఉంది. ఆమె పక్కన తెల్లటి గుడ్డ, పూలు ఉండడం పలు అనుమానాలకు తావిస్తోంది. ముందుగా శంకుతల చనిపోయి ఉంటుందని, ఆ తర్వాతే వీరిద్దరూ ఆత్మహత్య చేసుకుని ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు కొచ్చి పోలీస్ కమిషనర్ పుట్టా విమలాదిత్య వెల్లడించారు. వారి చనిపోయి కొన్ని రోజులు కావడంతో మృతదేహాలు కుళ్లిపోయినట్లు వెల్లడించారు. ఫోరెన్సిక్ పరీక్ష తర్వాతే అన్ని విషయాలూ వెలుగులోకి వస్తాయని చెప్పారు. మరోవైపు తనిఖీల్లో సూసైడ్ నోట్‌ను గుర్తించామని, విదేశాల్లో ఉంటున్న తమ సోదరికి మరణవార్త తెలియజేయాలని లేఖలో రాశారని కమిషనర్ వెల్లడించారు.మనీశ్ విజయ్ గతంలో కోజికోడ్ విమానాశ్రయంలో కస్టమ్స్ ప్రివెంటివ్‌లో పనిచేశాడు. ఆ తర్వాత ఏడాదిన్నర క్రితం కొచ్చికి బదిలీ అయ్యాడు. అయితే కొన్ని నెలలుగా అతనితోపాటే తల్లి, సోదరి కూడా ఉంటున్నారు. పోలీసుల వివరాల ప్రకారం షాలిని జార?ండ్‌లో ఓ కేసు ఎదుర్కొంటోంది. దాని కోసమే మనీశ్ సెలవు తీసుకున్నాడు. 2006లో జార?ండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలో షాలిని మొదటిస్థానంలో నిలిచారు. డిప్యూటీ కలెక్టర్‌గా నియమితులయ్యారు. అయితే, ఆ తర్వాత ఆమె ర్యాంకును అధికారులు రద్దు చేశారు. షాలిని నియామకాన్ని తొలగించారు. దీనిపై సీబీఐ విచారణ సైతం జరుగుతోంది. వారి ఆత్మహత్యకు ఇదే కారణమా? ఇంకేదైనా ఉందా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## డిప్యూటీ సీఎం భలే మాట అన్నారే.. ఆయన ఏమన్నారో తెలిస్తే..



**బెంగళూరు - నవభూమి:** కాంగ్రెస్ భిక్షతోనే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్రఎమ్మెల్యే అయ్యారని డీసీఎం డీకే శివకుమార్ తీవ్రంగా వ్యాఖ్యానించారు. నగరంలో శుక్రవారం ఓ కార్యక్రమంలో డీసీఎం డీకే శివకుమార్ మాట్లాడిన వేళ ఇప్పుడు పదవి వచ్చిందని విజయేంద్ర అన్నా అంటూ పిలుస్తారని, అతడు ఎమ్మెల్యే కావడం కాంగ్రెస్ భిక్ష అన్నారు. అతడిపై నాగరాజ్ వంటి బలమైన అభ్యర్థి రంగంలో ఉంటే విజయేంద్ర శాసనసభకు వచ్చేవారు కాదని ఎద్దేవా చేశారు.

బీజేపీ రెబెల్‌నేత బసనగౌడ పాటిల్‌యత్నాళ్ తరచూ విజయేంద్ర ఒప్పందపు రాజకీయాలు చేస్తున్నారని ఆరోపిస్తున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం బీజేపీ స్తబ్ధుగా కావడానికి కీలకనేతలు కాంగ్రెస్ రాష్ట్ర పెద్దలతో అడ్జస్టుమెంట్‌గా వ్యవహరిస్తుండడమే కారణమని వ్యాఖ్యానిస్తున్నారు. ఇదే తరుణంలోనే డీసీఎం డీకే శివకుమార్ వ్యాఖ్యలు మరింత బలాన్నిచ్చినట్లయింది.

## నెల తిరక్కమునుపే జిల్లా నేతలపై చర్యలు..

**చెన్నై-నవభూమి:** తమిళగ వెట్రికళగం ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా నియమితులైన జిల్లా కార్యదర్శులపై నెల రోజుల్లోనే ఆరోపణలు రావటంతో వారిపై క్రమశిక్షణా చర్యలు చేపట్టేందుకు ఆ పార్టీ నేత, నటుడు విజయ్ సిద్ధమవుతున్నారు. ఆరోపణలు వచ్చిన జిల్లా కార్యదర్శులపై చర్యలు తీసుకోవాలనిఇటీవలే పార్టీలో చేరిన ఆదవ్ అర్జున్‌కు అప్పగించారు. పార్టీ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా విజయ్ జిల్లా శాఖ నాయకులను నియమించారు.వీరందరిని వచ్చే యేడాది జరుగనున్న అసెంబ్లీ ఎన్నికలకు ఇప్పటి నుండే ప్రచారం చేయాలని, జిల్లా , నగరస్థాయిలో పార్టీని బలపరిచేందుకు కూడా పాటుపడాలని విజ్ఞప్తి చేశారు. వీరి నియామకాలు జరిగి నెల రోజులు కూడా కాకముందే కొందరు జిల్లా కార్యదర్శులు నగర, పట్టణ స్థాయి పదవులను అమ్ముకుంటున్నారని ఆరోపణలు వచ్చాయి. మరికొంతమంది జిల్లా శాఖ నాయకులు అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి అధికారంలో ఉన్నట్లుగా పార్టీ శ్రేణులతో వ్యవహరిస్తున్నారని గుర్తించారు. ఇంకొంతమంది ఇంటిపట్టునే ఉంటున్నారని తెలుసుకున్నారు. ఇలా సుమారు 20 శాతానికి పైగా జిల్లాశాఖ కార్యదర్శులపై ఆరోపణలు రావటంతో వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని విజయ్ నిర్ణయించారు.ఈవ్యవహారం పై దృష్టిసారించి చర్యలు చేపట్టే బాధ్యతలను ఆదవ్ అర్జునాకు ఆయన అప్పగించారు. దీంతో యేళ్ల తరబడి విజయ్ అభిమాన సంఘాల నాయకులుగా ఉంటూ ఇటీవల జిల్లా శాఖ పదవులు పొందిన పలువురు తమపై ఆదవ్ అర్జునా కఠిన చర్యలు తీసుకోనున్నట్లు తెలుసుకుని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# భార్యను భర్త కట్నం డిమాండ్ చేయడం క్రూరత్వం కాదు.. సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ-నవభూమి:** ఇటీవలి కాలంలో దేశవ్యాప్తంగా భార్యాబాధితుల కేసుల్లో వేధింపులు, ఒత్తిడి తట్టుకోలేక భర్తలు ఆత్మహత్యలు చేసుకుంటున్న సంఘటనలు పెరిగిపోతూ ఉన్నాయి. అయితే సామాన్యులే కాకుండా సెలబ్రిటీలు కూడా బలవన్మరణానికి పాల్పడుతుండటం మరింత ఆందోళన కలిగిస్తోంది. మొన్నటికి మొన్న ఒడిశాకు చెందిన ఓ ఫేమస్ ర్యాపర్.. భార్య వేధింపులు తట్టుకోలేక ప్రాణాలు తీసుకున్న సంఘటన తీవ్ర దుమారం రేగిన విషయం తెలిసిందే. అంతకుముందు బెంగళూరు టెకీ అతుల్ సుభాష్ ఘటనతో దేశం మొత్తం ఒక్కసారిగా ఈ భార్యా బాధితుల సంఘటనతో ఉలిక్కిపడింది. ఈ నేపథ్యంలోనే భార్యా బాధితులు.. సోషల్ మీడియా వేదికగా ఇలాంటివి అరికట్టాలని డిమాండ్ చేస్తున్నారు. అంతేకాకుండా మహిళలకు ఉన్న ప్రత్యేక చట్టాలను అడ్డు పెట్టుకుని.. భార్యలు భర్తలు, అతని కుటుంబ సభ్యులపై పగ తీర్చుకుంటున్నారనే వాదనలు ఎక్కువ అవుతున్నాయి.ఇలాంటి సమయంలోనే తాజాగా ఓ కేసు విచారణ సందర్భంగా.. సుప్రీంకోర్టు ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేసింది. కట్నం డిమాండ్ చేయడం క్రూరత్వం కాదని వెల్లడించింది. భార్య నుంచి భర్త కట్నం డిమాండ్ చేయడాన్ని క్రూరత్వంగా పరిగణించలేమని అత్యున్నత న్యాయస్థానం తేల్చి చెప్పింది. భర్త, అత్తమామల నుంచి పెళ్లి అయిన మహిళలకు రక్షణ కల్పించేందుకు 1983లో అప్పటి కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఐపీసీ సెక్షన్ 498ఏ ప్రకారం.. కట్నం డిమాండ్ క్రూరమైన నేరం కాదని స్పష్టం చేసింది. సెక్షన్ ప్రకారం 498ఏ ప్రకారం క్రూరత్వం అనేపదానికి విస్తృతమైన అర్థం ఉందని సుప్రీంకోర్టు వ్యాఖ్యలు చేసింది.

కట్నం కింద భార్య కుటుంబానికి సంబంధించిన ఆస్తులు గానీ.. విలువైన వస్తువులు గానీ ఇవ్వాలని డిమాండ్ చేయడం చట్టవిరుద్ధమేనని సుప్రీంకోర్టు తెలిపింది. అయితే కట్నం కోసం మహిళను శారీరకంగా, మానసికంగా వేధించడం మాత్రం క్రూరత్వం అవుతుందని స్పష్టం చేసింది. కేవలం భార్యను భర్త కట్నం డిమాండ్ చేశారనే ఆరోపణలతో 498ఏ సెక్షన్ కింద కేసు పెట్టకూడదని సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ ప్రసన్న బి.వరాలీలతో కూడిన ఇద్దరు సభ్యుల ధర్మాసనం గత ఏడాది డిసెంబర్ 12వ తేదీన ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే.

498ఏ సెక్షన్‌ను ఉపయోగిం చుకుని.. భర్త, అత్తమామలు, అత్తింటివారిపై కొందరు మహిళలు.. దుర్వినియోగం చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తిన నేపథ్యంలో సుప్రీంకోర్టు ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

# ముగింపు వేళ కుంభమేళాకు పోటెత్తిన భక్తులు..



**ప్రయాగ్‌రాజ్-నవభూమి:** ఉత్తర ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళా చివరి దశకు చేరుకుంది. కుంభమేళా ప్రారంభం అయి 41 రోజులు గడుస్తుండగా.. మొత్తంగా 60 కోట్లకు పైగా భక్తులు ప్రయాగ్‌రాజ్ చేరుకుని గంగ, యమున, సరస్వతీ నదులు కలిసే త్రివేణీ సంగమం వద్ద పుణ్య స్నానాలు ఆచరించారు. మరో నాలుగు రోజుల్లోనే ఈ మహా కుంభమేళా ముగుస్తుండగా.. మరో 5 కోట్లకు పైగా జనాలు వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. చివరి రోజు శివరాత్రి పర్వదినం సందర్భంగా మరింత ఎక్కువ మంది పుణ్య స్నానాలు ఆచరించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఆ పూర్తి వివరాలు మీకోసం.ప్రపంచంలోని అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుకగా పేరొందిన మహా కుంభమేళాకు గతంలో ఎప్పుడూ లేనంతగా ఆదరణ లభించింది. ఎవరూ ఊహించని స్థాయిలో భక్తులు ప్రయాగ్‌రాజ్ చేరుకుని పుణ్య స్నానాలు చేస్తున్నారు. దేశం నలుమూలల నుంచే కాకుండా విదేశాల నుంచి సైతం అనేక మంది ప్రముఖులు కుంభమేళాకు వచ్చారు. పుణ్యస్నానాలు ఆచరించి.. ఆపై అనేక ఆలయాలను దర్శించుకున్నారు. జనవరి 13వ తేదీన ఈ కుంభమేళా ప్రారంభం కాగా ఈరోజు వరకు మొత్తంగా 60 కోట్లకు పైగా భక్తులు పుణ్య స్నానాలు ఆచరించినట్లు యూపీ సర్కారు చెబుతోంది. కేవలం 41 రోజుల్లోనే ఇంతమంది రావడం చూసి హర్షం వ్యక్తం చేసింది.45 రోజుల పాటు జరిగిన ఈ కుంభమేళాకు కేవలం 45 కోట్ల మంది భక్తులు మాత్రమే వచ్చే అవకాశం ఉందని అధికారులు ముందుగా భావించారు. కానీ రోజుకు కోటికి పైగా భక్తులు వచ్చి యూపీ సర్కారుకు షాక్ ఇచ్చారు. ఇక పండుగల రోజు మరింత ఎక్కువ మంది వచ్చారు. ముఖ్యంగా సంక్రాంతి పండుగ సందర్భంగా, మౌని అమావాస్య, వసంత పంచమి, మాఘ పూర్ణిమ వంటి రోజుల్లో కోట్లలో భక్తులు వచ్చి పుణ్య స్నానాలు ఆచరించారు. ఇలా కేవలం 34 రోజుల్లోనే 50 కోట్ల మంది వచ్చి రికార్డు సాధించారు. దీంతో అధికారుల అంచనా తప్పింది.

ఆపై కుంభమేళా ముగిసేసరికి 60 కోట్ల మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నట్లు యూపీ సర్కారు తెలిపింది. కానీ నాలుగు రోజులకు ముందే ఈ రికార్డు కూడా బ్రేక్ కాగా.. సీఎం యోగి ఆదిత్య నాథ్ హర్షం వ్యక్తం చేశారు. మహాకుంభ్ శక్తిని యావత్ ప్రపంచం కీర్తిస్తోందని పేర్కొన్నారు. మన రాష్ట్ర సామర్థ్యం, అభివృద్ధిపై నమ్మకం లేని వారు కుంభమేళాపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. అంతేకాకుండా మరో నాలుగు రోజుల్లో 5 కోట్లకు పైగా జనాలు వస్తారని.. శివరాత్రి సందర్భంగా భక్తుల సంఖ్య మరింతగా పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. చూడాలి మరి ఏం

## బీజేపీ రాష్ట్ర చీఫ్ ఆసక్తికర కామెంట్స్.. ఆయన ఏమన్నారో తెలిస్తే..




**చెన్నై-నవభూమి:** అవినీతి డీఎంకే( ప్రభుత్వాన్ని ప్రజలే ఇంటికి సాగనంపుతారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై జోస్యం చెప్పారు. ఆయన శుక్రవారం మీడియాతో మాట్లా డుతూ... రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖల్లో అవినీతి బాగా పెరిగిందని, మరోవైపు శాంతిభద్రతలు క్షీణిచాఆయని, డీఎంకే ప్రభుత్వానికి గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.హిందీ భాషను వ్యతిరేకిస్తూ రాష్ట్రంలో నిర్వహించిన ఉద్యమంలో పాల్గొన్న 15 మంది తమిళులు ప్రాణత్యాగం చేశారని అయితే, వీరి కుటుంబాల్లోని ఒక్కరికి కూడా డీఎంకో గానీ, ప్రభుత్వంలో నామినేటెడ్ పదవులు కట్టబెట్టలేదని, కేవలం ఒకే కుటుంబం మాత్రమే ఆధిక్యం చెల్లిస్తోందని ఆయన వ్యాఖ్యానించారు. దేశాన్ని అభివృద్ధి బాటలోకి నడిపిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీని 'గెటౌట్ మోదీ' అని సంభోధించే వారిని ప్రజలు రాజకీయాల నుంచి వెలివేస్తారన్నారు.కేంద్రంలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ సంకీర్ణ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో డీఎంకే భాగస్వామ్యం వహించిందని, అప్పుడు రాష్ట్రానికి రూ.8,053 కోట్లు మాత్రమే కేటాయించారని, ఈ వాస్తవం తెలియక డీఎంకే సహా మిత్రపక్షాలు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా విమర్శలు చేయడం సరికాదని అన్నామలై అన్నారు.

## 'ఉమెన్ ఆఫ్ ద ఇయర్'గా పూర్ణిమా దేవి



**వాషింగ్టన్-నవభూమి:** అసోంకు చెందిన ప్రముఖ జీవశాస్త్రవేత్త, వన్యప్రాణుల సంరక్షకురాలు పూర్ణిమా దేవి బర్మన్ (45)కు అరుదైన గౌరవం లభించింది. 2025కు గాను టైమ్ మేగజైన్ ప్రకటించిన 'ఉమెన్ ఆఫ్ ద ఇయర్' జాబితాలో ఆమెకు స్థానం దక్కింది. మెరుగైన, మరింత సమానమైన ప్రపంచం కోసం పనిచేస్తున్న 'అసాధారణ నాయకుల'కు ఇచ్చే ఈ అవార్డుకు ప్రపంచ వ్యాప్తంగా 13 మంది మహిళలు ఎంపిక కాగా, భారత్ తరఫున పూర్ణిమా దేవిని మాత్రమే వరించింది. అసోంకు చెందిన 45 ఏళ్ల పూర్ణిమా దేవి జంతుశాస్త్రంలో మాస్టర్స్ చేశారు. అనంతరం స్థానికంగా ఉండే గ్రేటర్ అడ్జటంట్ జాతికి చెందిన పెద్ద కొంగలపై పీహెచ్‌డీ చేయాలనుకున్నారు. ఈ క్రమంలోనే అవి అంతరించిపోవడాన్ని గుర్తించారు. 2007 నుంచి వాటి సంరక్షణకు పాటుపడుతున్నారు. ఇందుకోసం 'హర్‌గిలా ఆర్మీ' పేరిట మహిళలతో ఓ బృందాన్ని ఏర్పాటు చేశారు. ఓ అంచనా ప్రకారం 2007లో అసోంలో మిగిలున్న 450 గ్రేటర్ అడ్జటంట్ కొంగల సంఖ్య 2023 నాటికి 1800కు పెరిగింది.

# మగవారికి గుడ్‌న్యూస్.. మహిళల ఉచిత బస్సు పథకం ఇబ్బంది ఇక తప్పినట్లే..!



**బెంగుళూరు-నవభూమి:** మహిళలకు ఉచిత బస్సు పథకం అమలు చేసినప్పటి నుంచి బస్సులో నిత్యం గొడవలు, కొట్లాటలు జరుగుతూనే ఉన్నాయి. ఇక మహిళలకు ఉచిత ప్రయాణం కావడంతో వారు భారీగా బస్సులు ఎక్కడం వల్ల పురుషులు టికెట్లు కొన్నా సీట్లు దొరకని పరిస్థితి నెలకొంది. దీంతో పురుషులు ఎప్పటికప్పుడు ప్రభుత్వంపై, ఆర్టీసీపై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తూనే ఉన్నారు. తాము డబ్బులు పెట్టి టికెట్లు కొన్నా కనీసం బస్సులో నిలబడే పరిస్థితి లేదని వాపోతున్నారు. అయితే ఈ కష్టాలకు చెక్ పెట్టేందుకు ఆర్టీసీ కీలక నిర్ణయం తీసుకుంది.దేశంలోని పలు రాష్ట్రాల్లో మహిళలకు ఉచిత బస్సు పథకం అమలు అవుతోంది. అయితే ఈ పథకం ద్వారా ఆయా రాష్ట్రాల్లోని స్థానికంగా ఉన్న మహిళలు అందరికీ ఉచితంగా బస్సులో ప్రయాణించే అవకాశం కల్పించారు. కానీ ఈ పథకం వల్ల అనేక విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే ఆర్థికంగా నష్టాల్లో కొట్టుమిట్టాడుతున్న ఆర్టీసీలకు ఈ పథకం ద్వారా మరింత ఆర్థిక లోటు వస్తోందని ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా ఉచిత ప్రయాణం అనగానే మహిళలు తండోప తండాలుగా బస్సుల్లోకి రావడంతో భారీగా రద్దీ నెలకొంటోంది. ఇక సీట్ల కోసం మహిళలు సిగపట్లు పట్టుకుని కొట్టుకుంటున్న దృశ్యాలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తూనే ఉన్నారు. దీనికితోడు.. పురుషులకు సీట్లు లేకుండా మొత్తం మహిళలే ఆక్రమిస్తున్నారు. పురుషులకు ఇలాంటి ఇబ్బం దులు లేకుండా తాజాగా ఆర్టీసీ ఒక ఉపాయం ఆలోచించి.. అమలు చేస్తోంది.అయితే ఈ నిర్ణయం తీసుకుంది మన పొరుగున ఉన్న కర్ణాటక రాష్ట్రం. తెలంగాణతోపాటు కర్ణాటక లోనూ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండగా.. తెలంగాణ కంటే ముందే ఈ ఉచిత బస్సు పథకాన్ని ఆ రాష్ట్రంలో అమలు చేస్తున్నారు. ఇక కర్ణాటకలోని బస్సుల్లో పురుషులకు కూర్చేనేం దుకు కాదు కదా.. కనీసం నిలబడేందుకు కూడా కొన్ని సార్లు చోటు ఉండటం లేదు. దీనిపై చాలా మంది పురుషులు ఇప్పటికే చాలాసార్లు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే బస్సుల్లో కొన్ని సీట్లు పురుషులకు కేటాయించాలని కర్ణాటక ఆర్టీసీకి సిద్ధరామయ్య ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.అయితే బస్సుల్లో పురుషులకు కేటాయించిన సీట్లను కూడా మహిళా ప్రయాణికులు ఆక్రమించుకుంటున్నారనే వెల్లువెత్తిన ఫిర్యాదుల నేపథ్యంలో కర్ణాటక రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ మైసూరు నగర విభాగం శుక్రవారం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. బస్సుల్లో పురుషులకు నిర్దేశించిన సీట్లలో వాళ్లనే కూర్చునేలా చూడాలని ఆర్టీసీ సిబ్బందిని ఆదేశించింది. 2023లో కర్ణాటకలో మహిళలకు ఉచిత ప్రయాణాన్ని అనుమతించే శక్తి పథకాన్ని ప్రవేశపెట్టిన సందర్భంగా.. బెంగళూరు మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ మినహా రాష్ట్రంలోని అన్ని రవాణా సంస్థలు పురుషులకు 50 శాతం సీట్లు రిజర్వ్ చేయాలని కర్ణాటక ప్రభుత్వం ఆదేశించింది. అయితే పురుషులకు కేటాయించిన సీట్లలో మహిళలు కూర్చోవచ్చు.. కానీ వారు వచ్చి అడిగితే మాత్రం మహిళలు అందులో నుంచి లేవాల్సి ఉంటుంది. కానీ ఈ విధానం సరిగా అమలు కాకపోవడంతో పురుషులకు నిలబడాల్సి వస్తుంది.ఈ క్రమంలోనే ఎస్ విష్ణువర్ధన అనే ప్రయాణికుడు.. కర్ణాటక ఆర్టీసీకి ఫిర్యాదు చేశాడు. పురుషుల సీట్లను కూడా మహిళలు ఆక్రమించుకుంటున్నారని.. అందువల్ల పురుషులకు సీట్లు దక్కకుండా చేస్తున్నారని ఆరోపించారు. ఈ ఫిర్యాదుతో అలర్ట్ అయిన మైసూరు నగర యూనిట్ డివిజనల్ కంట్రోలర్ తాజాగా ఒక నోటీస్ జారీ చేశారు. ఇకపై పురుషులకు కేటాయించిన సీట్లలో వాళ్లే కూర్చునేలా ఆర్టీసీ సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.

## హథ్రాస్ తొక్కిసలాటలో భోలే బాబాకు క్లీన్ చిట్




**ప్రయాగ్‌రాజ్-నవభూమి:** ఉత్తరప్రదేశ్‌లోని హథ్రాసలో జరిగిన తొక్కిసలాటతో భోలే బాబాకు ఎలాంటి సంబంధం లేదంటూ న్యాయ విచారణ కమిషన్ క్లీన్ చిట్ ఇచ్చింది. ఇందుకు కార్యక్రమ నిర్వాహకులు, స్థానిక అధికారులు, పోలీసులదే బాధ్యత అని తెలిపింది.

**హథ్రాస్ తొక్కిసలాటలో భోలే బాబాకు క్లీన్ చిట్**

లఖ్‌నవూ, ఫిబ్రవరి 21: ఉత్తరప్రదేశ్‌లోని హథ్రాసలో జరిగిన తొక్కిసలాటతో భోలే బాబాకు ఎలాంటి సంబంధం లేదంటూ న్యాయ విచారణ కమిషన్ క్లీన్ చిట్ ఇచ్చింది. ఇందుకు కార్యక్రమ నిర్వాహకులు, స్థానిక అధికారులు, పోలీసులదే బాధ్యత అని తెలిపింది. గత ఏడాది జులై రెండో తేదీన విశ్వ హరి భోలే బాబా పాల్గొన్న సత్సంగ్‌లో తొక్కిసలాట జరగడంతో 121 మంది ప్రాణాలు కోల్పోయారు. దీనిపై విచారణ జరిపిన జ్యుడీషియల్ కమిషన్.. భక్తుల సంఖ్యకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేయని నిర్వాహకులదే తప్పని తేల్చింది.

## ఇందిరాగాంధీ బామ్మ అంటూ మంత్రి రచ్చ.. అసెంబ్లీలోనే నిద్రపోయిన ఎమ్మెల్యేలు!



**జైపూర్-నవభూమి:** మాజీ ప్రధాన మంత్రి ఇందిరా గాంధీని దాది (బామ్మ) అంటూ ఓ మంత్రి కామెంట్లు చేయడంతో.. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు నిరసన చేపట్టారు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతుండగానే ఈ రచ్చ మొదలు కాగా స్పీకర్ హస్తం పార్టీకి చెందిన ఎమ్మెల్యేలను అసెంబ్లీ నుంచి బహిష్కరించారు. కానీ వాళ్లు మాత్రం అక్కడి నుంచి కదలకుండా ధర్నా నిర్వహించారు. ఎవరేం చెబుతున్నా పట్టించుకోకుండా.. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో సభ అనేక సార్లు వాయిదా పడి, ముగిసినా వారు అక్కడి నుంచి కదల్లేదు. ముఖ్యంగా శుక్రవారం రోజు రాత్రి కూడా అక్కడే పడుకుని తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ ఘటన ఎక్కడ జరిగిందో మనం ఇప్పుడు తెలుసుకుందాం. శుక్రవారం రోజు రాజస్థాన్ అసెంబ్లీ సమావేశాలు జరిగాయి. ఈక్రమంలోనే ఆ రాష్ట్ర మంత్రి అవినాష్ గెహ్లోత్ మాజీ ప్రధాని ఇందిరా గాంధీపై షాకింగ్ కామెంట్లు చేశారు. ముఖ్యంగా ఇందిరా గాంధీ పేరుతో వర్కింగ్ వుమెన్స్ హాస్టళ్లను గత ప్రభుత్వం ప్రారంభించిందని ఆ మంత్రి పేర్కొన్నారు. అయితే ఈ సమయంలో ఇందిరా గాంధీ పేరు ప్రస్తావించకుండా.. ఆప్కీ దాది (మీ అమ్మమ్మ) అని కాంగ్రెస్ ఎమ్మెల్యేలను ఉద్దేశించి మాట్లాడారు. దీంతో హస్తం పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు అభ్యంతరం వ్యక్తం చేశారు. దాదీ వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని కోరుతూ నిరసన చేపట్టారు.రాజస్థాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ వెల్‌లోకి దూసుకెళ్లారు. దీంతో స్పీకర్ ధర్నా చేస్తున్న ఏడుగురు ఎమ్మెల్యేలు గోవింద్ సింగ్ దోస్తారా, రాంకేశ్ మీనా, అమిన్ కాగ్జి, జాకీర్ హుస్సేన్, హకమ్ అలీ, సంజయ్ కుమార్‌లను అసెంబ్లీ నుంచి బహిష్కరించారు. కానీ వారు మాత్రం అక్కడి నుంచి కదల్లేదు. దీంతో చేసేదేమీ లేక స్పీకర్ సభను వాయిదా వేశారు. అయినప్పటికీ హస్తం పార్టీ ఎమ్మెల్యేలు అక్కడి నుంచి బయటకు వెళ్లలేదు. ఇలా చాలా సార్లు సభ వాయిదా పడగా.. ఇదే తంతు కొనసాగింది. దీంతో సభను సోమవారం రోజు ఉదయం 11 గంటలకు వాయిదా వేశారు. అయినప్పటికీ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీలోనే ఉండిపోయారు.

మంత్రి అవినాష్ గెహ్లోత్ మాజీ ప్రధానిపై చేసిన దాదీ వ్యాఖ్యలను వెనక్కి తీస్కోవాలని డిమాండ్ చేస్తూ ధర్నా కొనసాగించారు. ముఖ్యంగా రాత్రి కూడా అక్కడే పడుకున్నారు. ఈ నిరసనలో ఆ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గోవింద్ సింగ్ దోస్తారా కూడా పాల్గొన్నారు. మరి శని, ఆది వారాలు కూడా అసెంబ్లీలోనే ఉండి నిరసనను కొనసాగిస్తారా లేక ఇళ్లకు వెళ్లిపోతారా అనేది చూడాలి.

## నకిలీ నోట్లను ముద్రించే ముఠాల గుట్టు రట్టు

**న్యూఢిల్లీ-నవభూమి:** దేశవ్యాప్తంగా నకిలీ కరెన్సీ నోట్లను ముద్రించే ముఠాల గుట్టు రట్టయింది. డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటలిజెన్స్(డీఆర్ఐ) అధికారులు ఏకకాలంలో దేశంలోని 11 వేర్వేరు ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. మహారాష్ట్ర, హరియాణా, తెలంగాణ, తమిళనాడు, బిహార్ రాష్ట్రాల్లో ఈ నెల 20న దాడులు చేశారు. ఏడు చోట్ల నకిలీ కరెన్సీ నోట్లను ముద్రిస్తున్నట్లు గుర్తించారు. ఈ నెల 8న డీఆర్ఐ జరిపిన తనిఖీల్లో నకిలీ నోట్ల ముద్రణకు సంబంధించి ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేశారు. వీరు కరెన్సీ నోట్లలో వాడే భద్రతాపరమైన, ఆర్‌బీఐ, భారత్ అనే అక్షరాలతో కూడిన దారంతోపాటు అత్యంత నాణ్యమైన పేపర్‌ను దిగుమతి చేసుకుంటున్నారని గుర్తించారు. అనంతరం ఈ నెల 9న జరిపిన దాడుల్లో మహారాష్ట్రలోని థానే, హరియాణాలోని భివానీలో రెండు నకిలీ కరెన్సీ నోట్ల ముద్రణ స్థావరాలను కనుగొన్నారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in





## ప్రారంభమైన యమునా నదిలో కాలుష్య ప్రక్షాళన

**న్యూఢిల్లీ-నవభూమి:** దేశ రాజధాని న్యూఢిల్లీలోని యమునా నదిలో కాలుష్య ప్రక్షాళన పనులు ప్రారంభమైనాయి. ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం.. ఇంకా చెప్పాలంటే.. ముఖ్యమంత్రిగా రేఖా గుప్తా బాధ్యతలు చేపట్టే రెండు రోజుల ముందు ఈ నదీ ప్రక్షాళన కార్యక్రమం మొదలైంది. యమునను శుభ్రపరిచే కార్యక్రమాన్ని పక్కా ప్రణాళికతో.. యంత్రాల సహాయంతో నదిలో చెత్తను తీసి వేస్తున్నారు.అందుకోసం ఢిల్లీ ప్రభుత్వం పక్కా కార్యాచరణ రూపొందించింది. అందులోభాగంగా.. చెత్త స్కిమ్మర్లు, కలుపు మొక్కలు తీసే యంత్రాలతో నదిలో క్లీనింగ్ పనులు చేపట్టారు. యమునా నదిని శుభ్రం చేసేందుకు బహుముఖ వ్యూహంతో ప్రభుత్వం ముందుకు వెళ్లోంది. మూడు సంవత్సరాల్లో యమునా నదిని ప్రక్షాళన చేయడమే లక్ష్యంగా ఢిల్లీ ప్రభుత్వం నిర్దేశించుకొంది. బీజేపీ మేనిఫెస్టోలో..అయితే ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో.. తాము అధికారంలోకి వస్తే.. యమునా నదిని శుభ్రం చేస్తామని బీజేపీ తన మేనిఫెస్టోలో పొందు పరిచింది. నదిని పునరుద్ధరించడంలో భాగంగా యమునను శుభ్రపరిచి.. ఆ నీటిని సాగు, తాగు నీటికి వినియోగించేందుకు కృషి చేస్తామని స్పష్టం చేసింది. ఇక ఈ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించింది. దీంతో యమున నదిని శుభ్రపరిచే కార్యక్రమానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.



## వీసీలను ముఖ్యమంత్రులే ఎందుకు నిర్ణయించాలి?

విశ్వవిద్యాలయాల ఉపకులపతులను ఎంపిక చేయడానికి గాను యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ జనవరి 7న కొత్త నియమాలను విడుదల చేసింది. ఇకపైన దేశం మొత్తంలో వీసీల ఎంపిక ఈ నియమాల ప్రకారమే జరగాలని, లేకుంటే ఆ విశ్వవిద్యాలయాలకు గుర్తింపు ఉండదని, అంతేగాక యూజీసీ నుంచి నిధులు ఉండవని, అసలు ఉన్నత విద్యాసంస్థల జాబితా నుంచే ఆ విశ్వవిద్యాలయాలను తొలగిస్తామని యూజీసీ స్పష్టంగా చెప్పింది. ఈ కొత్త నియమాల ప్రకారం వీసీలను ఎంపిక చేసే సెర్చ్ కమ్ సెలెక్షన్ కమిటీని ఆయా రాష్ట్రాల గవర్నర్లు నియమిస్తారు. ఇందులో ముగ్గురి నుండి ఐదుగురు సభ్యులు ఉండవచ్చు. వీసీల ఎంపికకు దేశవ్యాప్త నోటిఫికేషన్ వస్తుంది. అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. పది సంవత్సరాల అనుభవం ఉండాలి. కేవలం ప్రొఫెసర్లు మాత్రమే కాకుండా పరిశ్రమల రంగంలో కాని ఇతర విద్యా కళా శాస్త్ర రంగాలలోని సంస్థలలో పది సంవత్సరాలపాటు పనిచేసిన ప్రతిభావంతులైనవారు, అనుభవజ్ఞులు దరఖాస్తు చేసుకోవచ్చు. వయోపరిమితి 65 సంవత్సరాల లోపున ఉండాలి లేదా 70 సంవత్సరాల లోపున పదవి ముగియాలి. రెండోసారి కూడా ఎంపిక కావచ్చు. ఇవి వీసీల నియామకానికి నిర్ణయించిన నియమాలు, అర్హతలు.ఈ కొత్త నియమాలపైన మిశ్రమ స్పందన వచ్చింది. ఇది రాష్ట్రాలకు ఉన్న అధికారాలను తీసివేసి పూర్తిగా కేంద్ర ప్రభుత్వం చేతిలోనికి తీసుకోవడమని, ఫెడరల్ స్ఫూర్తికి వ్యతిరేకమని వేరు వేరు రంగాల ప్రముఖులు విమర్శించారు. ప్రొఫెసర్ల నుండి కూడా ఒక పక్షం నుండి విమర్శలు వచ్చాయి. ముఖ్యమంత్రులు కొందరు వ్యతిరేకించారు. కాని ఒక రకంగా చూస్తే ఈ నియమాలు ఇంతకుముందు వాటికన్నా మంచివేనని చెప్పడానికి వీలుంది. ప్రధానంగా రాష్ట్రాలలో ఉన్న మితిమీరిన రాజకీయ జోక్యాన్ని ఇది తగ్గిస్తుందని గట్టిగా చెప్పవచ్చు.ఇప్పటిదాకా ఉన్న నియమాల ప్రకారం వీసీల ఎంపిక నోటిఫికేషన్‌కు స్పందించి దరఖాస్తు చేసుకున్నవారి నుంచి ఎంపిక చేస్తున్నారు. సెర్చ్ కమ్ సెలెక్షన్ కమిటీ ముగ్గురు సభ్యులతో ఉంటుంది. ఒక సభ్యుడు ఆ యూనివర్సిటీకి చెందిన ఎగ్జిక్యూటివ్ కమిటీ ఎంపిక చేసిన అభ్యర్థి, మరొకరు యూజీసీ నామినీ, ఇంకొకరు రాష్ట్ర ప్రభుత్వం తరపున సభ్యుడు ఉంటారు. ఈ సభ్యుడు రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరి కానీ లేదా మరొక తుల్యమైన అధికారి కాని కావచ్చు. వీరు వచ్చిన దరఖాస్తుల నుండి ముగ్గురు అభ్యర్థుల జాబితాను ఎంపిక చేసి గవర్నర్‌కి పంపిస్తే అందులో ఒక పేరును గవర్నర్ ఎంపిక చేస్తే, ఆ వ్యక్తి వీసీగా నియమితుడు అవుతాడు. ఇది జరగవలసిన పద్ధతి.

కానీ ఈ జరగవలసిన పద్ధతిలో ఎప్పుడూ జరగలేదు. పోలీస్ విచారణ ద్వారా అభ్యర్థుల ఉద్యోగ వ్యక్తిగత నేపథ్యాలను, అతని కార్యనిర్వహణ దక్షత, నిజాయితీ వగైరా వివరాలను సేకరించి దాని ఆధారంగా జాబితాను కుదిస్తారు. వారిలో నుండి ముగ్గురు అభ్యర్థులను ఎంపిక చేస్తారు. సెర్చ్ కమిటీ అనే పేరు వచ్చిన కారణం ఒకటి ఉంది. గొప్ప వ్యక్తులు కాని లేదా ఆయా రంగాలలో గొప్ప సేవలు చేసినవారు కాని దరఖాస్తు చేసుకోకపోయినా కూడా అటువంటి నిపుణులను సెర్చ్ కమిటీ ఎంపిక చేసి గవర్నర్‌కి పంపించవచ్చు. అందుకే దీన్ని 'సెలక్షన్' కమిటీ అని మాత్రమే అనకుండా 'సెర్చ్ కమ్ సెలెక్షన్ కమిటీ' అన్నారు. కానీ ఇలాంటి అవకాశాన్ని ఏ కమిటీ కూడా ఉపయోగించుకున్న దాఖలాలు తెలుగు రాష్ట్రాలలో కాని ఇతర రాష్ట్రాలలో కాని కనిపించవు. ఈ దరఖాస్తు పద్ధతి లేని పూర్వపు రోజులలో ప్రభుత్వం రాజకీయ జోక్యం లేకుండా ఇలాంటి గొప్పవారిని, నిపుణులను వీసీలుగా ఎంపిక చేశాయి. జడ్జీలు, గొప్ప శాస్త్రవేత్తలు అలా వీసీలుగా ఎంపికైనారు. ఆ మంచి రోజులను నేడు ఊహించలేము.నేడు జరుగుతున్న ఎంపిక ఈ నియమ నిబంధనలు అన్నింటినీ తుంగలో తొక్కి పూర్తిగా రాజకీయమయంగా సాగుతున్నది. ముఖ్యమంత్రులే నేరుగా జోక్యం చేసుకొని వారికి నచ్చిన అభ్యర్థి పేరును ప్రభుత్వ నామినీ ద్వారా సెర్చ్ కమిటీలోకి తెచ్చి తక్కిన రెండూ డమ్మీ పేర్లు పెట్టించి ఆ ముగ్గురు అభ్యర్థుల జాబితాని గవర్నర్‌కి పంపించడం, ప్రభుత్వం విషయంలో నేనెందుకు జోక్యం చేసుకోవడం అని గవర్నర్లు ప్రభుత్వ ప్రతినిధి సూచించిన వ్యక్తినే వీసీగా ఎంపిక చేసి పంపించడం అనే ప్రహసనం దాదాపు అన్ని రాష్ట్రాలలోనూ జరుగుతున్నది. ఈ రాజకీయ జోక్యం అన్నిటికన్నా తమిళనాడులోనే ఎక్కువ ఉందని వార్తలు వచ్చాయి. అందుకే తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ ఈ కొత్త నియమాలను పూర్తిగా వ్యతిరేకిస్తూ ప్రకటన చేశారు.ఈ రాజకీయ తంతు వేర్వేరు రాష్ట్రాలలో ఎన్ని రకాలుగా ఉందో ఇక్కడ ఒకసారి గమనించవచ్చు. ఒక కులసంఘం నాయకుడు తమ ప్రాపకంలోని ఒక ఆచార్యుని తమ కులానికే చెందిన లేదా తన జిల్లాకే చెందిన మంత్రివర్యుని వద్దకు తీసుకుపోయి మన అభ్యర్థిని వీసీని చేయాలని కోరడం, సదరు మంత్రి ముఖ్యమంత్రితో ఆ పని చేయించడం ఒక పద్ధతి. లేదా ఒక మంత్రే తమ అభ్యర్థిని ఏ విధమైన ప్రభావంతోనైనా, ప్రాధాన్యంతోనైనా సరే ఎంపిక చేసుకొని ముఖ్యమంత్రితో ఎంపిక చేయించడం ఇంకో పద్ధతి. ముఖ్యమంత్రి ఆశీస్సులే ఒక అభ్యర్థికి నేరుగా ఉండి ఎంపిక కావడం మరో పద్ధతి. ఈ క్రమంలోనే వీసీలుగా అగ్రకులాలవారు కొందరు, బీసీలు కొందరు, మైనారిటీలు కొందరు, ఎస్సీ ఎస్టీలు కొందరు ఎంపిక అవుతారు. మేము సామాజిక న్యాయాన్ని పాటించి అభ్యర్థులను ఎంపిక చేశాం అని ప్రభుత్వాలు గర్వంగా చెప్పుకుంటాయి. కానీ అసలు పాటించింది తమకు కావలసిన రాజకీయ న్యాయాన్ని. ఒక మంత్రిగారు "నా జిల్లాలో వీసీ పదవిని నాకు తెలియకుండా, నేను చెప్పిన వారికి కాకుండా ఎలా ఎంపిక చేస్తారు" అన్నారట! ఈ క్రమంలో నిపుణులైనవారు, పరిపాలన అనుభవం ఉన్నవారు, విజ్ఞులైనవారు కాకుండా, అయోగ్యులైన వారు ఎంపిక కావడం చాలాసార్లు జరిగింది.ఈ పద్ధతితో పోలిస్తే వీసీల సెర్చ్ కమిటీ ఎంపిక గవర్నర్ ద్వారా జరిగితేనే రాజకీయ జోక్యం బాగా తగ్గే వీలుంది అని స్పష్టంగా చెప్పవచ్చు. ఎన్నో గ్రంథాలు రాసి, జాతీయ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొంది, నిజాయితీ కలిగిన అభ్యర్థులు ఎంపిక కాకుండా, ఒక్క పుస్తకం కూడా రాయనివారు, కొద్ది నెలలు కూడా పరిపాలన అనుభవం లేనివారు వీసీలుగా ఎంపికైన దుర్మార్గపు పరిస్థితులు ఇప్పటి దాకా చాలా జరిగాయి. వీసీలను ముఖ్యమంత్రి, మంత్రులు ఎంపిక చేసే ఈ దుష్ట రాజకీయ సంప్రదాయం కన్నా గవర్నర్ ద్వారా చేసే పద్ధతిలోనే రాజకీయ జోక్యం దూరంగా ఉండే అవకాశం ఉంటుంది. అంతే కాదు, కొత్త నియమాల ద్వారా శాస్త్ర కళా రంగాలకు, పరిశ్రమల రంగానికి కూడా చెందిన నిపుణులు అనుభవజ్ఞులు కూడా వీసీలు అయ్యే అవకాశం ఉంది. కనుక ఈ యూజీసీ కొత్త నియమాలను, కనీసం ఒక ప్రయోగ స్థాయికైనా అంగీకరించి అమలు చేస్తే మంచిది. రాజకీయ జోక్యం రాష్ట్ర మంత్రులు, ముఖ్యమంత్రుల స్థాయిలో జరిగే దానికీ దీనికీ ఉన్న తేడాని గమనించి ఏది ఉత్తమమైనదో నిర్ణయించుకునే అవకాశమైనా దీనివల్ల దొరుకుతుంది.

# చిన్న లాజిక్ మిస్సైన పాలకుడు!



**పెద్ద అపవాదును మూటగట్టుకున్న ముఖ్యమంత్రి!!**
**మాజీ ఎమ్మెల్యే గుమ్మడికి నో అపాయింట్మెంట్!**
**గతం దొరల పాలన అన్నారు, అధికారంలోకి వచ్చారు**
**ప్రగతి భవన్‌ను ప్రజా భవన్‌గా పేరు మార్చి ఇనుప కంచె తొలగిస్తే సరిపోతుందా!**
**ఆచరణతో ప్రజల గుండెల్లో గూడు కట్టుకోవాలి**
**తెలంగాణకు సర్వస్వం నేనే అనుకున్న కెసిఆర్‌నే ఫాం హౌస్‌కి పరిమితం చేసిన తెలంగాణ ఓటర్లు**

ఉన్నత పదవుల్లో ఉన్న వారు చిన్న లాజిక్ ను మిస్సై పెద్ద అపవాదును మూటగట్టుకుంటారంటే ఇదే కాబోలు. ఇప్పుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అదే చిన్న లాజిక్‌ను మిస్సై పెద్ద అపవాదునే మూటగట్టుకున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇల్లెందు నుండి ఐదు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య ఎన్ని సార్లు ప్రయత్నించినా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అపాయింట్మెంట్ ఇవ్వకపోవడం మెయిన్ స్ట్రీమ్ మీడియాలో నేడు అది పెద్ద వార్త అయ్యింది. ప్రముఖ దినపత్రిక ఈనాడు లో సైతం కార్టూన్ వరకు వెళ్లిందంటే గుమ్మడి నర్సయ్య ఎంతటి ప్రాముఖ్యత కలిగిన వ్యక్తో అర్థం చేసుకోవచ్చు. అధికారంలోకి వచ్చిన రాజకీయ నాయకులు గతాన్ని మర్చిపోతారంటే ఇదే మరి. అధికారంలోకి వచ్చిన వారు గతంలో ప్రతిపక్షంలో ఉన్న రోజులను మర్చిపోతున్నారు. అలా మర్చిపోయి పాలన చేసిన వారిని ఓటర్లు మరలా ప్రతి పక్షానికి పరిమితం చేస్తున్న విషయాన్ని మర్చిపోకూడదు. ఇది చరిత్రలో జరుగుతున్న నగ్న సత్యం కూడాను. ఉద్యమ పార్టీ నాయకుడిగా, తెలంగాణ తెచ్చిన వాడిగా, తెలంగాణ గాంధీగా తన అనుచర గణంతో కీర్తించబడి, ఇక తెలంగాణ రాష్ట్రానికి నేను, నా వారసులే పాలన చేస్తారని కలలు కని పదేళ్ల పాటు తెలంగాణ రాష్ట్రాన్ని ఏలిన కల్వకుంట్ల చంద్రశేఖర రావు ని, అదే తెలంగాణ ఓటర్లు ఫాం హౌస్ కి పరిమితం చేశారు. కెసిఆర్ ది దొరల పాలన, గడీల పాలన అంటూ గొంతు

**అభిప్రాయం**




చించుకున్నారు ఆనాడు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా ఉన్న నేటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. బిఆర్ఎస్ కి ప్రత్యామ్నాయం కాంగ్రెస్ పార్టీ మాత్రమే కనిపించడం మూలంగా బోటాబోటీన గెలుచుకున్న సీట్లతో రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి పీఠం అధిరోహించారు. సీట్లో కూర్చున్న వెంటనే చేసిన గొప్ప పని ఏదైనా ఉందంటే ప్రగతి భవన్‌ను ప్రజా భవన్‌గా పేరు మార్చి ఇనుప కంచెను తొలగించడం. ముఖ్యమంత్రి పాలన ఇక ప్రజల మధ్య ఉంటుందని తెలంగాణ సమాజం భావించారు. ఇదే తీరున పాలన కొనసాగుతోందని, ముందు ముందు మంచి రోజులు చూస్తామని సంబరపడ్డారు. ఇదంతా మూన్నాళ్ళ ముచ్చటే అని తేలిపోయింది. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే బిఆర్ఎస్ పార్టీ భారీ మెజారిటీతో విజయం



సాధిస్తుందని అప్పుడే టాక్ మొదలైంది. ఈ టాక్ ఢిల్లీ అధిష్టానానికి వినబడితే కాంగ్రెస్ సంస్కృతి బయటకు తన్నుకుని వస్తుంది. రాష్ట్రంలో పూర్తి కాలం కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండవచ్చేమో కానీ, ముఖ్యమంత్రుల మార్పు సంస్కృతి మొదలైనా ఆశ్చర్యం లేదు. ఇదంతా ఎందుకు చెప్పాల్సి వచ్చిందంటే ఐదు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ఆదివాసీ గిరిజనుడు, నిరాడంబరుడు, నిజాయితీ పరుడైన ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య కు ఎన్ని సార్లు ప్రయత్నించినా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అపాయింట్మెంట్ ఇవ్వకపోవడం. ఎన్టీ రామారావు కొత్తగా తెలుగుదేశం పార్టీ పెట్టి 1983 లో ఉవ్వెత్తున ఎగసిన గాలితో అధికారంలోకి వచ్చిన రోజే ఇల్లెందులో ఎమ్మెల్యేగా సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా అనే ఒక విప్లవ పార్టీ తరపున గుమ్మడి నర్సయ్య గెలిచారు. అలా మొత్తం ఐదు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన గుమ్మడి నర్సయ్య కు ఆనాడు ఎన్టీ రామారావు, చంద్రబాబు నాయుడు, వైఎస్ రాజశేఖరరెడ్డి లు ముఖ్యమంత్రులుగా ఉన్న రోజుల్లో ఆయనకు ఏ క్షణమైనా అపాయింట్మెంట్ దొరికేది. రేవంత్ రెడ్డి ఏదైతే దొరల పాలన అని కెసిఆర్ ను విమర్శించారో అదే కెసిఆర్ దగ్గరే గుమ్మడి నర్సయ్యకు అపాయింట్మెంట్ దొరకలేదు. నేడు ముఖ్యమంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి కూడా అనేక సార్లు ప్రయత్నించినా గుమ్మడి నర్సయ్యకు అపాయింట్మెంట్ ఇవ్వలేదంటే ఇది ఏ పాలన అనాలని తెలంగాణ సమాజం అడగక తప్పడం లేదు. 2009 లో వైఎస్ రాజశేఖరరెడ్డి రెండో సారి గెలిచినప్పుడు ఇల్లెందులో గుమ్మడి నర్సయ్య



ఓటమి పాలయ్యారు. ఆ సమయంలో ముఖ్యమంత్రిగా ఉన్న రాజశేఖరరెడ్డి ని కలిసేందుకు గుమ్మడి నర్సయ్య వెళ్ళగా రాజశేఖరరెడ్డి లేచి నిలబడి ఎదురుగా వెళ్లి నర్సన్నా! నీవు ఓడిపోవడం ఏందన్నా!! అంటూ ఒకింత ఆశ్చర్యానికి గురయ్యారు. మీలాంటి వాళ్ళు అసెంబ్లీలో ఉండాలంటూ రాజశేఖరరెడ్డి ఆనాడు తన రాజకీయ హుందాతనాన్ని ప్రదర్శించారు. ఇది కదా నాయకుడి హుందాతనం. రేవంత్ రెడ్డి గారూ..., గుమ్మడి నర్సయ్యకు అపాయింట్మెంట్ ఇస్తే మీకు పోయేది ఏమిటి? మీరు తెలుసుకోవాల్సిన సమస్యలే కదా ప్రజల్లో తిరుగుతున్న గుమ్మడి నర్సయ్య మీకు చెప్పేది. పరిష్కరిస్తా, చూస్తానులే అనే సహజ రాజకీయ నాయకుల ఊత పదాలే కదా మీ నుండి పోయేది. నిజంగా పరిష్కరిస్తే మీ పేరే కదా గొప్పగా చెప్పుకునేది! గుమ్మడి నర్సయ్య మీతో దిగిన ఫోటోనే కదా సోషల్ మీడియాలో వైరల్ అయ్యేది, పేపర్‌లకు ఇచ్చుకునేది. ఒక ఆదివాసీ గిరిజన మాజీ ఎమ్మెల్యే ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంచిగా రిసీవ్ చేసుకున్నారనే మైలేజ్ మీకే కదా వచ్చేది. ఇంత చిన్న లాజిక్ ను మీరెలా మిస్ అయ్యారు రేవంత్ రెడ్డి గారు. మీ వరకు రాకపోవచ్చు లేదా వచ్చినా మీరు పట్టించుకోవడం లేదేమో కానీ 14 నెలల మీ పాలనలో గ్రౌండ్ లెవెల్ లో బాగా అసంతృప్తి, వ్యతిరేకత వస్తోంది.

**తుమ్మలపల్లి ప్రసాద్ - సీనియర్ జర్నలిస్ట్,**
**సెల్: 9912010030**

# పౌర నైపుణ్యాలను నేర్పే 'స్కౌట్స్ అండ్ గైడ్స్'



**ఫిబ్రవరి 22 ప్రపంచ స్కౌట్ దినోత్సవం సందర్భంగా...**
**ప్రపంచ స్కౌటింగ్ ఉద్యమాన్ని రూపొందించడంలో కీలకపాత్ర** పోషించి బాయ్స్ స్కౌట్స్ ఉద్యమాన్ని స్థాపించిన లార్డ్ రాబర్ట్ బాడెన్ పావెల్ జన్మదినం ఫిబ్రవరి 22న ప్రపంచ స్కౌట్ దినోత్సవాన్ని జరుపుకుంటారు. ప్రపంచ స్కౌట్ 11 నుండి 18 సంవత్సరాల వయస్సు గల బాలుర కోసం ఒక కార్యక్రమంగా ప్రారంభమైంది.

విలువలు నేర్పుతున్న స్కౌట్:

స్కౌటింగ్ యువత విద్యా నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసం, నైతికత, నాయకత్వ నైపుణ్యాలు, వారి వయోజన జీవితాలను ప్రభావితం చేసే పౌర నైపుణ్యాలను అభివృద్ధి చేయడంలో సహాయపడుతుంది. స్కౌటింగ్ యువతకు వ్యక్తులుగా తాము ముఖ్యమని భావాన్ని అందిస్తుంది. స్కౌటింగ్ కుటుంబానికి చెందిన వారు ఒక గేమ్‌లో గెలిచినా ఓడినా అనే దానితో సంబంధం లేకుండా వారికి ఏమి జరుగుతుందనే దాని గురించి వారికి తెలియజేయబడుతుంది. స్కౌటింగ్ వ్యక్తిగత బాధ్యత, అధిక ఆత్మగౌరవానికి దారితీసే కార్యకలాపాలను ప్రోత్సహిస్తుంది. తత్ఫలితంగా కఠినమైన నిర్ణయాలు తీసుకోవలసి వచ్చినప్పుడు దానికి కావల్సిన సరైన మార్గాన్ని ఎంచేకునేటప్పుడు ఏర్పడే ఒత్తిడిని జయించవచ్చు. స్కౌటింగ్ మన సమాజంలో పెరుగుతున్న యువకుల ఆరు ముఖ్యమైన అవసరాలను తీర్చడంలో సహాయపడుతుంది. అవి మార్గదర్శకత్వం, జీవితకాలం నేర్చుకోవటం , విశ్వాస సాంప్రదాయాలు, ఇతరులకు సేవ చేయడం, ఆరోగ్యవంతమ్మైన జీవితం




, బిల్డింగ్ క్యారెక్టర్. వంద సంవత్సరాలకు పైగా స్కౌటింగ్ కార్యక్రమాలు యువతలో స్కౌట్ ప్రమాణం స్కౌట్ చట్టంలో ఉన్న విలువలను నింపాయి. స్కౌటింగ్ ప్రపంచ వ్యాప్తంగా 200 దేశాలు, భూభాగాలలో 5.7 కోట్లకు పైగా స్కౌట్‌లతో ప్రపంచంలోని ప్రముఖ విద్యా యువజన ఉద్యమం. విద్య, సాహసం, వినోదం కలయికల ద్వారా మెరుగైన మరింత స్థిరమైన ప్రపంచాన్ని సృష్టించడంలో నిమగ్నమై చురుకైన పౌరులుగా మారడానికి యువకులకు స్కౌటింగ్ ప్రేరణగా కొనసాగుతోంది.

స్కౌట్ చరిత్ర :1908 లో బాడెన్-పావెల్ "స్కౌటింగ్ ఫర్ బాయ్స్" అనే పుస్తకాన్ని ప్రచురించారు. ఇది తక్షణ విజయాన్ని సాధించింది. అప్పటి నుండి 100 మిలియన్ కాపీలు అమ్ముడవ్వడమే కాకుండా 1909లో ఐదు భాషల్లోకి అనువదించబడింది. ఇది "ది బాయ్ స్కౌట్స్" అనే పేరుతో ఒక ఉద్యమాన్ని రూపొందించింది. 1910లో బాడెన్ పావెల్ తన సోదరి ఆగ్నెస్ నాయకత్వంలో గర్ల్ గైడ్స్‌ను ప్రారంభించారు. 1916లో "వోల్ఫ్ కబ్స్ హ్యాండ్‌బుక్" ప్రచురణ, రుడ్‌యార్డ్ కిప్లింగ్ "జంగిల్ బుక్"ను ఫ్రేమ్‌వర్క్‌గా ఉపయోగించడం ద్వారా 11 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న అబ్బాయిల కోసం కబ్ స్కౌట్స్ ప్రారంభించబడింది. 1920లో మొదటి ప్రపంచ స్కౌట్ కాన్ఫరెన్స్ (నాటి పేరు అంతర్జాతీయ స్కౌట్ కాన్ఫరెన్స్ ) యునైటెడ్ కింగ్‌డమ్‌లోని లండన్‌లో జరిగిన మొదటి ప్రపంచ స్కౌట్ జంబోరీలో 33 జాతీయ స్కౌట్ సంస్థలు హాజరయ్యాయి. వరల్డ్ స్కౌట్ బ్యూరో (అప్పట్లో బాయ్ స్కౌట్స్ ఇంటర్నేషనల్ బ్యూరో ) యునైటెడ్ కింగ్‌డమ్‌లోని లండన్‌లో స్థాపించబడింది. 1922లో 31 జాతీయ స్కౌట్ సంస్థలు ప్రాతినిధ్యం వహించిన ఫ్రాన్స్‌లోని పారిస్‌లో 2వ ప్రపంచ స్కౌట్ సమావేశం జరిగింది. గ్లోబల్ సభ్యత్వం ఒక మిలియన్ కంటే ఎక్కువ స్కౌట్‌లకు చేరుకుంది. రెండు ప్రపంచ యుద్ధాల మధ్య, స్కౌటింగ్ కార్యకలాపాలు నిషేధించబడిన నిరంకుశ ప్రాంతాలలో మినహా స్కౌటింగ్ అభివృద్ధి చెందుతూనే ఉంది. ఆక్రమిత దేశాల్లో, నిరంకుశ పాలన ఉన్న దేశాల్లో స్కౌట్‌లు ప్రతిఘటన భూగర్భ ఉద్యమాలలో ముఖ్యమైన పాత్రలు పోషించడంతో స్కౌటింగ్ రహస్యంగా కొనసాగింది. స్కౌట్స్ ఆకలితో ఉన్నవారికి ఆహారం ఇవ్వడం, గాయపడిన వారికి సహాయం చేయడం ద్వారా ప్రపంచ యుద్ధాల ద్వారా తమ దేశాలకు మద్దతు ఇచ్చారు. కొన్ని చోట్ల సీస్ స్కౌట్స్ కోస్ట్ గార్డ్స్ గా వ్యవహరించారు. స్కౌట్ ఉద్యమం 21వ ప్రపంచ స్కౌట్ జంబోరీ కోసం యునైటెడ్ కింగ్‌డమ్‌లో దాని మూలాలకు తిరిగి రావడం ద్వారా 2007లో దాని 100వ వార్షికోత్సవాన్ని జరుపుకుంది.


200 పైగా దేశాలలో:ఒక శతాబ్దం క్రితం స్కౌటింగ్ ప్రారంభించినప్పటి నుండి 50కోట్లకు పైగా యువకులు, పెద్దలు స్కౌటింగ్‌లో పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ చురుకైన పౌరులుగా ఉండటానికి, వారి కమ్యూనిటీలలో సానుకూల మార్పును సృష్టించడానికి ఉద్యమంలో చేరారు. నేడు, స్కౌటింగ్ అనేది ప్రపంచవ్యాప్తంగా 200 దేశాలు, భూభాగాల్లో 5.7 కోట్లకు పైగా స్కౌట్‌లతో ప్రపంచంలోని ప్రముఖ విద్యా యువజన ఉద్యమం. విద్య, సాహసం, వినోదం దాని ప్రత్యేక కలయిక ద్వారా మెరుగైన మరింత స్థిరమైన ప్రపంచాన్ని సృష్టించడంలో నిమగ్నమై ఉన్న చురుకైన పౌరులుగా మారడానికి యువకులకు స్కౌటింగ్ ప్రేరణగా కొనసాగుతోంది.

మన దేశంలో...స్కౌటింగ్ అధికారికంగా బ్రిటిష్ ఇండియాలో 1909లో స్థాపించబడింది. మొదట బెంగళూరులోని బిషప్ కాటన్ బాయ్స్ స్కూల్‌లో ప్రారంభమైంది. స్థానిక భారతీయుల కోసం స్కౌటింగ్‌ను జస్టిస్ వివియన్ బోస్, మదన్ మోహన్, హృదయనాథ్ కుంజ్రు, గిరిజా శంకర్ బాజ్‌పాయ్, అనిబిసెంట్, జార్జ్ అరుండేల్ 1913లో ప్రారంభించారు. మొదటి గర్ల్ గైడ్స్ కంపెనీ జబల్‌పూర్‌లో 1911లో క్రైస్ట్ చర్చ్ స్కూల్‌లో స్థాపించబడింది. మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత భారతదేశంలో పనిచేస్తున్న స్కౌట్ , గైడ్ అసోసియేషన్ల ఏకీకరణకు కృషి జరిగింది. భారతదేశ మొదటి ప్రధాన మంత్రి పండిట్ జవహర్ లాల్ నెహ్రూ, భారతదేశ మొదటి విద్యా మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్, సెంట్రల్ ప్రావిన్స్ గవర్నర్ మంగళ్ దాస్ పక్వాసా, ఇతర స్కౌట్ నాయకులు పండిట్ హృదయ్ నాథ్ కుంజ్రూ వంటి వారు, జాతీయ నాయకులు తీవ్రమైన ప్రయత్నాలు చేశారు. స్కౌట్ అండ్ గైడ్ అసోసియేషన్ల విలీనం కోసం పండిట్ శ్రీరామ్ బాజ్‌పాయ్, జస్టిస్ వివియన్ బోస్, ఇతరులు కృషి చేశారు. విలీన పత్రాన్ని ఖరారు చేయడంలో భారత ప్రభుత్వ విద్యా కార్యదర్శి డాక్టర్ తారా చంద్ గణనీయమైన కృషి చేశారు. చివరి విలీనం 7 నవంబర్ 1950న జరిగింది. ఏకీకృత సంస్థ "ది భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్" పేరుతో ఉనికిలోకి వచ్చింది. గర్ల్ గైడ్స్ అసోసియేషన్ అధికారికంగా 1951 ఆగస్టు 15న భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో చేరింది.

**కింజరాపు అమరావతి**
**82472 86357**

# ప్రేమతత్త్వమే పరమేశ్వరుడు

**భక్తి**



శివుడు నిరాకారుడు, అలాగే సాకారుడు కూడా. నికారారుడని చెప్పడానికి లింగం ప్రతీక. అద్భుతమైన శివ తత్త్వాన్ని నిరాకారంగా ఉపాసన చేస్తే... అది లింగోపాసన. సాకారమైన దివ్యమంగళ విగ్రహోపాసనలో చంద్రశేఖరుడిగా, నాగాభరణ భూషితుడిగా, త్రినేత్రుడిగా, నీలకంఠునిగా... ఇలా అనేక రూపాలలో గోచరిస్తాడు. ఇవన్నీ శివచైతన్యాన్ని వ్యక్తం చేస్తాయి. జ్ఞానం, వైరాగ్యం, తపస్సు, అంతర్ముఖత్వం, కరుణ, త్యాగశీలత... ఇవన్నీ సగుణ రూపమైనా, నిర్గుణరూపమైన శివమూర్తిలో ఉండే లక్షణాలు. "ఆయన పరమ దయాళువు" అని సిస్టర్ నివేదిత వర్ణిస్తే... "శివుణ్ణి ఆరాధించడం అంటే శాంతాన్ని, సమత్వాన్ని, యోగాన్ని, నిరాడంబరతని ఆదర్శంగా భావించడమే. శాశ్వతమైన భారతీయ హృదయానికి సాకారమే శివుడు" అన్నారు స్వామి వివేకానంద. అటువంటి విశ్వగురువైన విశ్వనాథుణ్ణి ఆరాధించడానికి అనువైన రోజు... మహా శివరాత్రి. ఈ పర్వదినం గురించి ప్రసిద్ధమైన రెండు కథలు పురాణాల్లో ప్రాచుర్యం పొందాయి. ఒకప్పుడు ప్రళయకాలం ఆసన్నమవుతున్న తరుణంలో... పరాశక్తి అయిన సమస్త సృష్టి బీజాలను పోగు చేసింది, వాటిని తన ఒడిలో భద్రపరచి, పంచాక్షరీ జపం చేస్తూ... ధ్యాన నిమగ్నురాలయింది.పగలు, రాత్రీ అనేవి లేని ఆ స్థితిలో... ధ్యాన సమాధిలో ఉన్న పరమశివుడు కొంతకాలానికి కళ్ళు తెరిచాడు. ఎదురుగా ఉన్న కాత్యాయినిని చూసి విషయం తెలుసుకున్నాడు. ఆమెను సమాధి స్థితి నుంచి మేలుకొలిపి, ఆమె పోగు చేసిన బీజాల నుంచి తిరిగి సృష్టిని ప్రారంభించాడు. ఆ రోజు మాఘ బహుళ చతుర్దశి. ఆమె కోరిక ప్రకారం ఆ రోజు 'మహా శివరాత్రి'గా ముల్లోకాలలో ప్రాచుర్యం పొందుతుందని వరమిచ్చాడు. మరో కథ ప్రకారం... బ్రహ్మ, విష్ణువుల మధ్య ఆధిపత్యం కోసం వివాదం ఏర్పడి, కలహానికి దారి తీసింది. వారిని ఉపశమింపజేసేందుకు... ఇద్దరి మధ్య అగ్నిలింగంగా శివుడు ఆవిర్భవించాడు. "పరాశక్తి ఆజ్ఞను అనుసరించి... సృష్టి, స్థితి, లయాలను నిర్వహించడానికి ఆమె ప్రతినిధులుగా మనం ఉన్నాం. మనం కర్తవ్యనిష్టులం మాత్రమే" అని సమాధానపరిచాడు. లింగోద్భవమైన ఆ రాత్రి 'మహా శివరాత్రి'గా ప్రస్తుతి పొందింది.

విశ్వమే ఆయన శరీరం...శివ స్వరూపాన్ని దర్శిస్తే ఎన్నో అద్భుతాలు గోచరిస్తాయి. జడలో జల తరంగాలు, జ్యోతిర్మండలమైన జటాజూటంలో చంద్రరేఖ, కంఠంలో గరళం... వీటన్నిటినీ గమనిస్తే విశ్వమే శివుని శరీరం అనిపిస్తుంది. ఆయన పంచభూతాత్మకుడు. పైగా చిన్న కుటుంబం. శివపత్ని అన్నపూర్ణమ్మ కన్నతల్లిలా మమకారాన్ని అందిస్తుంది. పెద్ద కుమారుడు గణపతి విఘ్నాలను రూపుమాపడమే కాకుండా, సంపదలను అనుగ్రహిస్తాడు. చిన్న కుమారుడు కుమారస్వామి విజయ కారకుడు. దాంపత్య జీవనానికి శివపార్వతులే ఆదర్శం.. ప్రేమ ధర్మానికి ప్రతీకలైన వారు ఏక శరీరులు, ఆ ముగ్గురి వాహనాలకు పరస్పర వైరం ఉన్నా... వారి సమక్షంలో పరమ మిత్రులుగా మెలుగుతాయి. ఇలా శివతత్త్వాన్ని పరిశీలిస్తే... ఎన్నో అద్భుతాలు కనిపిస్తాయి. 'ప్రేమయే శివుడు' అనేది శైవ సిద్ధాంతం. శివుడంటేనే ప్రేమ తత్త్వం. భక్తితో పిలిస్తే అక్కున చేర్చుకొనే ఆయన భోళా శంకరుడు. సమస్త సంపదలూ ఉన్నా, ఆయనలో నిరాడంబరత, వైరాగ్యం కనిపిస్తాయి. తనను నమ్మినవారికి అడిగినది ఇవ్వడమే తప్ప... ప్రతిఫలం ఆశించడు. క్షీరసాగర మథనంలో హాలాహలం బైటికి రాగానే దేవదానవులు 'శివా! శివా!' అని ప్రార్థిస్తూ అక్కడి నుంచి పారిపోయారు. పరమ దయాళువైన శివుడు వచ్చి, అభయం ఇచ్చి ఆదుకున్నాడు. ఆ తరువాత ఎన్నో సంపదలు ఆ మథనంలో నుంచి బయటకు వచ్చాయి. ఆయన ఆ సంపదల జోలికి పోలేదు.

లింగోద్భవ దర్శనం...శ్రీరాముడి లాంటి పౌరాణిక దివ్య పురుషులే కాదు, సమస్త దేవతలు, ఋషులు... ఇలా అందరూ శివభక్తిపరాయణులే. ఆ స్వామి ఆరాధన అనాది సంప్రదాయంగా వస్తోంది. అందుకే మన దేశంలో మూలమూలలా శివాలయాలు కనిపిస్తాయి. సోమవారాలు, మాస శివరాత్రులు, మహాశివరాత్రి, కార్తికమాసంలో శివారాధనకు భక్తులు తండోపతండాలుగా ఆలయాలను సందర్శిస్తారు. అభిషేకాలు, బిల్వపత్ర పూజలు చేస్తారు. ఉపవాసాలు, జాగరణలు, వ్రతాలు చేస్తారు. శివరాత్రి నాటి లింగోద్భవ వేళకు ఎంతో ప్రత్యేకత ఉంది. పరిశీలించి చూస్తే విశ్వంలోని ప్రతి కదలిక శివచైతన్య విశేషమే. మనలోని సర్వ చైతన్యానికి మూలమైన పరంజ్యోతిని దర్శించే సందర్భం... లింగోద్భవ దర్శనం. దానితోపాటు అభిషేకం, ఉపవాసాలు, జాగరణలు, పంచాక్షరీ మంత్ర జపం.. ఇహ పర సౌఖ్యాలను అందిస్తాయనేది పెద్దల మాట




## పావురాలు రాకుండా ఉండాలంటే...



గుప్పెడు మిరియాలను తీసుకుని కొద్దిగా వేడి చేసి మెత్తగా నూరి పొడి చేయాలి. బాల్కనీ, కిటికీలతోపాటు పావురాలు వాలే ప్రదేశాల్లో ఈ పొడిని చల్లాలి. మిరియాల ఘాటుకి పావురాలు రావు.
ఒక గ్లాసు నీటిలో ఒక చెంచా వెనిగర్ లేదా పుదీనా నూనె కలిపి పావురాలు తిరిగే చోట చల్లితే అవి వెళ్లిపోతాయి. ఏదైనా ఎస్సెన్షియల్ ఆయిల్ లేదా దాల్చిన చెక్క పొడి కలిపిన నీళ్లు చల్లినా ప్రయోజనం ఉంటుంది.పావురాలు వాలే ప్రదేశాల్లో విండ్ చైమ్స్ వేలాడదీయాలి. గాలి వీచినప్పుడు ఇవి చేసే శబ్దం వల్ల పావురాలు దూరంగా వెళ్లిపోతాయి. అద్దాలతోపాటు మెరిసే గొట్టాలు ఉన్నవి అయితే మంచి ఫలితం కనిపిస్తుంది.
బాల్కనీలో గద్ద, గుడ్లగూబ లాంటి పెద్ద పక్షుల బొమ్మలను వేలాడదీస్తే పావురాలు భయపడి రావు
సన్నని దారంతో పాత సీడీలను కట్టి వేలాడదీస్తే అవి ప్రతిబింబించే రంగుల కాంతికి పావురాలు రాకుండా ఉంటాయి. అల్యూమినియం ఫాయిలే లేదా ఏదైనా మెరిసే వస్తువును వేలాడదీసినా ఫలితం ఉంటుంది.
పాత బ్యాగ్‌లు లేదా దుస్తులకు ఉండే జిప్‌లను తీసి బాల్కనీ, కిటికీల అరుగులపై అంటిస్తే వాటి గరుకుదనానికి పావురాలు వాలవు.ఇప్పటికే గూడు పెట్టివుంటే దాన్ని జాగ్రత్తగా మరో ప్రాంతానికి తరలిస్తే పావురాలు వెళ్లిపోతాయి.

# మద్యంపై మహిళల పోరు





బెల్టు షాపులను మూయించి... మద్యం అమ్మినా... తాగినా జరిమానా వేయాలని నిర్ణయించింది. ఒత్తిడులు ఎదురైనా... బెదిరింపులు వచ్చినా... మద్య నిషేధాన్ని కొనసాగించి తీరతామని... మరే కుటుంబాన్నీ అనాథ కానివ్వమని ప్రతిజ్ఞ పూనింది.

**మద్యంపై మహిళల పోరు**

ఊరుకు పట్టిన 'మత్తు' వదిలించడానికి మహిళా లోకం కదిలింది. యువకుడి మరణానికి రణమైన మద్యాన్ని... తమ గ్రామం నుంచి తరిమేయాలని సంకల్పించింది. బెల్టు షాపులను మూయించి... మద్యం అమ్మినా... తాగినా జరిమానా వేయాలని నిర్ణయించింది. ఒత్తిడులు ఎదురైనా... బెదిరింపులు వచ్చినా... మద్య నిషేధాన్ని కొనసాగించి తీరతామని... మరే కుటుంబాన్నీ అనాథ కానివ్వమని ప్రతిజ్ఞ పూనింది. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం ఏపూరు గ్రామ మహిళల మహాపోరాటం 'నవ్య'కు ప్రత్యేకం. ఇది మహాసంగ్రామం. ఊరు కోసం... ఊళ్లోని ప్రతిఒక్కరి బాగు కోసం ఏపూరు మహిళలు భుజానికెత్తుకున్న ఉద్యమం... మద్య నిషేధం. ఏపూరుకు చెందిన మినీ లారీ డ్రైవర్ కూరాకుల ధనుంజయ ఇటీవల గ్రామ సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురై ప్రాణాలు పోగొట్టుకున్నాడు. ?ధనుంజయకు భార్య శిల్ప, మూడేళ్ల కుమారుడు హర్షిత్, ఏడాదిన్నర కూతురు తేజస్వీ ఉన్నారు. వృద్ధులైన తల్లిదండ్రుల బాధ్యత కూడా అతడిదే. డ్రైవర్‌గా రోజంతా కష్టపడి సంపాదిస్తేనే ధనుంజయ కుటుంబానికి పూట గడిచేది. అలాంటి కుటుంబం ధనుంజయ మరణంతో దిక్కులేనిదయింది. వారి పరిస్థితి గ్రామస్తులను కలచివేసింది. ఆ కుటుంబానికి వచ్చిన కష్టం... తమకొచ్చినట్లేనని గ్రామంలోని మహిళలంతా భావించారు. ఆ బాధను పంచుకోవాలని, ఈ మరణానికి కారణమైన మద్యం దెయ్యాన్ని గ్రామం నుంచి తరిమేయాలని కంక ణబద్ధులయ్యారు.

**అమ్మితే లక్ష జరిమానా...**

గ్రామంలో ఎన్నో కుటుంబాలు ఆర్థికంగా చితికిపోవడానికి, నైతికంగా పతనం కావడానికి కారణమైన మద్యాన్ని గ్రామం నుంచి పారదోలాలని సంకల్పించారు. ధనుంజయ అంత్యక్రియలు ముగిసేలోగానే మహిళలంతా సమావేశమై గ్రామంలో మద్య నిషేధం విధించారు. బెల్టు దుకాణాలు ఎత్తివేయాలని తీర్మానించారు. మద్యం అమ్మితే రూ.లక్ష, మద్యం సేవిస్తే రూ. 20 వేల జరిమానా వేయాలని నిర్ణయించారు. అంతేకాదు... మద్యం అమ్మినవారిని పట్టిస్తే రూ.10 వేల నజరానా కూడా ఇస్తామని ప్రకటించారు. తామంతా కలిసి తీసుకున్న నిర్ణయానికి గ్రామంలోని మగవారంతా సహకరించాలని కోరారు. గత వారం రోజులుగా మద్య నిషేధం అమలు చేస్తుండడంతో గ్రామంలో కొత్త వాతావరణం నెలకొంది.

**'కొనసాగించి తీరతాం..'**

రాజకీయ, ఇతర కారణాలతో ఎవరూ బెల్టుషాపు నిర్వాహకులను వెనకేసుకురావద్దని మహిళలు గ్రామస్తులందరినీ హెచ్చరించారు. ప్రతి మహిళ తన ఇంట్లో ఎవరూ తాగకుండా చూడాలని సంకల్పించుకున్నారు. తమ భర్తలు, పిల్లలు మద్యం తాగవద్దని తాము చెప్పడమే కాకుండా, పిల్లలతో నా చెప్పిస్తున్నారు.
మహిళలే గ్రామంలో మద్య నిషేధం కోసం అందరినీ చైతన్య పరుస్తున్నారు. దాన్ని పక్కాగా అమలు చేసే బాధ్యత కూడా వారే తీసుకున్నారు. ప్రతి మహిళా తన ఇంటి నుంచే మార్పు రావాలని బలంగా సంకల్పించుకున్నారు. తమ ఇళ్లల్లోని మగవారిని మద్యం జోలికి వెళ్లకుండా నచ్చజెబుతున్నారు. ఆటంకాలు ఎన్ని ఎదురైనా... బెదిరింపులు వచ్చినా గ్రామంలో మద్య నిషేధం కొనసాగించి తీరతామని ప్రతిజ్ఞ చేశారు.

**ఒక్క సీసా కూడా రానిచ్చేదిలేదు...**

గ్రామంలో ఉన్న 650 కుటుంబాలలో దాదాపు 2500 జనాభా ఉంది. ఈ గ్రామంలో 300 పైచిలుకు మంది డ్రైవర్లుగా పని చేస్తున్నారు. మరోవైపున గ్రామాన్ని ఆనుకొని ఉన్న ఒక ప్రైవేట్ పరిశ్రమలో మరో 150 మంది వరకు పని చేస్తున్నారు. కేవలం వ్యవసాయం, కులవృత్తులే కాకుండా ప్రతి కుటుంబానికి అదనంగా పని చేసే వనరుల ద్వారా అదనపు సంపాదన వస్తుండడంతో తేలిగ్గా మద్యం సేవించేందుకు అలవాటు పడిన ఘటనలే ఎక్కువగా ఉన్నాయనేది గ్రామస్తుల మాట. స్థానికంగా ఉన్న 13 బెల్టు షాపులను గుర్తించిన మహిళలు... వారందరినీ మద్యం అమ్మకుండా కట్టడి చేశారు. మరోవైపు గ్రామ సమీపంలో దాబాల ముసుగులో ఉన్న అక్రమ సిట్టింగులను కూడా నిషేధించారు. ప్రస్తుతం గ్రామంలో ఒక్క మద్యం సీసా కూడా కనిపించడంలేదు. బెల్టు షాపుల నిర్వాహకులు మహిళలపై రకరకాలుగా ఒత్తిళ్లు తెస్తున్నారు. కానీ వాటికి తాము లొంగేది లేదని, ఊళ్లోకి మద్యం సీసా రానిచ్చేది లేదని తెగేసి చెబుతున్నారు. వారి దృఢ సంకల్పానికి మహిళా లోకం జేజేలు పలుకుతోంది.

**మంచి నిర్ణయం**

"మద్య నిషేధం తర్వాత ఊళ్లో సాయంత్రమయ్యాక ఎవరింటికి వారు వెళుతున్నారు. అన్ని కుటుంబాలూ ఎలాంటి గొడవలు లేకుండా ప్రశాంతంగా నిద్రిస్తున్నాయి. ధనుంజయ మరణంతో ఊళ్లో కదలిక వచ్చింది. మహిళలందరూ కలిసి తీసుకున్న మద్య నిషేధ నిర్ణయాన్ని అందరూ స్వాగతించాలి. ఊళ్లో మద్యం విక్రయించకుండా అందరూ సహకరించాలి. వినకపోతే పోలీసులు జోక్యం చేసుకోవాలి" అంటారు గ్రామస్తుడైన వృద్ధుడు వీరయ్య యాదవ్.

**వెనక్కి తగ్గేది లేదు...**

'మా ఊళ్లో మద్య నిషేధం కొనసాగించడానికి ఎంతవరకైనా పోరాడతాం. ఇందులో ఎలాంటి అనుమానం లేదు. ఎలాంటి ఒత్తిళ్లు ఎదురైనా వెనక్కి తగ్గేది లేదు. ఊళ్లో మళ్లీ బెల్టు షాపులు ఏర్పాటు చేసినా, అక్రమ మద్యం సిట్టింగులు కొనసాగించినా జరిమానాలు విధించడమే కాదు... వారిని పోలీసులకు పట్టిస్తాం. ఈ ఉద్యమానికి మా కుటుంబాల నుంచి కూడా సంపూర్ణ మద్దతు లభించింది. మా నిర్ణయాన్ని అందరూ స్వాగతిస్తున్నారు. ఇవన్నీ చూశాక గ్రామంలో మద్య నిషేధాన్ని అమలు చేయగలుగుతామన్న నమ్మకం కలిగింది" అంటారు ఈ ఉద్యమానికి శ్రీకారం చుట్టిన అనురాధ తదితర మహిళలు.

# సోయా క్యాండిల్ ఎంత స్పెషల్ అంటే.. !

పుట్టిన రోజు, పండుగలు, ప్రత్యేక ఫంక్షన్లు ఇలా సందర్భంతో సంబంధం లేకుండా క్యాండిల్ వెలిగించడం పరిపాటి. చాలా వరకూ కరెంట్ పోయినప్పుడు కూడా కొవ్వొత్తి వెలిగిస్తాం. కానీ ప్రత్యేకంగా వెలిగించే క్యాండిల్స్ విషయానికి వస్తే వీటిలో బోలెడు రకాలున్నాయి. సోయా క్యాండిల్స్, సెంట్ సువాసనలతో రూమ్ అందాన్నే కాదు, ఆహ్లాదకరమైన సువాసనతో మనసును తేలికచేసేస్తాయి. ఖరీదులో కూడా మన క్యాండిల్స్‌కి కాస్త దగ్గరలోనే ఉంటాయి. ఈ చిన్న జార్స్ క్యాండిల్స్ చూసేందుకు ముచ్చటగా, ముద్దుగా ఉంటాయి. వీటి గురించి మరింత తెలుసుకుందాం.
సోయా మైనం అనేది సోయాబీన్ మొక్కల నుంచి సేకరించిన స్వచ్ఛమైన సహజమైన మైనం. ఇది మానవ శరీరానికి హాని కలిగించని విధంగా ఉంటుంది. ధర కూడా తక్కువ, రంగు కూడా మారదు. ఈ కొవ్వొత్తుల సవాసనలు అరోమా థెరపీ, రిలాక్సేషన్, ఒత్తిడిని తగ్గించడం, ధ్యానం, మూడ్ పీస్ కోసం సరిగ్గా సరిపోతాయి.
ఇది దోమలు, యాంటీ బాక్టీరియల్ , పురుగులను తిప్పి కొడుతుంది. చిరాకు నుంచి ఉపశమనాన్ని అందిస్తుంది. ఒత్తిడి, నిద్రలేమి, తలపోటు నుంచి ఉపశమనం కలిగిస్తుంది. మనసిక స్థితిని మెరుగుపరుస్తుంది. దీనితో ఎలాంటి శ్వాసకోశ, నాసికా అలెర్జీలు, ఆస్తమా ఇతర సమస్యలు రావు. ఈ కొవ్వొత్తి వెలిగించినప్పుడు పొగ రాదు.
సోయా కొవ్వొత్తులు మామూలుగా మనం వాడే కొవ్వొత్తులకు వీటికీ మధ్య ఏం తేడా ఉంటుంది అన్నీ ఒకటే కదా అనుకోవచ్చు. ఈ కొవ్వొత్తులు మసిని ఇవ్వవు. జంతు ఉత్పత్తులతో తయారు చేసిన కొవ్వొత్తుల కంటే సోయా



కొవ్వొత్తులు ఎక్కువసేపు ఉంటాయి.
ఇవి అందం విషయంలో పారాఫిన్ కొవ్వొత్తుల కంటే అందంగా ఉంటాయి. వీటిని అందమైన ఆకారాల్లో బహుమతుల్లా తయారుచేస్తారు. గిఫ్ట్ ఐటమ్స్ కింద కూడా ఇచ్చుకోవచ్చు. సోయా కొవ్వొత్తిని స్టైల్‌కు తగినట్టుగా మార్చుకోవచ్చు.

**ఎలా తయారు చేస్తారంటే.**

గాజు గిన్నెలో సోయా మైనం వేసి వేడి నీటిలో ఈ మైనాన్ని ఉంచాలి. డైరెక్ట్‌గా మంట మీద ఉంచకూడదు. అప్పుడప్పుడూ కదిలిస్తూ ఉండాలి. మైనాన్ని చిన్న గాజు కూజాలలో వేయాలి.ఈ కరిగిన మైనానికి కొద్దిగా సువాసనకోసం ఫ్లేవర్స్ కలిపితే క్యాండిల్ వెలుగుతున్నంత సేపూ మంచి వాసన చుట్టూ అల్లుకుంటుంది.
కంటైనర్ మధ్యలో చిన్న మైనం ఒత్తిని ఉంచాలి. మైనపు గట్టిపడే వరకు ఉంచాలి. కంటైనర్ కదిలించకుండా అలాగే ఉంచాలి. మరిసటి రోడు ఒత్తిని కొద్దిగా కత్తిరించాలి. ఈ క్యాండిల్స్ ఫంక్షన్స్, పెద్ద మాల్స్, ఏదైనా వేడుకల్లో ప్రత్యేకంగా కనిపిస్తాయి.

# వేసవిలో వికసించే ఈ పూలమొక్క.. మొత్తం తోటకే అందాన్ని తెస్తుంది.. వీటిలో..

అగాపంథస్ అనేది వేసవిలో ఎక్కువగా పుష్పించే బల్బు ఆకారపు పూల జాతి. అగాపంథస్‌ను సాధారణంగా "లిల్లీ ఆఫ్ ది నైలు" అని పిలుస్తారు, కానీ ఇది లిల్లీ కాదు, అధ్యయనం ప్రకారం అధికారులచే గుర్తించబడిన జాతుల సంఖ్య 6 నుండి 10 వరకు ఉంటుంది. వీటిలో అనేక జాతులు, సాగు, ఉత్పత్తి చేయబడుతున్నాయి. అవి ప్రపంచంలోని వెచ్చని ప్రాంతాలలో సాగు చేస్తారు.
వేసవి ప్రారంభంలో నుండి మధ్య మధ్యలో అద్భుతమైన నీలిరంగు పూల సొగసు కోసం వీటిని పెంచుతారు. అగాపంథస్‌లో రెండు జాతులు ఉన్నాయి, అనేక సంకరజాతులు కూడా ఉన్నాయి, వీటిని సాధారణంగా తేలికపాటి ప్రాంతాలలో ల్యాండ్‌స్కేప్ మొక్కలుగా లేదా చల్లని వాతావరణంలో ఇంట్లో పెరిగే మొక్కలుగా పెంచుతారు. మరగుజ్జుగా కంటైనర్ ప్లాంట్ల వలె అందంగా అమరిపోతాయి..
అగాపంథస్ పట్టీ లాంటి ఆకులు, నీలం లేదా తెలుపు పువ్వులు ఆకర్షణీయంగా ఉంటాయి. చిన్న కాండం మీద ఆకుల టఫ్ట్ ఉత్పత్తి అవుతాయి. వంపు, పట్టీ లాంటి ఆకులు 12-24" పొడవు, 1-2" వెడల్పుతో ఉంటాయి. అగాపంథస్ మొక్కలు 60 సెంటీమీటర్ల పొడవు ఉంటాయి. పుష్పం కాండం 90 సెంటీమీటర్ల ఎత్తుకు చేరుకుంటుంది. ఇవి జనవరి, ఫిబ్రవరిలో దక్షిణ అర్ధగోళంలో పుష్పిస్తాయి.
ఇది కూడా చదవండి: ఉల్లిపాయతో కలిగే ఆరోగ్య ప్రయోజనాలు ఏంటో తెలుసా..!
పెరుగుతున్న కాలంలో మొక్కలకు సమృద్ధిగా నీరు అవసరం. పూర్తి సూర్యకాంతిలో బాగా ఎండిపోయిన నేలలో నాటాలి. అవి మంచి కంటైనర్ ప్లాంట్‌లను తయావుతాయి. వాటిని ఇతర మొక్కలతో కూడా కలపవచ్చు. అవి బాగా పుష్పించవు. ఆకురాల్చేవి అయినప్పటికీ, వర్షాన్ని తట్టుకుంటాయి. ఇవి తక్కువ వ్యవధిలో తక్కువ ఉష్ణోగ్రతలను తట్టుకోగలవు.
మొక్క పుష్పించనప్పుడు కూడా ముదురు, నిగనిగలాడే ఆకుపచ్చ ఆకులు ఆకర్షణీయంగా ఉంటాయి. సాధారణ రకాలు చాలా వరకు సతతహరితమైనవి, కానీ కొన్ని ఆకురాల్చేవి. సతత హరిత మొక్కలు ప్రతి సంవత్సరం కొన్ని పాత ఆకులను తొలగిస్తాయి. పెరుగుతున్న రెమ్మ నుండి కొత్త ఆకులు పెరుగుతాయి.
నోటి ఆరోగ్యాన్ని పెంచే లవంగాలను గురించి తెలుసా..100 గ్రాముల లవంగాల్లో..!
ఆహారంతో పొటాషియం స్థాయిలను ఎలా పెంచాలి..!
యాపిల్ తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలేంటో తెలుసా..!
పూల గుత్తులు నిటారుగా ఉండే కాండం మీద బాగా ఆకుల పైన ఉంటాయి. గంట ఆకారపు పువ్వులు, ప్రతి ఒక్కటి 6 భాగాలను కలిగి ఉంటుంది.
ప్రతి గుండ్రని గొడుగులో 20 నుండి 100 పువ్వులు ఉంటాయి, ఇది వివిధ రకాలు., జాతులపై ఆధారపడి ఉంటుంది. మొగ్గలు విడవక మునుపు, పువ్వులు ఒక చిన్న కలువ పువ్వులా కనిపిస్తాయి, తరచుగా ప్రతి టెపాల్ మధ్యలో ముదురు రంగు చారలు ఉంటాయి (3 రేకులు, 3 సీపల్స్ అన్నీ ఒకేలా కనిపిస్తాయి). పువ్వుల రంగు లోతైన వైలెట్-నీలం నుండి లేత నీలం, అలాగే స్వచ్ఛమైన తెలుపు వరకు ఉంటుంది. ఇవి ప్రధానంగా వేసవిలో వికసిస్తాయి, అయితే మంచు లేని వాతావరణంలో అవి ఎక్కువ కాలం పాటు వికసిస్తాయి. పువ్వులు కూడా మంచి కట్ పూలను తయారు చేస్తాయి.



# స్టవ్ బర్నర్స్ ఇంత ఈజీగా క్లీన్ చేయచ్చని తెలుసా..

ఒకప్పుడు కట్టెల పొయ్యి మీద వంట చేసే వారు. కాలంతో నెమ్మదిగా కిరోసిన్ స్టవ్, తర్వాత గ్యాస్ వంటి సదుపాయాలు వచ్చాయి. వంట చేసే గది, వంటే స్టవ్ శుభ్రంగా ఉంటేనే తినే ఆహారం కూడా శుభ్రంగా ఉంటుంది. ఆరోగ్యానికి కారణం అవుతుంది. లేదంటే తినే పదార్థాలలో నాణ్యత ఉన్నా, పరిసరాలు సరిగా లేనప్పుడు అనారోగ్యాలు తప్పవు. వారంలో రెండు సార్లు స్టవ్ క్లీన్ చేసినా మళ్ళీ వంట చేయగానే అదే స్థితిలోకి వచ్చేస్తుంది స్టవ్.. పెద్ద వంట చేసినా చిన్న వంట చేసిన వంటగదిలో స్టవ్ బర్నర్స్ చిరాగ్గా తయారయిపోతాయి. వెంట వెంటనే వాటిని క్లీన్ చేయాలంటే పెద్ద పనిలా అనిపిస్తుంది. వారంలో ఏదో ఒకరోజు పెట్టుకుని క్లీన్ చేసినా మళ్ళీ అదే నూనె మరకలు, జిడ్డు, పదార్థాలు పొంగి పొర్లిన చారలు పడుతూ చికాకు తెప్పిస్తాయి. ఈ పరిస్థితిని దాటాలంటే వంటగదిలో ఈ చిట్కాలు పాటించాల్సిందే. అవేమిటంటే..
గ్యాస్ స్టవ్‌లపై ఉన్న బర్నర్స్ శుభ్రం చేయడం అనేది అస్తమానూ చేస్తున్నా కూడా మళ్లీ వంట చేసే సరికి వాటికి అదే మకిలి పట్టుకుంటుంది. లేదా నీళ్ళు, సబ్బు, సర్ఫ్ వంటివి బర్నర్ లోపలికి వెళ్ళి మంట వచ్చే దారులుకు అడ్డం పడతాయి.దీనితో మంట సరిగా రాక ఇబ్బంది పడాల్సి వస్తుంది.

1. గ్యా స్ శుభ్రం చేసేటప్పుడు మంటను ఆఫ్ చేసి, %ూా+% ఆఫ్ చేసి అప్పుడు ఆఫ్ పొజిషన్ లో ఉంచి శుభ్రం చేయాలి. బర్నర్ క్యాప్స్ తీసేయాలి.
2. నాన్ బ్రాసివ్ స్క్రబ్బింగ్ ప్యాడ్, క్లాత్, సబ్బు ఉపయోగించి బర్నర్లను క్లీన్ చేయాలి. పైన ఉండే స్టీల్ ప్లేట్స్ ని కనీసం ఇరవై నిమిషాల పాటు వేడి నీటిలో సర్ఫా వేసి నానబెట్టాలి.
3. ఒక భాగం నీరు, మూడు భాగాల బేకింగ్ సోడా కలిపి పేస్ట్‌లా చేసి దానిని స్టవ్ చుట్టూ అప్లై చేసి 20 నిమిషాల తర్వాత స్పాంజ్‌తో తుడిస్తే సరిపోతుంది.
4. నాన్ బ్రాసిన్ స్క్రబ్బింగ్ ప్యాడ్ తో తుడవడం వల్ల ఈజీగా స్టవ్ క్లీన్ అవుతుంది. అయితే ఎక్కువ సేపు ఎండలో ఆరనిచ్చి అప్పుడు స్టవ్ మళ్ళీ బిగించాలి. లేదంటే మంట సరిగా రాకపోవడం, స్టవ్ పాడు కావడం వంటి సమస్యలు తలెత్తవచ్చు.
5. కొద్దిగా నిమ్మరసం, వెనిగర్ సాయంతో కూడా త్వరగా క్లీన్ చేయచ్చు.
6. ఇనో ప్యాకెట్ తో కూడా స్టవ్ క్లీనింగ్ చేయచ్చు..
7. రాత్రి స్టవ్ బర్నర్స్ నీటిలో నానబెట్టి కాస్త ఉప్పు, వెనిగర్, నిమ్మరసాన్ని వేసి ఉంచి ఉదయం చిన్న బ్రష్ సాయంతో క్లీన్ చేస్తే సరి.





## స్టాక్ మార్కెట్లకు మళ్లీ నష్టాలే.. టాప్ ఫైవ్ స్టాక్స్ ఇవే..

**న్యూఢిల్లీ-నవభూమి:**గురువారం అమెరికా మార్కెట్లు నష్టాలతో ముగిశాయి. ఆ ప్రభావం దేశీయ సూచీలపై పడింది. ఉదయం ఫ్లాట్‌గా మొదలైన సూచీలు ఆద్యంతం నష్టాల్లోనే కదలాడాయి. ముఖ్యంగా ఆటోమొబైల్ రంగం సూచీల పతనానికి కారణమైంది. ఉదయం ఫ్లాట్‌గా మొదలైన సూచీలు క్రమంగా నష్టాల్లోకి జారుకుని ఏ దశలోనూ కోలుకోలేదు. చివరకు నష్టాలతోనే రోజును ముగించాయి. సెన్సెక్స్ 400 పాయింట్లకు పైగా కోల్పోయింది. నిఫ్టీ మళ్లీ 22, 800 దిగువకు పడిపోయింది. గురువారం ముగింపు (75, 735)తో పోల్చుకుంటే శు



క్రవారం ఉదయం 100 పాయింట్లకు పైగా నష్టంతో రోజును ప్రారంభించిన సెన్సెక్స్ ఆ తర్వాత మరింతగా నష్టాల్లోకి జారుకుంది. మధ్యాహ్నం తర్వాత ఆ నష్టాలు మరింత పెరిగాయి. ఒకదశలో సెన్సెక్స్ 600 పాయింట్లకు పైగా కోల్పోయి 75, 112 వద్ద ఇంట్రాడే కనిష్టానికి చేరుకుంది. చివరకు 424 పాయింట్ల నష్టంతో 75, 311 వద్ద రోజును ముగించింది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే కదలాడింది. చివరకు 117 పాయింట్ల నష్టంతో 22, 795 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్‌లో జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ, ఎల్ అండ్ టీ టెక్నాలజీస్, నాల్కో, పీబీ ఫిన్‌టెక్ షేర్లు లాభాలను ఆర్జించాయి. సయంట్, ఎమ్ అండ్ ఎమ్, గోద్రేజ్ ప్రాపర్టీస్, బయోకాన్ షేర్లు నష్టాలను చవిచూశాయి. కాగా, భారీ నష్టాలను చవిచూస్తున్న స్మాల్, మిడ్ క్యాప్ ఇండెక్స్‌లు గురువారం కూడా నష్టపోయింది.

## ఇక సెట్ టాప్ బాక్స్‌ల పోర్టబిలిటీ!



**న్యూఢిల్లీ-నవభూమి:**మొబైల్ నంబర్ పోర్టబిలిటీ తరహాలో సెట్ టాప్ బాక్స్‌ల్లోనూ ఇంటారాపరబిలిటీ సదుపాయాన్ని అందుబాటులోకి తేవాలని టెలికాం నియంత్రణ ప్రాధికార సంస్థ(ట్రాయ్) సిఫారసు చేసింది. బ్రాడ్‌కాస్టింగ్ కంపెనీ లు తమ మౌలిక సదుపాయాలను పరస్పరం పంచుకోవాలని, ఐపీటీవీ సర్వీస్ ప్రొవైడర్లకు కనీస నెట్‌వర్త్ పరిమితిని సైతం తగ్గించాలని ట్రాయ్ సిఫారసు చేసింది. సెట్ టాప్ బాక్స్‌ల్లో పోర్టబిలిటీ సదుపాయం అందుబాటులోకి వస్తే, కస్టమర్లు ఇతర బ్రాడ్‌కాస్టింగ్ సేవలకు మారినప్పుడు సెట్ టాప్ బాక్స్‌ను కూడా మార్చుకోవాల్సిన బెడద తప్పుతుంది.

## గ్రాన్యూల్స్ గూటికి స్విస్ కంపెనీ

GRANULES


**న్యూఢిల్లీ-నవభూమి:** స్విట్జర్లాండ్‌కు చెందిన సీడీఎంఓ (కాంట్రాక్ట్ రీసెర్చ్, డెవలప్‌మెంట్ అండ్ మాన్యుఫాక్చరింగ్) సేవల కంపెనీ 'సెన్ కెమికల్స్ ఏజీ'ని 2 కోట్ల స్విస్ ఫ్రాంక్‌లకు (సుమారు రూ.192 కోట్లు) కొనుగోలు చేసినట్లు హైదరాబాద్‌కు చెందిన ఔషధ సంస్థ గ్రాన్యూల్స్ ఇండియా శుక్రవారం ప్రకటించింది. తద్వారా గ్రాన్యూల్స్ కూడా సీడీఎంఓ విభాగంలోకి ప్రవేశించినట్లైంది. సెన్ కెమికల్స్ తన గ్లోబల్ కస్టమర్ల కోసం పెప్టైడ్స్, పెప్టైడ్స్ ఆ?ధారిత అప్లికేషన్లను అభివృద్ధి చేయడంతో పాటు ఉత్పత్తి చేస్తుంది. ఈ ప్రథమార్ధంలోనే డీల్ పూర్తి కావచ్చని గ్రాన్యూల్స్ వెల్లడించింది.

## జీరో ఫర్ జీరో టారిఫ్ వ్యూహం మెరుగు



**న్యూఢిల్లీ-నవభూమి:**అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన పరస్పర సుంకాల సమస్యను పరిష్కరించుకునేందుకు భారత్‌కు గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనీషియేటివ్ (జీటీఆర్ఐ) ఓ సూచన చేసింది. పరస్పర సుంకాలు అమలులోకి రాకముందే యూఎస్‌కు భారత్ 'జీరో ఫర్ జీరో' టారిఫ్ వ్యూహాన్ని ప్రతిపాదించాలని సూచించింది. అమెరికాతో పూర్తి స్థాయి ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవడం కంటే ఈ ప్రతిపాదనతో నష్టం తక్కువని జీటీఆర్ఐ అభిప్రాయపడింది. ఈ వ్యూహంలో భాగంగా, దేశీయ పరిశ్రమలు, వ్యవసాయ రంగానికి నష్టం జరగకుండా అమెరికా నుంచి దిగుమతి చేసుకుంటున్న ఏయే ఉత్పత్తులపై సుంకాన్ని పూర్తిగా రద్దు చేయవచ్చని భారత్ గుర్తించాలి. అందుకు బదులుగా, అమెరికా కూడా అదే సంఖ్యలో భారత్ నుంచి దిగుమతి చేసుకుంటున్న ఉత్పత్తులపై సుంకాన్ని పూర్తిగా రద్దు చేయాల్సి ఉంటుంది. భారత్ ఈ జాబితా నుంచి వ్యవసాయ ఉత్పత్తులను చాలా వరకు మినహాయించవచ్చు. ఈ జాబితాను రూపొందించేందుకు జపాన్, కొరియా, ఆసియాన్‌తో కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను పరిశీలించాలని జీటీఆర్ఐ తన నోట్‌లో పేర్కొంది. ఏప్రిల్‌కు ముందే ఈ జాబితాపై అమెరికాతో చర్చించి, ఆమోదం పొందగలిగితే భారత్‌పై పరస్పర సుంకాల ప్రభా వం అతి స్వల్పంగా లేదా దాదాపుగా ఉండకపోవచ్చని జీటీఆర్ఐ వ్యవస్థాపకులు అజయ్ శ్రీవాస్తవ అన్నారు. జీరో ఫర్ జీరో టారిఫ్ వ్యూహం ద్వారా భారత్ 90 శాతం పారిశ్రామిక ఉత్పత్తులపై అధిక సుంకాల భారాన్ని తప్పించవచ్చన్నారు. జీరో ఫర్ జీరో టారిఫ్ వ్యూహం ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ) నిబంధనలకు విరుద్ధమైనప్పటికీ, సంక్లిష్టమైన రాయితీలు, వ్యవసాయ సబ్సిడీల్లో కోత, మేధో సంపత్తి హక్కులను బలహీనపరిచే, సమాచార ప్రవాహ ఆంక్షలను ఎత్తివేయాల్సి వచ్చే పూర్తి స్థాయి స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కంటే తక్కువ నష్టం కలిగించేదన్నారు. 2024 నాటికి భారత్-అమెరికా మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం 12,500 కోట్ల డాలర్ల స్థాయికి చేరింది.


## సుంకాలు తగ్గించుకుంటే మనకే మేలు



**న్యూఢిల్లీ-నవభూమి:** సుంకాలు ఏ దేశాన్నీ రక్షించలేవని.. మన మేలు కోసం వాటిని తగ్గించుకోవాలని నీతి ఆయోగ్ సీఈఓ బీవీఆర్ సుబ్రహ్మణ్యం అన్నారు. శుక్రవారం ఆల్ ఇండియా మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ఏఐఎంఏ) 69వ వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతూ అభివృద్ధి చెందిన దేశంగా ఎదిగేందుకు భారత్‌కున్న ఐదు ప్రాధాన్యాల్లో 'ప్రపంచంతో స్వేచ్ఛా వాణిజ్యం' ఒకటని ఆయన ఈ సందర్భంగా అన్నారు. సుంకాలను తగ్గించుకునేందుకు యూరోపియన్ యూనియన్, యునైటెడ్ కింగ్‌డమ్ సహా ఇతర అభివృద్ధి చెందిన దేశాలతో భారత్ తప్పనిసరిగా వాణిజ్య ఒప్పందాలను కుదుర్చుకోవాలన్నారు.

### సూపర్ స్టార్స్ శివకార్తికేయన్, నాని పుట్టినరోజులను

## టాటా ప్లే బింగేలో వారి ఉత్తమ హిట్‌లతో ఆచరించుకోండి




**హైదరాబాద్ - నవభూమి:**యాక్షన్ చిత్రాల నుంచి కామెడీ హిట్‌ల వరకు, శివకార్తికేయన్ మరియు నాని పుట్టినరోజులను వారి ఉత్తమ నటనను వీక్షిస్తూ ఆచరించుకోండి- అన్నీ టాటా ప్లే బింగేలోశివకార్తికేయన్ మరియు నాని తమ పుట్టినరోజులను ఆచరించుకుంటున్న నేపథ్యంలో, సినిమాల్లో వారి అద్భుతమైన ప్రయాణాలను ప్రశంసించేందుకు ఇది సరైన సమయం. ఇద్దరు నటులు ప్రత్యేకమైన నటనా శైలితో తమదైన ముద్రను ప్రేక్షకులపై వేశారు. వారి బహుముఖ ప్రజ్ఞ, అప్రయత్నంగా ఆకట్టుకునే శైలి, ఆకర్షణీయమైన పాత్ర ఎంపికలతో ప్రేక్షకుల హృదయాలను గెల్చుకున్నారు. ఫీల్-గుడ్ ఎంటర్‌టైనర్‌ల నుంచి ఉత్కంఠత రేకెత్తించే డ్రామా వరకు, వారి ఫిల్మోగ్రఫీ ఆకట్టుకునే వృద్ధిని ప్రతిబింబిస్తుంది. వారి సామర్థ్యాన్ని ప్రతిసారీ రుజువు చేస్తూనే ఉంటుంది. వారిద్దరూ ఎప్పటికప్పుడు అభివృద్ధి చెందుతున్న గ్రాఫ్‌తో, దక్షిణ భారత సినిమాలో అత్యంత ప్రియమైన తారలుగా గుర్తింపు దక్కించుకున్నారు. మైలురాయిగా నిలిచే ఈ పుట్టినరోజును వారి ఉత్తమ ఓటీటీ ప్రదర్శనలతో ఆచరించుకోవడం కన్నా మెరుగైన మార్గం ఏమిటి? శివకార్తికేయన్, నాని నటించిన అత్యంత ప్రియమైన సినిమాలను టాటా ప్లే బింగేలో చూడండి!జెర్సీ (తెలుగు)నాని నటించిన జెర్సీ అనేది ఒక భావోద్వేగ స్పోర్ట్స్ డ్రామా. ప్రతిభావంతుడైనప్పటికీ విఫలమైన క్రికెటర్ అర్జున్ ప్రయాణాన్ని మనం ఈ సినిమాలో చూడవచ్చు. అతను 30 ఏళ్ల వయసు దాడి నలభైల్లోకి చేరుకుంటున్న సమయంలో తన కొడుకు కోసం స్ఫూర్తిదాయకమైన పునరాగమనం చేస్తాడు. శ్రద్ధా శ్రీనాథ్‌తో కలిసి కెరీర్‌ను తీర్చిదిద్దుకుంటున్న పాత్రలో నాని నటించిన ఈ చిత్రం క్రీడలు, భావోద్వేగాలను అందంగా మిళితం చేస్తుంది. హృదయాన్ని తాకే నాని నటన, ముఖ్యంగా తండ్రీకొడుకుల క్షణాలలో, అతనికి అపారమైన ప్రశంసలు లభించాయి. ఉత్తమ నటుడిగా (తెలుగు) ఫిల్మ్‌ఫేర్ అవార్డును సంపాదించిపెట్టింది. అదేంటో గానీ ఉన్నపాటుగా వంటి మనోహరమైన ట్రాక్‌లతో, జెర్సీ తెలుగు సినిమా అత్యంత ప్రియమైన చిత్రాలలో ఒకటిగా మిగిలిపోయింది. ఇది Zee5 టాటా ప్లే బింగేలో అందుబాటులో ఉంది.

ప్రిన్స్ (తమిళం, తెలుగు)శివకార్తికేయన్ నటించిన ప్రిన్స్ అనేది ఒక తేలికపాటి రొమాంటిక్ కామెడీ. ఇది అన్బు అనే తమిళ ఉపాధ్యాయుడు బ్రిటిష్ మహిళతో ప్రేమలో పడటం, ఆమె మరియా ర్యాబోషప్క పోషించిన పాత్ర సాంస్కృతిక ఘర్షణలు, హాస్యాస్పదమైన పరిస్థితులకు దారితీస్తుంది. అనుదీప్ కెవి దర్శకత్వం వహించిన ఈ చిత్రం హాస్యాన్ని సామాజిక సందేశంతో మిళితం చేసింది. శివకార్తికేయన్ ఆకట్టుకునే రూపం, కామెడీ టైమింగ్ ఇందులో చక్కగా ఉంటుంది. పెప్పీ సౌండ్‌ట్రాక్, ముఖ్యంగా వైరల్ హిట్ జెస్సికా, ప్రేక్షకుల అభిమానంగా మారింది. ప్రిన్స్ సినిమా శివకార్తికేయన్ వినోదాత్మక పాత్రల నైపుణ్యాన్ని, తన చరిష్మాతో సినిమాను నడిపించే సామర్థ్యాన్ని మరింతగా ప్రదర్శించింది. ఇది జియోహాట్‌స్టార్ టాటా ప్లే బింగేలో అందుబాటులో ఉంది

హీరో (తెలుగు)..పి.ఎస్. మిత్రన్ దర్శకత్వం వహించిన హీరో, ఒక సూపర్ హీరో యాక్షన్ థ్రిల్లర్. ఇందులో శివకార్తికేయన్ శక్తిగా నటించాడు. అవినీతి విద్యా వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడే వ్యక్తిగా, విద్యార్థులు సామాజిక పరిమితులకు మించి ఆలోచించేలా ప్రేరేపించాడు. అభయ్ డియోల్, అర్జున్ మరియు కళ్యాణి ప్రియదర్శన్ చేసిన శక్తివంతమైన నటనలతో, ఈ చిత్రం ప్రేక్షకులను ఆకట్టుకుంది. శివకార్తికేయన్ అణగారిన వ్యక్తిగా, అప్రమత్తంగా ఉన్న వ్యక్తి పాత్రను పోషించడం విస్తృతంగా ప్రశంసలు అందుకుంది. మాల్టో కితాపులే వంటి పాటలు ప్రజాదరణ పొందాయి. ఆహా టాటా ప్లే బింగేలో దీన్ని చూడండి

నాని గ్యాంగ్ లీడర్ (తెలుగు)..నాని గ్యాంగ్ లీడర్ అనేది విక్రమ్ కె కుమార్ దర్శకత్వం వహించిన వినోదభరితమైన ప్రతీకార నాటకం. ఇందులో నాని పెన్సిల్ పాత్రను పోషించాడు. అతను ఒక స్మాల్-టైమ్ క్రైమ్ నవలా రచయిత. అతను అనుకోకుండా న్యాయం కోరుకునే మహిళల బృందానికి నాయకుడిగా మారతాడు. కామెడీ, భావోద్వేగాలు, థ్రిల్లర్ అంశాల ప్రత్యేకమైన మిశ్రమం కలిగిన ఈ సినిమాలో ప్రియాంక అరుల్ మోహన్, లక్ష్మి, శరణ్య పొన్వన్నన్ కార్తికేయ వంటి బలమైన సహాయక తారాగణం ఉన్నారు. నాని ఆకర్షణ మరియు హాస్య సమయం ఈ చిత్రాన్ని ఆకర్షణీయంగా మార్చాయి. అదే విధంగా అనిరుధ్ రవిచందర్ సంగీతం, ముఖ్యంగా హిట్ పాట రా రా, దాని ఆకర్షణను పెంచింది. దీన్ని అమెజాన్ ప్రైమ్ వీడియో మరియు టాటా ప్లే బింగేలో చూడండిఈ ఓటీటీ యాప్‌ల సబ్‌స్క్రిప్షన్‌ను ఎలా పొందాలో ఆలోచిస్తున్నారా? మీ కోసం మా వద్ద టాటా ప్లే బింగే ఉంది. వీక్షకులు 30o యాప్‌ల (అమెజాన్ ప్రైమ్ వీడియో, జియో హాట్‌స్టార్, ఆపిల్ టీవీం, జీ5, సోనీలైవ్, ఫ్యూజం, ఫ్యాన్‌కోడ్, హాల్‌మార్క్, లయన్స్‌గేట్ ప్లే, ఆహా, ఫ్రూ ట్, సన్ నెక్స్ట్, స్టేజ్, రీల్‌డ్రామా, చౌపాల్, నమ్మ ఫ్లిక్స్, ప్లానెట్ మరాఠీ, మనోరమామాక్స్, ఐస్ట్రీమ్, తరంగ్ ప్లస్, హంగామా ప్లే, షెమరూమీ, క్యూరియాసిటీ స్ట్రీమ్, ఎపిక్ ఆన్, ట్రావెల్‌ఎక్స్‌పి, డాక్యుబే, షార్ట్స్‌టీవీ, ప్లేఫ్లిక్స్, క్లిక్‌కె మరియు గేమ్స్) మొత్తం ప్యాకేజీని ఒకే సబ్‌స్క్రిప్షన్ కింద, ఒకే యాప్‌లో, ప్రతి యాప్ పాస్‌వర్డ్‌ను సబ్‌స్క్రైబ్ చేయకుండా లేదా గుర్తుంచుకోవాల్సిన అవసరం లేకుండా పొందవచ్చు. కనెక్ట్ చేయబడిన టీవీలతో సహా అన్ని పరికరాల్లో వీక్షణకు అందుబాటులో ఉంటుంది. అద్భుతంగా ఉంది కదూ? ఇది అద్భుతంగా ఉంది!!

## మార్చి 2025లో బ్యాంకు సెలవులు.. ఈసారి ఎన్ని రోజులంటే..




**న్యూఢిల్లీ-నవభూమి:**మరికొన్ని రోజుల్లో ఫిబ్రవరి నెల పూర్తి కాబోతుంది. ఈ క్రమంలో వచ్చే మార్చిలో ఎన్ని రోజులు బ్యాంకులకు సెలవులు ఉన్నాయి. ఎన్ని రోజులు పనిచేయనున్నాయనే విషయాలను ఇక్కడ తెలుసుకుందాం. ఈ సెలవుల్లో రెండో, నాల్గో శనివారాలతోపాటు ఆదివారం, ఇతర పండుగలు కూడా ఉన్నాయి. అయితే ఈసారి మార్చి 2025లో 13 రోజులు సెలవులు వచ్చాయి. మిగతా రోజుల్లో బ్యాంకులు పనిచేయనున్నాయి. కానీ ఈ సెలవులు ఆయా రాష్ట్రాలను బట్టి మారుతుంటాయి.

మార్చి 2025లో బ్యాంకు సెలవుల జాబితా

మార్చి 2, ఆదివారం - దేశంలోని అన్ని బ్యాంకులు మూసివేయబడతాయి

మార్చి 7, శుక్రవారం - చాప్చర్ కుట్ పండుగ సందర్భంగా ఐజ్వాల్‌లో బ్యాంకులకు సెలవు

మార్చి 9, రెండో శనివారం - నేపథ్యంలో దేశంలోని అన్ని బ్యాంకులు మూసివేయబడతాయి

మార్చి 13, గురువారం - హోలిక దహన్ సందర్భంగా డెహ్రాడూన్, కాన్పూర్, లక్నో, రాంచీ, తిరువనంతపురంలలో బ్యాంకులకు హాలిడే

మార్చి 14, శుక్రవారం - హోలీ సందర్భంగా అగర్తల, బెంగళూరు, భువనేశ్వర్, చెన్నై, కోచ్చి, కోహిమా, ఇంఫాల్ మినహా దేశవ్యాప్తంగా బ్యాంకులకు సెలవు

మార్చి 15, శనివారం - యావోసెంగ్ దినోత్సవం నేపథ్యంలో అగర్తల, భువనేశ్వర్, ఇంఫాల్, పాట్నాలో బ్యాంకులకు హాలిడే

మార్చి 16, ఆదివారం - దేశవ్యాప్తంగా అన్ని బ్యాంకులు బంద్

మార్చి 22, నాల్గో శనివారం నేపథ్యంలో దేశవ్యాప్తంగా బ్యాంకులకు సెలవు

మార్చి 23, ఆదివారం - దేశంలో అన్ని బ్యాంకులు బంద్

మార్చి 27, గురువారం - షబ్-ఎ-ఖదర్ సందర్భంగా జమ్మూ, శ్రీనగర్‌లలో బ్యాంకులకు సెలవు

మార్చి 28, శుక్రవారం - జమాత్ ఉల్ విదా నేపథ్యంలో జమ్మూ, శ్రీనగర్‌లలో బ్యాంకులకు హాలిడే

మార్చి 30, ఆదివారం - దేశవ్యాప్తంగా బ్యాంకులకు హాలిడే

మార్చి 31, సోమవారం - రంజాన్ ఈద్ సందర్భంగా ఐజ్వాల్, సిమ్లా మినహా దేశవ్యాప్తంగా బ్యాంకులకు సెలవు

ఈ సేవలు మాత్రం..

అయితే బ్యాంకులకు సెలవులు ఉన్నప్పటికీ, వినియోగదారులు ఆన్‌లైన్ సేవలను వినియోగించుకోవచ్చు. ఈ క్రమంలో యూపీఐ, మొబైల్ బ్యాంకింగ్, ఇంటర్నెట్ బ్యాంకింగ్ వంటి డిజిటల్ సేవలను ఫోన్ల ద్వారా ఉపయోగించుకోవచ్చు. దీంతోపాటు ఏటీఎం కేంద్రాల నుంచి క్యాష్ విత్ డ్రా, డిపాజిట్ సౌకర్యాలు కూడా అందుబాటులో ఉంటాయి.

## బంగారం కొనాలనుకునే వారికి గుడ్ న్యూస్.. ధర ఎంత తగ్గిందంటే..




**న్యూఢిల్లీ-నవభూమి:**అంతర్జాతీయ మార్కెట్ ప్రభావంతో కొన్ని రోజులుగా పెరుగుతూ వస్తున్న బంగారం ధరలు వరసగా రెండో రోజూ తగ్గుముఖం పట్టాయి. నూతనంగా ఎన్నికైన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సంచలన నిర్ణయాలతో ప్రపంచవ్యాప్తంగా స్టాక్ మార్కెట్లు భారీ నష్టాల్లోకి వెళ్తున్నాయి. దీంతో ఇన్వెస్టర్లు అంతా బంగారం వైపు మొగ్గు చూపుతున్నారు. దాన్ని సురక్షితమైన పెట్టుబడిగా నమ్మడంతో కొనుగోలు చేసేందుకు క్యూ కడుతున్నారు.

ఈ నేపథ్యంలోనే పసిడికి భారీగా డిమాండ్ పెరుగుతోంది. కాగా, ఇవాళ (22-02-2025)న గోల్డ్ ధర స్వల్పంగా తగ్గింది. https://bullions.co.in ప్రకారం.. దేశ రాజధాని ఢిల్లీలో ఇవాళ ఉదయం 06:30 గంటల సమయానికి 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.78,760 కాగా, 24 క్యారెట్ల తులం పసిడి ధర రూ.85,920గా ఉంది. హైదరాబాద్‌లో 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ ధర రూ.79,026 ఉండగా.. 24 క్యారెట్ల తులం బంగారం ధర రూ.86,210గా ఉంది. ఇక ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడ, విశాఖపట్నంలోనూ హైదరాబాద్ రేట్లే కొనసాగుతున్నాయి.


**వెండి ధరలు ఇలా..**

మరోవైపు వెండి ధరలు కూడా తగ్గుముఖం పడుతున్నాయి. ఢిల్లీలో కిలో వెండి ధర రూ.96,280 గా ఉంది. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నంలో కేజీ వెండి ధర రూ.96,600 పలుకుతోంది. దేశ ఆర్థిక రాజధాని ముంబైలో కిలో వెండి రూ.96,440 వద్ద కొనసాగుతోంది.

ప్రధాన నగరాల్లో బంగారం (22, 24 క్యారెట్ల) ధరలు ఇవే..

ముంబై- రూ.78,898, రూ.86,070
పుణె- రూ.78,898, రూ.86,070
జైపూర్- రూ.78,888, రూ.86,060
పట్నా- రూ.78,852, రూ.86,020
చెన్నై- రూ.79,127, రూ.86,320
బెంగళూరు- రూ.78,962, రూ.86,140
కోల్‌కతా- రూ.78,788, రూ.85,950
భోపాల్- రూ.78,980, రూ.86,160
భువనేశ్వర్- రూ.78,916, రూ.86,090
తిరువనంతపురం-రూ.79,136, రూ.86,330

## అలర్ట్.. ఆధార్‌లో మీ నంబర్, పేరు, అడ్రస్ ఎన్నిసార్లు మార్చుకోవచ్చో తెలుసా..




**న్యూఢిల్లీ-నవభూమి:**ప్రస్తుతం భారతీయులకు ఆధార్ గుర్తింపు కార్డు తప్పనిసరిగా మారిపోయింది. అయితే దీనిని తీసుకుని పదేళ్లు దాటిన వారు సహా ఆధార్‌లో తప్పులు ఉన్న వారు కూడా సరిదిద్దుకోవాలని ఫ్రీ ఛాన్స్ ఇచ్చారు. గతంలో దీని గడువు డిసెంబర్ 14, 2024 వరకు ఉండగా, ఇటీవల జూన్ 14, 2025 వరకు పొడిగించారు. దీంతో మీ ఆధార్ వివరాలను ఉచితంగా అప్‌డేట్ చేసుకునేందుకు జూన్ వరకు సమయం ఉంది. కానీ అప్‌డేట్ చేసుకునే విషయంలో మాత్రం కొన్ని తప్పులు చేయొద్దని నిపుణులు సూచిస్తున్నారు. ఎందుకంటే ఆధార్ అడ్రస్, పేరు, ఫోన్ నంబర్ వంటి వివరాలను మార్పు చేసుకునే విషయంలో పరిమితి ఉందని చెబుతున్నారు. ఈ పరిమితి దాటితే మార్పు చేసుకునేందుకు మళ్లీ ఛాన్స్ ఉండదని అంటున్నారు.

ఒకసారి మాత్రమే

ఈ క్రమంలో మీరు ఆధార్‌లో పేరును రెండుసార్లు మాత్రమే మార్చుకోవచ్చు. ఇక పుట్టిన తేదీని అయితే, ఒకసారి మాత్రమే మార్చుకునే ఛాన్సుంది. మరోవైపు ఆధార్ కార్డులో చిరునామాను ఎన్నిసార్లైనా మార్చుకోవచ్చు. మీరు మీ ఆధార్ అప్‌డేట్ చేసుకునే విషయంలో వీటిని తప్పనిసరిగా గుర్తుంచుకోవాలి. లేదంటే తెలియకుండా మీరు డేట్ ఆఫ్ బర్త్ వంటి వివరాలను ఒకసారికి మించి మార్చుకుంటే ఇబ్బందులు పడే అవకాశం ఉంటుంది. ఈ మార్పులు కాకుండా ఏదైనా ప్రత్యేక పరిస్థితుల్లో మరిన్ని మార్పులు అవసరమైతే, మీరు ప్రాంతీయ కార్యాలయం నుంచి అనుమతి తీసుకోవాల్సి వస్తుంది. వారు అనుమతి ఇస్తే మార్పు చేసుకోవచ్చు.ఫోన్ నంబర్...ఇక ఫోటో మార్పు విషయానికి వస్తే, ఆధార్ కార్డులో ఫోటో మార్చుకోవడానికి, ఎటువంటి పరిమితి లేదు. కానీ సాధారణంగా దీనిని అవసరాన్ని బట్టి మార్చుకోవచ్చు. అయితే ప్రతి మార్పునకు సరైన విధానాన్ని అనుసరించాలి. ఫోటోతో పాటు, మీరు మీ మొబైల్ నంబర్‌ను కూడా మీకు కావలసినన్ని సార్లు అప్‌డేట్ చేసుకోవచ్చు. ఈ నేపథ్యంలో మీరు బయోమెట్రిక్ వివరాలు (వేలిముద్రలు, ఐరిస్ స్కాన్), మొబైల్ నంబర్ అప్‌డేట్ కోసం మీ సమీపంలోని ఆధార్ సేవా కేంద్రాన్ని సందర్శించాలి. మిగతా వివరాలను మీరు ఇంటి వద్దనే ఉండి ఆన్‌లైన్ ద్వారా ఈజీగా మార్చుకునే ఛాన్సుంది.


## అదానీ సంపదలో రూ.లక్ష కోట్లు ఫట్



**న్యూఢిల్లీ-నవభూమి:** భారత్‌లో రెండో అతి పెద్ద ధనవంతుడైన గౌతమ్ అదానీ సంపదకు భారీగా గండి పడింది. బ్లూమ్‌బర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ ప్రకారం.. ఈ సంవత్సరంలో ఇప్పటివరకు అదానీ వ్యక్తిగత ఆస్తి 1,190 కోట్ల డాలర్ల (రూ.1.03 లక్ష ల కోట్లు) మేర తగ్గి 6,680 కోట్ల డాలర్లకు (రూ.5.81 లక్షల కోట్లు) పడిపోయింది. ప్రపంచ కుబేరుల జాబితాలో అదానీ ప్రస్తుతం 23వ స్థానానికి జారుకున్నారు. అదానీ గ్రీన్ ఎనర్జీ నుంచి సౌర విద్యుత్ సరఫరా ఒప్పందాలు చేసుకునేందుకు ఆంధ్రప్రదేశ్ సహా నాలుగు రాష్ట్రాలకు చెందిన ఉన్నతాధికారులకు 25 కోట్ల డాలర్ల (రూ.2,200 కోట్ల) లంచాలు ఇచ్చారనే ఆరోపణలపై గత ఏడాదిలో అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ, సాగర్ అదానీ సహా 8 మంది వ్యక్తులపై అమెరికాలో కేసు నమోదైంది. దాంతో అదానీ గ్రూప్ కంపెనీల షేర్ల విలువ గడిచిన కొన్ని నెలల్లో భారీగా తగ్గుతూ వచ్చింది. తత్ఫలితంగా గౌతమ్ అదానీ వ్యక్తిగత సంపద కూడా క్షీణించింది.

2025లో అత్యధికంగా సంపద నష్టపోయిన ప్రపంచ బిలియనీర్లలో టెస్లా అధిపతి ఎలాన్ మస్క్ తర్వాత స్థానం అదానీదే. ప్రపంచంలో నం.1 ధనవంతుడైన మస్క్ నెట్‌వర్త్ ఈ ఏడాదిలో 3,520 కోట్ల డాలర్ల (రూ.3.06 లక్షల కోట్లు) మేర తగ్గి 39,700 కోట్ల డాలర్లకు (రూ.34.54 లక్షల కోట్లు) పడిపోయింది. కాగా, భారత కుబేరుడు ముకేశ్ అంబానీ ఆస్తి కూడా కరిగిపోయింది. ఈ ఏడాదిలో ఇప్పటివరకు 294 కోట్ల డాలర్ల (రూ.25,578 కోట్లు) మేర తగ్గి 8,770 కోట్ల డాలర్లకు (రూ.7.63 లక్షల కోట్లు) పడిపోయింది. బ్లూమ్‌బర్గ్ రిచ్ లిస్ట్‌లో అంబానీ ప్రస్తుతం 17వ స్థానంలో ఉన్నారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
7
హైదరాబాద్
ఆదివారం
23 । ఫిబ్రవరి । 2025





## రైలు ఆసల్యమైందా.. ఈ బంపర్ ఆఫర్ మీకు తెలుసా..

**న్యూఢిల్లీ-నవభూమి:** రైలు ప్రయాణం ఒక్కోసారి ఆలస్యవుతుంది. ప్రస్తుతం సాంకేతికత పెరగడంతో గతంతో పోలిస్తే రైళ్ల రాకపోకల సమయంలో భారీ తేడా కనిపిస్తోంది. గతంలో గంటలకొద్దీ రైళ్లు ఆలస్యంగా నడిచేవి. ప్రస్తుతం చాలా రైళ్లు నిర్దిష్ట సమయానికి గమ్యస్థానాలను చేరుకుంటున్నాయి. ఏవైనా పండుగలు లేదా ఉత్సవాల వేళ ప్రత్యేక రైళ్లను రైల్వేశాఖ నడిపితే మాత్రం వాటి రాకపోకల విషయంలో నిర్దిష్ట సమయానికి, గమ్యస్థానానికి వెళ్లే సమయానికి భారీ తేడా ఉండొచ్చు. సాధారణంగా రైలు ఎక్కువ గంటలు ఆలస్యమైతే రైలులో ప్రయాణించే ప్రయాణీకులకు రైల్వేశాఖ కొన్ని సదుపాయాలు కల్పిస్తుంది. రైలు స్టేషన్‌నుంచి బయలుదేరిన తర్వాత గమ్యస్థానం చేరుకోవడానికి ఆలస్యమైతే కొన్ని రైళ్లలో రైల్వేశాఖ ఉచితంగా అల్పాహారం, భోజన సదుపాయం కల్పిస్తుంది. అదే సమయంలో ప్రకృతి వైపరీత్యం లేదా అనుకోని కారణాలతో రైలు ఎక్కువసేపు ఆలస్యమైతే రైల్వేశాఖ ప్రయాణీకులకు భోజన వసతి కల్పిస్తుంది. ప్రీమియం రైళ్లు రాజధాని, శతాబ్ది, దురంతో ఎక్స్‌ప్రెస్‌లు నిర్దేశిత సమయానికి రెండు లేదా అంతకంటే ఎక్కువ గంటలు ఆలస్యమైతే రైల్వేశాఖ రిజర్వుడు ప్రయాణీకులకు ఉచిత అల్పాహారం, భోజన వసతి కల్పిస్తుంది. అంతేకాదు కొన్ని సందర్భాల్లో రైల్వే టికెట్‌కు సంబంధించిన మొత్తం రుసుమును వెనక్కి ఇస్తుంది. అది ఏ సందర్భంలోనో తెలుసుకుందాం.

## కేంద్రమంత్రిని విరిగిన సీట్లో కూర్చోబెట్టిన ఎయిరిండియా.. గంటన్నర పాటు నరకం.. ఏమంటున్నారంటే?




**న్యూఢిల్లీ-నవభూమి:** కేంద్ర వ్యవసాయ శాఖ మంతి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు ఎయిర్ ఇండియా విమానయాన సంస్థ చేదు అనుభవాన్ని కల్గించింది. ఇటీవలే ఆయన భోపాల్ నుంచి ఢిల్లీకి వెళ్లేందుకు విమాన టికెట్ బుక్ చేసుకోగా.. ఆయనకు విరిగిపోయిన సీటు వచ్చింది. విమానంలో చాలా సీట్ల పరిస్థితి అలాగే ఉండగా.. కేంద్రమంత్రి విరిగిన సీట్లోనే కూర్చుని ప్రయాణం చేయాల్సి వచ్చింది. దాదాపు 1.30 గంటల పాటు అలాగే కూర్చుని నరకం చూశారు. ఈ విషయాన్ని నేరుగా ఆయనే సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. ఆ పూర్తి వివరాలు మీకోసం.కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఇటీవలే భోపాల్ నుంచి ఢిల్లీకి ప్రయాణించారు. అయితే ఎయిర్ ఇండియాకు చెందిన ఏఐ436 విమానంలో టికెట్ బుక్ చేసున్నాని చెప్పారు. అయితే సంస్థ తనకు నెంబర్ 8సీ కేటాయించిందని తెలిపారు. తాను విమానం ఎక్కిన వెంటనే సీటు వద్దకు వెళ్లి కూర్చోగా.. అది విరిగిపోయినట్లు గుర్తించానన్నారు. అది చూసి షాకైన తాను దీనిపై ఎయిర్ లైన్స్ సిబ్బందిని ప్రశ్నించగా.. యాజమాన్యం ఈ సమస్యను ఆలస్యంగా గుర్తించిందని చెప్పారట. అంతేకాకుండా ఈ సీటు టికెట్‌ను ప్రయాణికులకు విక్రయించకూడదని ఆదేశించినట్లు కూడా వివరించారట.విమానంలో ఆ ఒక్క సీటు మాత్రమే కాకుండా అనేక సీట్లు విరిగిపోయి, పాడైపోయే ఉన్నట్లు తాను గుర్తించానని కేంద్రమంత్రి స్పష్టం చేశారు. ఈ సమస్యను అర్థం చేసుకున్న తోటి ప్రయాణికులు వాళ్ల సీట్లలో కూర్చోవాలని చెప్పారని అన్నారు. కానీ వాళ్లను ఇబ్బంది పెట్టడం ఏమాత్రం ఇష్టం లేని తాను 1.30 గంటల పాటు విరిగిన సీట్లోనే కూర్చుని ప్రయాణం చేసినట్లు చెప్పుకొచ్చారు. ఇలాంటి చర్యలు ప్రయాణికులను మోసం చేయడమే అవుతుందని కూడా కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ వెల్లడించారు.ఎయిర్ ఇండియా నిర్వహణను టాటా గ్రూప్ తీసుకున్న తర్వాత ఎయిర్ లైన్స్ సేవలు మెరుగు పడతాయని తాను భావించానని చెప్పుకొచ్చారు. కానీ అదంతా తన అపోహ మాత్రమేనని అర్థం అయిందంటూ అసహనం వ్యక్తం చేశారు. ఇదంతా ఇలా ఉండగా.. 1932వ సంవత్సరంలో టాటా గ్రూప్ టాటా ఎయిర్ సర్వీసెస్ పేరుతో ఎయిన్ ఇండియాను స్థాపించింది. అయితే స్వాతంత్ర్యం వచ్చాకా 1953లో అప్పటి ప్రధాన మంత్రి జవహార్ లాల్ నెహ్రూ ఈ సంస్థను జాతీయం చేశారు. 69 ఏళ్ల పాటు ఇలాగే కొనసాగగా.. 2022లో ప్రభుత్వం విమానయాన సంస్థ ఎయిర్ ఇండియాను తిరిగి టాటా గ్రూపునకు అప్పగించింది.

## ధూమపాన ప్రియులకు చేదువార్త.. మరింత పెరగనున్న సిగరెట్ ధరలు



**న్యూఢిల్లీ-నవభూమి:** ధూమపాన ప్రియులకు కేంద్ర ప్రభుత్వం చేదువార్త చెప్పబోతుంది. త్వరలోనే సిగరెట్లతో పాటు పొగాకు ఉత్పత్తుల ధరలను పెంచాలని భావిస్తోంది. పన్ను ఆదాయం తగ్గకుండా చూసేందుకు కేంద్ర ప్రభుత్వం సిగరెట్, పొగాకు ఉత్పత్తులకు జీఎస్టీ ధరలను పెంచాయలని చూస్తోంది. ప్రస్తుతం వీటిపై జీఎస్టీ 28 శాతం ఉండగా.. ఇతర ఛార్జీలతో కలిసి 52 శాతం పన్నులు విధిస్తున్నారు. త్వరలోనే జీఎస్టీని 28 శాతం నుంచి 40 శాతానికి పెంచాలని కేంద్రం ఆలోచిస్తోంది. దీంతో సిగరెట్లు సహా పొగాకు ఉత్పత్తులపై ధరలు అధికంగా పెరగనున్నాయి. ఆ పూర్తి వివరాలు మీకోసం.సిగరెట్లు, పొగాకు ఉత్పత్తులపై విధించే పరిహార సెస్ గడువు 2026వ సంవత్సరం మార్చి నెలతో ముగియబోతుంది. ఒకవేళ అది లేకపోయినా పన్ను ఆదాయం తగ్గకుండా చూసుకోవడమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్న కేంద్ర ప్రభుత్వం.. పాత సెస్ స్థానంలో కొత్త సెస్ ప్రవేశ పెట్టాలని కోరుకోవడం లేదని అధికారులు చెబుతున్నారు. అందుకే ముందస్తు చర్యల్లో భాగంగా పొగాకు, సిగరెట్లపై జీఎస్టీ ధరలను పెంచబోతుంది. జీఎస్టీ కౌన్సిల్ ఆధ్వర్యంలోని మంత్రుల ప్యానెల్ ప్రస్తుతం ఈ అంశాన్ని సమీక్షిస్తోంది. తుది నిర్ణయం తీసుకునే ముందు దాని సిఫార్సులను సమర్పించే అవకాశం కూడా ఉంది.ధూమపానం ఆరోగ్యానికి హానికరం కావడం, వీటి వల్లే అనేక మంది క్యాన్సర్ బారిన పడుతూ నరకం చూడడం, ప్రాణాలు పోగొట్టుకోవడం వల్ల వీటిని పాపపు వస్తువులు కేటగిరీలో చేర్చారు. అందుకే వీటి వినియోగాన్ని తగ్గించేందుకు, వినియోగదారులను నిరుత్సాహ పరిచేందుకు వీటిపై భారీగా పన్ను విధిస్తున్నారు. ముఖ్యంగా వీటిపై ప్రాథమిక ఎక్సైజ్ డ్యూటీ, జాతీయ విపత్తుల కంటింటెంజ్ డ్యూటీలను కూడా విధిస్తున్నారు. మన దేశంలో ప్రస్తుతం సిగరెట్ల పన్ను 53 శాతంగా ఉండగా.. ఇది ప్రపంచ ఆరోగ్యం సంస్థ సిఫార్సు చేసిన 75 శాతం కంటే తక్కువ.పొగాకు మరియు పొగాకు ఉత్పత్తులు భారీ పన్ను ఆదాయాన్ని సృష్టిస్తాయి. 2022-2023లో పొగాకు ఉత్పత్తుల వల్ల రూ.72,788 కోట్ల ఆదాయం ప్రభుత్వానికి వచ్చింది. ఇదిలా ఉండగా పొగాకు ఉత్పత్తులపై పరిహార సెస్ ప్రస్తుతం 5 శాతంగా ఉండగా.. దీనితో పాటు 1000 సిగరెట్లకు వాటి పొడవు, ఫిల్టర్, రుచి ఆధారంగా రూ.2,076 నుంచి రూ.4,170 వరు అదనపు నిర్దిష్ట లెవీ విధించబడుతోంది. ముఖ్యంగా పొగాకు ఉత్పత్తులపై పన్నును సమీక్షించేందుకు జీఎస్టీ కౌన్సిల్ గతంలో అప్పటి ఒడిశా ఆర్థిక మంత్రి నిరంజన్ పూజారి నేతృత్వంలో మంత్రుల బృందాన్ని ఏర్పాటు చేసింది. ప్రస్తుతం వీళ్లే జీఎస్టీ ధరల పెంపను పరిశీలిస్తున్నారు. చూడాలి మరి ఏ జరగనుంది అనేది.

## ఛావా ఎఫెక్ట్.. సైన్‌బోర్డులపై బ్లాక్ స్ప్రే, శివాజీ పోస్టర్లు

**న్యూఢిల్లీ-నవభూమి:** ఛత్రపతి శివాజీ కుమారుడు శంభాజీ మహరాజ్ కథాంశంతో విక్కీ కౌశల్ నటించిన "ఛావా" సినిమా ఫీవర్ నడుస్తోంది. ఈ చిత్రాన్ని చూసిన కొందరు యువకులు రాజధానిలోని అక్బర్ రోడ్డు, హుమయూన్ రోడ్‌లోని సైన్‌బోర్డులపై బ్లాక్ ఇంక్ పూసి, ఛత్రపతి శివాజీ పోస్టర్లు అతికించారు. ఇందుకు సంబంధించిన పలు వీడియోలు సోషల్ మీడియాలా హల్‌చల్ చేస్తున్నాయి. సైన్‌బోర్డులపై యువకులు బ్లాక్ ఇంక్ స్ప్రే చేస్తూ మరాఠా సామ్రాజ స్థాపకుడు శివాజీ పోస్టర్లు అంటించడం ఇందులో కనిపిస్తోంది. శివాజీ తనయుడైన శంభాజీ మరాఠా సామ్రాజ్యానికి రెండో రాజుగా పాలన సాగించారు.

## రాజస్థాన్ ముఖ్యమంత్రికి హత్య బెదిరింపులు.. జైల్లో ఉండే ఫోన్ చేసిన ఖైదీ




**న్యూఢిల్లీ-నవభూమి:** రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్ లాల్ శర్మకు తాజాగా హత్య బెదిరింపులు వచ్చాయి. దౌసా జైల్లో ఖైదీగా శిక్ష అనుభవిస్తున్న ఓ యువకుడు నేరుగా పోలీస్ కంట్రోల్ రూంకు ఫోన్ చేసి మరీ సీఎంను చంపబోతున్నట్లు చెప్పాడు. దీంతో అప్రమత్తమైన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఈక్రమంలోనే తమకు వచ్చిన ఫోన్ నెంబర్, లొకేషన్ ఆధారంగా అది జైల్లో నుంచి వచ్చినట్లు గుర్తించారు. ఆపై విచారణ సాగించగా.. షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఆ పూర్తి వివరాలు మీకోసం.
శుక్రవారం - శనివారం రోజు అర్ధరాత్రి జైపూర్ పోలీస్ కంట్రోల్ రూంకు ఓ వ్యక్తి ఫోన్ చేసి.. రాజస్థాన్ ముఖ్యమంత్రిని చంపబోతున్నట్లు బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో అప్రమత్తమైన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. తమకు వచ్చిన ఫోన్ నెంబర్, లొకేషన్ ఆధారంగా ఆ ఫోన్ ఎవరు చేశారో గుర్తించారు. ముఖ్యంగా దౌసా జైలు నుంచి ఆ ఫోన్ రాగా.. అక్కడకు వెళ్లి సోదాలు నిర్వహించారు. శనివారం వేకువజామున 3 గంటల నుంచి ఉదయం 7 గంటల వరకు అంటే నాలుగు గంటల పాటు తనిఖీలు చేపట్టగా.. ఫోన్ దొరికింది. ఈక్రమంలోనే సీసీటీవీ ఫుటేజీ పరిశీలించగా ఓ ఖైదీయే ఈ బెదిరింలకు పాల్పడినట్లు గుర్తించారు. ముఖ్యంగా సీఎంను చంపేస్తానంటూ ఫోన్ చేసిన ఖైదీ పేరు రింకు కాగా.. ప్రస్తుతం అతడికి 29 ఏళ్ల వయసు. అయితే అత్యాచారం కేసులో జీవితఖైదు అనుభవిస్తున్న రింకు వద్దకు ఫోన్ రావడానికి కారణం జైల్లో ఉన్న ఓ అధికారియే కారణం అని కూడా పోలీసులు గుర్తించారు.
ముఖ్యంగా ఈ దర్యాప్తు బాధ్యతను జైలు ఇన్‌స్పెక్టర్ జనరల్ విక్రమ్ సింగ్‌కు అప్పగించినట్లు రాష్ట్ర హోంమంత్రి జవహార్ సింగ్ బేఢం తెలిపారు. అసలు నిందితుడు ఎందుకు బెదిరింపులకు పాల్పడ్డాడు, ఇంకా ఇతడికి ఎవరెవరు సహకరించారు వంటి విషయాలను జైలు ఇన్‌స్పెక్టర్‌యే తేల్చబోతున్నారు. చూడాలి మరి ఏం జరగనుంది అనేది.

## దొంగతనాలు చేసి ప్రియురాళ్లను కుంభమేళా తీసుకెళ్లిన యువకులు.. తిరిగొచ్చాక చూస్తే షాక్!



**ప్రయాగ్‌రాజ్-నవభూమి:** ఉత్తర ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళా గురించి అందరికీ తెలిసిందే. దేశం నలుమూలల నుంచే కాకుండా విదేశాల నుంచి సైతం అనేక మంది ప్రముఖులు ప్రయాగ్‌రాజ్ చేరుకుని పుణ్యస్నానాలు చేస్తున్నారు. ఈక్రమంలోనే ఓ ఇద్దరు యువకులు కూడా తమ ప్రియురాళ్లతో అక్కడకు వెళ్లి పుణ్య స్నానాలు అచరించాలనుకున్నారు. కానీ వారి వద్ద డబ్బులు లేకపోయేసరికి దొంగతనాలకు పాల్పడ్డారు. మొత్తంగా లక్షల్లో చోరీ చేసి ఆ పాపపు సొమ్ముతోనే కుంభమేళాకు వెళ్లారు. కానీ తిరిగొచ్చేసరికి పోలీసులు వచ్చి షాక్ ఇచ్చారు. మధ్య ప్రదేశ్‌లోని ఇండోర్‌కు చెందిన అజయ్ శుక్లా, సంతోష్ కోరిలు స్నేహితులు. అయితే వీరిద్దరూ చెరో అమ్మాయిని ప్రేమిస్తున్నారు. ఈక్రమంలోనే నలుగురూ కలిసి తిరుగుతూ ఫుల్లుగా ఎంజాయ్ చేస్తున్నారు. ఇటీవలే కుంభమేళా ప్రారంభం కాగా.. ఈ రెండు జంటలు కలిసి అక్కడకు వెళ్లాలనుకున్నాయి. అయితే అజయ్, సంతోష్‌ల వద్ద ప్రియురాళ్లను తీసుకుని కుంభమేళా వెళ్లేందుకు డబ్బులు లేవు. ఎలాగైనా సరే డబ్బులు జమ చేసి వారితో కలిసి ప్రయాగ్‌రాజ్‌లో వెళ్లాలని నిర్ణయించుకున్నారు. ప్రియురాళ్లకు కూడా తీసుకెళ్తామని మాటిచ్చారు.
ఈక్రమంలోనే అజయ్, సంతోష్‌లు ఇద్దరూ కలిసి డబ్బుల కోసం దొంగతనాలు చేయాలనుకున్నారు. ఎంత ఎక్కువ మొత్తంలో దోచేస్తే అంత బాగా ఎంజాయ్ చేయొచ్చని భావించారు. ఈక్రమంలోనే ద్వారకానగర్‌లోని అనేక ఇళ్లల్లో చోరీలకు పాల్పడ్డారు. బంగారు ఆభరణాలు సహా, దొరికినకాడికి నగదును దోచేశారు. ఆపై ప్రియురాళ్లను తీసుకుని ఉత్తర ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళా వెళ్లారు. అక్కడే పుణ్య స్నానాలు చేస్తూ.. ఫుల్లుగా ఎంజాయ్ చేస్తున్నారు.
అయితే తమ ఇళ్లల్లో చోరీలు జరిగిన బాధితులంతా పోలీసులను ఆశ్రయించారు. ఈక్రమంలోనే కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేశారు. చోరీ జరిగిన స్థలాల్లో నిందితుల వేల ముద్రలు గుర్తించారు. ఈక్రమంలోనే 15 చోట్ల చోరీలకు పాల్పడింది అజయ్, సంతోష్‌లేనని తేల్చారు. ఆపై వారి సెల్‌ఫోన్ల సిగ్నల్ ఆధారంగా కుంభమేళా వెళ్లినట్లు గుర్తించారు. దీంతో వారిని పట్టుకునేందుకు పోలీసులు సైతం కుంభమేళా వెళ్లారు. కానీ అక్కడ భక్తుల రద్దీ ఎక్కువగా ఉండడంతో వారిని గుర్తించలేకపోయారు. తిరిగి మధ్య ప్రదేశ్ చేరుకున్నారు.
ఈక్రమంలోనే అజయ్, సంతోష్‌లు కుంభమేళా ల నుంచి ప్రియురాళ్లను తీసుకుని తిరిగి ఇంటికి చేరుకున్నారు. ఈక్రమంలోనే పోలీసులు వీరిద్దరినీ అరెస్ట్ చేశారు. మొత్తంగా 4 లక్షల విలువైన నగదు, బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఆపై విచారణ జరపగా.. తామే ఈ దొంగతనాలను పాల్పడ్డట్లు నిందితులు ఒప్పుకున్నారు. మొత్తంగా 15 చోట్ల చోరీలు చేయగా.. రూ.7 లక్షల విలువైన సొమ్మును కాజేసినట్లు చెప్పారు. అయితే ఇందులో ఎక్కువ మొత్తంలో డబ్బులు ఖర్చు చేసినట్లు కూడా స్పష్టం చేశారు.

## ముక్కులో వేలు పెట్టుకుని ట్రంప్‌కు ముచ్చెమటలు పట్టించిన మస్క్ కుమారుడు.. దెబ్బకు ఏం చేశాడంటే?



**వాషింగ్టన్- నవభూమి:** అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గురించి అందరికీ తెలిసిందే. ఏమాత్రం భయం, బెరుకు లేకుండా అందరినీ భయపెట్టే ఈయన్నే తాజాగా మస్క్ కుమారుడు భయపెట్టినట్లు తెలుస్తోంది. కేవలం ముక్కులో వేలు పెట్టుకునే ట్రంపునకు మచ్చెమటలు పట్టించినట్లు అర్థం అవుతుంది. దీంతో భయంతో అల్లాడిపోయిన ట్రంప్.. క్వీన్ విక్టోరియా బహుమతిగా ఇచ్చిన 145 ఏళ్ల నాటి పురాతన రెజల్యూట్ డెస్క్‌ను మార్చేశారట. ప్రస్తుతం ఈ వార్త నెట్టింట వైరల్ అవుతుండగా.. అసలు మస్క్ కుమారుడు అంతగా ఏం చేశాడో తెలుసుకోవాలని చూస్తున్నారు. ఆ పూర్తి వివరాలు మీకోసం.టెస్లా, ఎక్స్ అధినేత, ప్రపంచ కుబేరుడు అయిన ఎలాన్ మస్క్ ఇటీవలే తన నాలుగేళ్ల కుమారుడితో కలిసి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను కలిసిన విషయం అందరికీ తెలిసిందే. వైట్ హౌస్‌లోని ఓవల్ ఆఫీసులో వీరిద్దరూ ఓ సమావేశంలో పాల్గొన్నారు. అయితే ఈక్రమంలోనే మస్క్ కుమారుడు లిటిల్ ఎక్స్ అక్కడ తెగ అల్లరి చేశాడు. ఒక్కచోట కూర్చుకుండా అటూ ఇటూ తిరుగుతూ అందరి దృష్టిని ఆకర్షించాడు. ముఖ్యంగా మస్క్ తలపైకి ఎక్కి కూర్చుని మరింత సందడి చేశాడు.
ఇదంతా మనకు తెలిసిందే కాగా.. ఒకానొక క్షణంలో డొనాల్డ్ ట్రంప్ పక్కనే నిల్చుని ముక్కులో వేలు పెట్టుకున్నాడు. ఆపై దాన్ని తీసి డెస్క్‌పై రాశాడు. దీన్ని గమనించిన ట్రంప్.. ఆ చేష్టలకు భయపడిపోయినట్లు తెలుస్తోంది. అందులో భాగంగానే తాజాగా ఆ డెస్క్‌ను తన ఆఫీసు నుంచి తొలగించాడని పలు మీడియా కథనాలు వివరిస్తున్నాయి. అయితే డెస్క్‌ను మారుస్తున్నట్లు ట్రంప్ ట్రూత్ ద్వారా పోస్టు చేసి మరీ చెప్పాడు. ముఖ్యంగా ఓవల్ ఆఫీసులోని 145 ఏళ్ల నాటి పురాతన రెజల్యూట్ డెస్క్‌ను తీసేయించానని చెప్పుకొచ్చారు. దాని స్థానంలో సీఅండ్‌ఓ డెస్క్‌ను పెట్టించినట్లు వివరించారు. అలాగే ఇది తాత్కాలికం మాత్రమేనని చెప్పారు. శ్వేతసౌధంలోని 7 డెస్కుల్లో ఏదో ఒకదాన్ని ఎంచుకునే అవకాశం అధ్యక్షుడికి ఉంటుందని.. ఈ సీఅండ్‌ఓ డెస్క్‌ను గతంలో జార్జ్ బుష్, మరికొందరు అధ్యక్షులు వాడారన్నారు. ఇప్పటి వరకు ఇక్కడున్న రెజల్యూట్ డెస్క్‌ను మరమ్మతుల కోసం పంపించామన్నారు. అది చాలా అత్యవసరం అని చెప్పగా.. మస్క్ కుమారుడు చేసిన చేష్టల వల్లే ట్రంప్ దీన్ని మార్చారని అంతా భావిస్తున్నారు. ముఖ్యంగా ట్రంప్ చాలా శుభ్రతను పాటిస్తారని.. కానీ ఇటీవలే మస్క్ కుమారుడు చేసిన పనుల వల్లే ఈ టేబుల్ మార్చారంటూ పెద్ద ఎత్తున కథనాలు వస్తున్నాయి. మరి దీనిపై అటు ట్రంప్, ఇటు మస్క్ ఎలా స్పందిస్తారో చూడాలి.

## లేని శాఖకు మంత్రి.. 20 నెలలుగా బాధ్యతల నిర్వహణ.. జుట్టు పీక్కునేలా చేస్తున్న పంజాబ్ సర్కారు!



**న్యూఢిల్లీ-నవభూమి:** ఉనికిలోనే లేని ఓ శాఖకు పంజాబ్ ప్రభుత్వం ఓ మంత్రిని కేటాయించింది. ఆయన కూడా ఏడాదిన్నర కాలంగా ఆ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అయితే 20 నెలల తర్వాత సర్కారు.. ఈ విషయాన్ని గుర్తించింది. దీంతో దాన్ని సవరించేందుకు ఓ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయగా.. అసలు విషయం వెలుగులోకి వచ్చింది. దీన్ని గుర్తించిన ప్రజలు, ప్రతిపక్షాలు ముక్కున వేలేసుకుంటుండగా.. బీజేపీ మాత్రం తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పిస్తోంది. ఇదేం చోద్యమంటూనే.. పరిపాలను ఆమ్ ఆద్మీ పార్టీ జోక్‌గా తీసుకుందని చెప్పుకొచ్చింది. 2022వ సంవత్స రంలో పంజాబ్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగ్గా ఆమ్ అద్మీ పార్టీ విజయం సాధించింది. ఈక్రమంలోనే ఆప్ భగవంత్ మాన్‌ను ముఖ్యమంత్రిని చేసింది. అయితే మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణలో భాగంగా 2023 మే నెలలో కుల్దీప్ సింగ్ ధలివాల్‌కు రెండు శాఖలు కేటాయిస్తూ మంత్రిగా ప్రకటించారు. ముఖ్యంగా ఎన్ఆర్ఐ వ్యవహారాలు సహా అడ్మినిస్ట్రేటివ్ రిఫార్మ్స్ డిపార్ట్‌మెంట్ బాధ్యతలను అప్పగించింది. ఇదంతా బాగానే ఉండగా.. 2024 చివరలో పంజాబ్ ప్రభుత్వం మరోసారి పునర్వ్యవస్థీకరణ చేసింది.ముఖ్యంగా 2024 సెప్టెంబర్ నెలలో ముఖ్యమంత్రి భగవంత్ మాన్ ఆధ్వర్యంలో సర్కారు నోటిఫికేషన్ విడుదల చేసింది. అయితే తాజాగా దీన్ని మారుస్తున్నంటూ మరోసారి గెజిట్ నోటిఫికేషన్ రిలీజ్ చేసింది. అయితే గతంలో విడుదల చేసిన దాంట్లో మంత్రి కుల్దీప్ సింగ్‌కు కేటాయించిన అడ్మినిస్ట్రేటివ్ రిఫార్మ్స్ శాఖ ఉనికిలో లేదని కూడా చెప్పుకొచ్చింది. దీన్ని గుర్తించిన ప్రజలు సహా ప్రతిపక్షాలు ముక్కున వేలేస్కుంటున్నాయి. కానీ బీజేపీ మాత్రం తీవ్ర స్థాయిలో విమర్శలు చేస్తోంది. అసలు సీఎంకు కూడా తెలియని ఓ శాఖను మంత్రికెలా కేటాయించారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తోంది.పంజాబ్‌లో పాలలను ఆమ్ ఆద్మీ పార్టీ ఒక జోక్‌గా తీసుకుందని బీజేపీ ఆరోపించింది. అసలు ఉనికిలోనే లేని శాఖకు మంత్రిని కేటాయించడం ఏంటని.. అందులోనూ దానికి ఆయన 20 నెలలుగా బాధ్యతలు నిర్వహించడం ఏంటోనంటూ వ్యగ్యాస్త్రాలు విసిరింది. ఈ విషయం ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి భగవంత్ మాన్‌కు కూడా తెలియకపోవడం దారుణం అని చెప్పుకొచ్చింది. అసలు పంజాబ్ సర్కారు పరిస్థితి ఎలా ఉందో ఈ ఒక్క విషయం చూస్తేనే అర్థం అయిపోతుందంటూ మండిపడింది. ప్రస్తుతం ఈ వార్తలు నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి.

## మహాకుంభ మేళా ఎఫెక్ట్.. ఫిబ్రవరి 25-28 వరకు ఈ రైళ్లు రద్దు..



**న్యూఢిల్లీ-నవభూమి:** మహా శివరాత్రి సందర్భంగా మీరు ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణి సంగమం వెళ్లేందుకు ట్రైన్ జర్నీ కోసం చూస్తున్నారా. అయితే జాగ్రత్త. ఎందుకంటే పలు కీలక ట్రైన్స్ రద్దయ్యాయి ఈ సమాచారం ట్రైన్ జర్నీ చేసేవారికి చాలా కీలకం. ఈ క్రమంలో ఏ ట్రైన్స్ రద్దయ్యాయి, ఎప్పుడెప్పుడు రద్దయ్యాయనే విషయాలను ఇక్కడ తెలుసుకుందాం.ప్రయాగ్‌రాజ్ మహా కుంభమేళా అమృత్ స్నాన్ రోజుల్లో ప్రయాణికుల రద్దీ దృష్ట్యా 174 రైళ్లను రద్దు చేయాలని భారతీయ రైల్వే నిర్ణయించింది. వీటిలో ఫిబ్రవరి 25 నుంచి ఫిబ్రవరి 28 మధ్య 32 రైళ్లు రద్దయ్యాయి. వీటిలో షెడ్యూల్ చేయబడిన రైళ్లలో ధన్‌బాద్, గోమోహ్, బొకారో మీదుగా నడిచే కుంభ్ ప్రత్యేక రైళ్లు కూడా ఉన్నాయి.ఫిబ్రవరి 25 నుంచి 28 మధ్య పురుషోత్తం ఎక్స్‌ప్రెస్, నందన్ కానన్ ఎక్స్‌ప్రెస్, కల్కా-హౌరా నేతాజీ ఎక్స్‌ప్రెస్ వంటి అనేక ప్రధాన రైళ్ల టికెట్ బుకింగ్‌లను రైల్వే శాఖ రద్దు చేసింది. ఇతర రైళ్లకు బుకింగ్‌లు అందుబాటులో ఉన్నప్పటికీ, అవి కూడా మరికొన్ని రోజుల్లో ముగియనున్నాయి. కాబట్టి బుక్ చేసుకునే క్రమంలో ఒకటికి రెండు సార్లు చెక్ చేసుకుని, టిక్కెట్లను రిజర్వ్ చేసుకోండి.

మహా కుంభమేళా సందర్భంగా ఈ రెగ్యులర్ రైళ్లు రద్దు
12802 న్యూఢిల్లీ - పూరి పురుషోత్తం ఎక్స్‌ప్రెస్ - ఫిబ్రవరి 24-27
12308 జోధ్‌పూర్-హౌరా ఎక్స్‌ప్రెస్ - ఫిబ్రవరి 24-27
22308 బికనీర్-హౌరా ఎక్స్‌ప్రెస్ - ఫిబ్రవరి 24-27
12312 కల్కా-హౌరా నేతాజీ ఎక్స్‌ప్రెస్ - ఫిబ్రవరి 24-27
18310 జమ్మూ తావి-సంబల్పూర్ ఎక్స్‌ప్రెస్ - ఫిబ్రవరి 24-27
18102 జమ్మూ తావి-టాటా ఎక్స్‌ప్రెస్ - ఫిబ్రవరి 24-27
12444 ఆనంద్ విహార్-హల్దియా ఎక్స్‌ప్రెస్ - ఫిబ్రవరి 25
12320 ఆగ్రా కాంట్ - కోల్‌కతా ఎక్స్‌ప్రెస్ - ఫిబ్రవరి 27
12874 ఆనంద్ విహార్ - హతియా స్వర్ణ జయంతి ఎక్స్‌ప్రెస్ - ఫిబ్రవరి 25-26
12816 ఆనంద్ విహార్ - పూరి నందన్ కానన్ ఎక్స్‌ప్రెస్ - ఫిబ్రవరి 26-27
22911 ఇండోర్ - హౌరా షిప్రా ఎక్స్‌ప్రెస్ - ఫిబ్రవరి 25, 27
12176 గ్వాలియర్-హౌరా చంబల్ ఎక్స్‌ప్రెస్ - ఫిబ్రవరి 25-28
20976 ఆగ్రా కాంట్ - హౌరా చంబల్ ఎక్స్‌ప్రెస్ - ఫిబ్రవరి 25-28
12178 మధుర-హౌరా చంబల్ ఎక్స్‌ప్రెస్ - ఫిబ్రవరి 25-28
12820 ఒడిశా సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ - ఫిబ్రవరి 25, 28
12324 బార్మర్-హౌరా ఎక్స్‌ప్రెస్ - ఫిబ్రవరి 26
12826 ఆనంద్ విహార్ - రాంచీ సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ - ఫిబ్రవరి 26
12282 న్యూఢిల్లీ - భువనేశ్వర్ దురంతో ఎక్స్‌ప్రెస్ - ఫిబ్రవరి 27
12495 బికనీర్ - కోల్‌కతా ప్రతాప్ ఎక్స్‌ప్రెస్ - ఫిబ్రవరి 27
22858 ఆనంద్ విహార్ - సాంత్రాగచి ఎక్స్‌ప్రెస్ - ఫిబ్రవరి 25
12941 భావ్‌నగర్ - అసన్సోల్ పరస్నాథ్ ఎక్స్‌ప్రెస్ - ఫిబ్రవరి 25
18609 రాంచీ-లోకమాన్య తిలక్ ఎక్స్‌ప్రెస్ - ఫిబ్రవరి 26

రద్దు చేయబడిన కుంభమేళా ప్రత్యేక రైళ్లు
03680 కోయంబత్తూర్-ధన్‌బాద్ స్పెషల్ - ఫిబ్రవరి 25న రద్దు
03064 తుండ్ల-హౌరా స్పెషల్ - ఫిబ్రవరి 24న రద్దు
03021 హౌరా-తుండ్ల స్పెషల్ - ఫిబ్రవరి 26న రద్దు
03025 హౌరా-తుండ్ల స్పెషల్ - ఫిబ్రవరి 28న రద్దు
08425 భువనేశ్వర్-తుండ్ల స్పెషల్ - ఫిబ్రవరి 26న రద్దు
08426 తుండ్ల-భువనేశ్వర్ స్పెషల్ - ఫిబ్రవరి 28న రద్దు

అసన్ సోల్ గుండా వెళ్ళే రైళ్లు కూడా రద్దు
01904 కోల్‌కతా-ఆగ్రా కాంట్ స్పెషల్ - ఫిబ్రవరి 26
12274 న్యూఢిల్లీ - హౌరా దురంతో ఎక్స్‌ప్రెస్ - ఫిబ్రవరి 25
12236 ఆనంద్ విహార్ - మధుపూర్ ఎక్స్‌ప్రెస్ - ఫిబ్రవరి 26
12362 ముంబై - అసన్సోల్ ఎక్స్‌ప్రెస్ - ఫిబ్రవరి 26

ధన్‌బాద్ డివిజన్‌లో రద్దు చేయబడ్డ రైళ్లు
15076 తనక్‌పూర్-శక్తినగర్ ఎక్స్‌ప్రెస్ - ఫిబ్రవరి 25
15074 తనక్‌పూర్-సింగ్రౌలి ఎక్స్‌ప్రెస్ - ఫిబ్రవరి 26
15075 శక్తినగర్ - తనక్‌పూర్ త్రివేణి ఎక్స్‌ప్రెస్ - ఫిబ్రవరి 26
15073 సింగ్రౌలి-తనక్‌పూర్ త్రివేణి ఎక్స్‌ప్రెస్ - ఫిబ్రవరి 27

## 20 యేళ్లు లేటుగా వచ్చా... అదే నా తొలి ఓటమి

**చెన్నై-నవభూమి:** రెండు దశాబ్దాలకు ముందే రాజకీయ ప్రవేశం చేసి ఉంటే తానెంతో ఉన్నత స్థితిలో ఉండేవాడినని, ఆ సమయంలో వెనుకంజ వేయటమే తన మొదటి ఓటమి అని మక్కల్ నీదిమయ్యం (ఎంఎన్ఎం) అధ్యక్షుడు, సినీనటుడు కమల్‌హాసన్ అన్నారు. పార్టీ ఎనిమిదో వార్షికోత్సవం శుక్రవారం ఆళ్వార్‌పేటలోని పార్టీ కార్యాలయంలో జరిగింది. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన రాజకీయ పయనంలో అభిమానులు వేరు, ఓటర్లు వేరు అని గ్రహించగలిగానని, చివరి ఓటరు ఉన్నంతవరకూ తమ పార్టీ సేవలు కొనసాగిస్తానన్నారు.ఇరవై ఏళ్ల క్రితం తాను రాజకీయ ప్రవేశం చేసి ఉండాలని, అప్పట్లో తగు నిర్ణయం తీసుకుని ఉంటే తాను రాజకీయాల్లో ఉన్నతస్థితిలో ఉండేవాడినన్నారు. రాష్ట్ర ప్రజలందరినీ సమైక్యపరిచేది తమిళ భాషేనని, తాను ఆత్మవిశ్వాసంతో ముందుకు దూసుకుపోతుండటానికి కారణం తమిళ ప్రజలేనని చెప్పారు.ఆకాశమంత ఎత్తుకు ఎదిగిన తమిళభాషను ఎవరూ కిందకు దించలేరని ఆయన చెప్పారు. ఈ యేడాది పార్లమెంట్‌లో పార్టీ వాణి తొలిసారిగా వినిపిస్తుందని, వచ్చే యేడాది రాష్ట్ర అసెంబ్లీలో పార్టీ సభ్యులుంటారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీ శ్రేణులంతా ప్రజలకు తోచినంత సేవ చేస్తూ ఉండాలని, అప్పుడే పార్టీకి బంగారు భవిష్యత్తు ఉంటుందని కమల్ పేర్కొన్నారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
8 | హైదరాబాద్
ఆదివారం
23 । ఫిబ్రవరి । 2025

## 11 సార్లు నీళ్లు తాగండి.. హిట్ 151కి చేరవచ్చు



థర్టీ ఈయర్స్ పృథ్వీ (30 గురించి పరిచయం అక్కర్లేదు. కమెడీయన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్‌గా ఎన్నో చిత్రాలతో అలరించారు. సినిమాలు చేస్తూనే రాజకీయాల్లోకి అడుగుపెట్టాడు. వైసీపీ పార్టీలో కొంత జర్నీ చేశాక అక్కడ చెడి.. బయటకు వచ్చారు. తదుపరి తాను విమర్శించిన జనసేన పార్టీలో చేరారు. సమయం కుదిరిన ప్రతిసారీ వైసీపీపై ధ్వజమెత్తుతుంటారు. సినిమా వేదికలపై, తాను నటించిన చిత్రాల్లో సరదగా ఆ పార్టీపై డెరెక్ట్‌గానో, ఇన్‌డైరెక్ట్‌గానో కామెంట్స్ చేస్తుంటారు. ఈ మధ్యకాలంలో సినిమా వేడుకల్లో ఆయన చేసిన కామెంట్స్ విపరీతంగా వైరల్ అయ్యాయి. దాంతో ట్రోల్ అయ్యారు. సినిమా వేదికలపై చేసే కామెంట్ల వల్ల ఆయా చిత్రాలకు నష్టం జరుగుతుందని గమనించిన పృథ్వీ తన భావాలను స్వేచ్ఛగా అభిమానులతో పంచుకునేందుకు ఇప్పుడు సోషల్ మీడియాలో అడుగుపెట్టారు. శనివారం ఆయన ఎక్స్ ఖాతాను ఓపెన్ చేశారు. అందులో ఆసక్తికర ట్వీట్ చేశారు."హాయ్ నేను మీ థర్టీ ఈయర్స్ పృథ్వీ, కొత్తగా ఎక్స్ ఖాతాను తెరిచాను. నేను నా భావాలను స్టేజ్‌పై వ్యక్త పరుస్తుంటే చాలామంది ఫీల్ అవుతున్నారు. కాబట్టి నేటి నుంచి ఈ ఎక్స్ అనే వేదిక ఉపయోగించుకుని నా భావ ప్రకటన స్వేచ్ఛను తెలియపరుస్తాను" అని ఎక్స్‌లో పేర్కొన్నారు. అయితే ఆయన పోస్ట్‌ను బట్టి చూస్తే ఆయనకు వ్యతిరేక పార్టీకి కామెంట్ల సెగ మొదలైనట్లే అని అర్థమవుతుంది.ఇటీవల లైలా వేడుకలో ఆయన చేసిన వ్యాఖ్యలు వివాదస్పదమైన సంగతి తెలిసిందే! దాంతో లైలా చిత్రాన్ని బాయ్‌కాట్ చేయాలని సంబంధిత పార్టీ ఫ్యాన్స్ సోషల్ మీడియా వేదికగా సినిమాను, పృథ్వీని టార్గెట్ చేసి ట్రోల్ చేశారు.



## ఛావా : క్షమించండి, నా ఉద్దేశం అది కాదు.. హీరోయిన్ వివరణ



విక్కీ కౌశల్ హీరోగా రష్మిక మందన్న హీరోయిన్‌గా రూపొంది ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'ఛావా' సినిమాకు బాక్సాఫీస్ వద్ద సాలిడ్ వసూళ్లు నమోదు అవుతున్నాయి. ఈ వీకెండ్ పూర్తి అయ్యేప్పటి వరకు ఛావా సినిమా రూ.500 కోట్ల వసూళ్లు నమోదు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. వంద కోట్ల వసూళ్లు సాధించినా గొప్ప విషయమే అన్నట్లుగా బాలీవుడ్‌లో పెద్ద హీరోల సినిమాల పరిస్థితి ఉంది. ఇలాంటి సమయంలో ఏకంగా రూ.500 కోట్లు అంతకు మించి వసూళ్లు రాబట్టడం అంటే మామూలు విషయం కాదు. శంభాజీ మహారాజ్ జీవిత చరిత్రను తెలుసుకునేందుకు, శివాజీ మహారాజ్ వారసుడి గురించి తెలుసుకోవడం కోసం జనాలు థియేటర్లకు వెళ్తున్నారు. ఆ సినిమాపై ప్రధాని మోదీ ప్రశంసలు ఛావా సినిమా ఒకవైపు బాక్సాఫీస్‌ను షేక్ చేస్తూ దూసుకు పోతున్న సమయంలో బాలీవుడ్ నటి స్వర భాస్కర్ వివాదాస్పద ట్వీట్ చేశారు. శంభాజీ మహారాజ్ జీవిత చరిత్ర అంటూ కల్పిత పాత్రను ఛావా సినిమాలో చూపించారు. 500 ఏళ్ల క్రితం హిందువులను హింసించినట్లు చూపించారు. ఆ కల్పిత కథను జనాలు నమ్ముతున్నారు. కానీ ఇటీవల జరిగిన కుంభమేళా తొక్కిసలాటలో చనిపోయిన హిందువుల గురించి ఏ ఒక్కరూ స్పందించడం లేదు. కళ్ల ముందు జరిగిన ఘటన కంటే కల్పిత కథకు ఎక్కువగా జనాలు ప్రాముఖ్యత ఇవ్వడం విడ్డూరంగా ఉంది అంటూ నటి స్వర భాస్కర్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. దాంతో ఆమెను నెట్టింట ఓ రేంజ్‌లో విమర్శించడం మొదలు పెట్టారు. స్వర భాస్కర్ తీరును హిందూ వ్యతిరేకి అంటూ విమర్శలు చేస్తున్నారు. తన గురించి సోషల్ మీడియాలో జరుగుతున్న తప్పుడు ప్రచారం నేపథ్యంలో స్వర భాస్కర్ తన వ్యాఖ్యలకు వివరణ ఇవ్వాల్సి వచ్చింది. హిందువులను అవమాన పరచడం తన ఉద్దేశం కాదు అంటూ చెప్పుకొచ్చింది. నా మాటలను కొందరు తప్పుగా అర్థం చేసుకున్నారు. మన చరిత్రను ఎంతో గొప్పగా గౌరవిస్తాను. ఛత్రపతి శివాజీ మహారాజ్ అంటే నాకు ఎంతో గౌరవం, ఆయన వైభవం తెలుసుకునేందుకు ఆసక్తిని చూపిస్తూ ఉంటాను. కానీ కొందరు ఆయన వైభోగం తప్పుగా చూపించడం, దుర్వినియోగం చేయడం నాకు నచ్చడం లేదని స్వర భాస్కర్ చెప్పుకొచ్చింది. చారిత్రాత్మక అవగాహన కల్పించినప్పుడు జనాలను ఏక తాటి పైకి తీసుకు వచ్చే విధంగా ఉండాలి. అంతే తప్ప ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకునే విధంగా ఉండకూడదు. ప్రజల దృష్టిని మరల్చడానికి కొందరు చూస్తున్నారు అంటూ స్వర భాస్కర్ విమర్శలు చేసింది. ఒక వేళ నా గత ట్వీట్ మీ మనోభావాలు దెబ్బ తీసే విధంగా ఉంటే చింతిస్తున్నాను. ఎవరిని కించ పరచడం, అవమాన పరచడం అనేది నా ఉద్దేశం కాదు. భారత దేశ చరిత్ర గురించి తెలుసుకుని గర్వించే వారిలో నేను ముందు ఉంటాను. నా దేశం పట్ల, నా వీరుల పట్ల గౌరవం ఉందని స్వర భాస్కర్ వివరణ ఇచ్చింది. స్వర భాస్కర్ తాజా ట్వీట్‌తో ఆమెపై విమర్శలు తగ్గే అవకాశాలు ఉన్నాయేమో చూడాలి. ఛావా సినిమా గురించి ఎవరు ఎలాంటి విమర్శలు చేసినా నెట్టింట ఒక వర్గం తీవ్ర స్థాయిలో వారిపై దూకడం గత రెండు మూడు రోజులుగా కామన్‌గా జరుగుతోంది.



## అంచనాలను పెంచేసిన ఓదెల2 టీజర్

తమన్నా తెలుగు సినిమా చేసి చాలా రోజులవుతుంది. చిన్న గ్యాప్ తర్వాత ఇప్పుడు తమన్నా చేసిన సినిమా ఓదెల2. అయితే ఇప్పటివరకు తమన్నా కెరీర్ లో చేసిన ప్రతీ పాత్ర గ్లామర్ తో కూడుకున్నదే. ఓదెల2 సినిమాలో తమన్నా తను ఎప్పుడూ కనిపించే పాత్రలకు భిన్నంగా కనిపిస్తుంది. ఈ సినిమాలో తమన్నా అఘోరిగా నటించింది. రీసెంట్ గా ఈ సినిమా టీజర్‌ను మహా కుంభ మేళా సందర్భంగా కాశీలో రిలీజ్ చేశారు. 1.52 నిమిషాల నిడివి ఉన్న ఓదెల2 టీజర్ చాలా పవర్‌ఫుల్‌గా ఉంది. శివునికి తన జీవితాన్ని అంకితం చేసిన మంచి మనిషికి, ఓ ఆత్మకు మధ్య జరిగే కథగా ఓదెల2 తెరకెక్కినట్టు టీజర్ చూస్తుంటే అర్థమవుతుంది.టీజర్‌లో నాగ సాధువు పాత్రలో తమన్నా స్క్రీన్ ప్రెజెన్స్ చాలా ఆకట్టుకునేలా ఉంది. సినిమాలోని విజువల్స్ నుంచి చాలా మంచి షాట్స్ ను కట్ చేయగా, వాటిన తన బ్యాక్ గ్రౌండ్ స్కోర్‌తో మరింత థ్రిల్లింగ్‌గా మరల్చాడు మ్యూజిక్ డైరెక్టర్ అజనీష్ లోకనాథ్. అశోక్ తేజ దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమాకు సంపత్ నంది రచనా సహకారం అందించగా, డి. మధు ఓదెల2ను నిర్మిస్తున్నాడు. అయితే ఈ సినిమా నాలుగేళ్ల కిందట రిలీజైన ఓదెల రైల్వే స్టేషన్‌కు సీక్వెల్‌గా తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. ఇంట్రెస్టింగ్ కథతో ఇంటెన్స్ యాక్షన్ ను బ్లెండ్ చేస్తూ ఎమోషన్స్, థ్రిల్స్‌తో రోలర్ కోస్టర్‌గా ఓదెల2 రూపొందిందని టీజర్ చూస్తుంటే అర్థమవుతుంది. కాకపోతే టీజర్లో కొన్ని సీన్స్, క్యారెక్టర్లను చూస్తుంటే అరుంధతి సినిమా గుర్తొస్తుంది. మొత్తానికి ఓదెల2 టీజర్ తో సినిమాపై అంచనాలను పెంచిందనడంలో ఎలాంటి సందేహం లేదు.

## రకుల్‌కి బ్యాడ్ టైమ్...




తెలుగులో పలు సూపర్ హిట్ సినిమాల్లో నటించి, పలువురు సూపర్ స్టార్ హీరోల సినిమాల్లో నటించిన రకుల్ ప్రీత్ సింగ్ ప్రస్తుతం గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటుంది. ఆమె కంటే ముందు వచ్చిన వారు ఇంకా ఇండస్ట్రీలో స్టార్ హీరోయిన్స్‌గా కొనసాగుతున్నారు. కానీ రకుల్ ప్రీత్ సింగ్ మాత్రం అప్పుడే టాలీవుడ్ నుంచి కనిపించకుండా పోయింది. బాలీవుడ్‌లో అడపా దడపా సినిమాల్లో ఆఫర్లు వస్తున్నాయి. అక్కడ హిట్ కొట్టి మళ్లీ టాలీవుడ్‌లో ఆఫర్లు సొంతం చేసుకోవాలని ఈ అమ్మడు ఆశ పడుతుంది. కానీ బాలీవుడ్‌లో ఈమెకు వరుసగా ఆఫర్లు వస్తున్నా అవి సక్సెస్‌ను తెచ్చి పెట్టడం లేదు. రకుల్ ప్రీత్ సింగ్ ఖాతాలో మరో ఫ్లాప్ పడింది. అర్జున్ కపూర్ హీరోగా రకుల్ ప్రీత్ సింగ్, భూమి పెడ్నేకర్ హీరోయిన్‌లుగా రూపొందిన 'మేరే హస్బెండ్ కీ బివి' సినిమా నిన్న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. సినిమాకు మొదటి నుంచే పెద్దగా బజ్ క్రియేట్ కాలేదు. విడుదల సమయంలోనూ మేకర్స్ పెద్దగా ప్రమోట్ చేయలేదు. దాంతో సినిమాకు ఓపెనింగ్ అంతగా రాదని ముందే ఊహించారు. అందుకే కొన్ని స్క్రీన్స్‌లో 1 ప్లస్ 1 ఆఫర్ ప్రకటించారు. ఒక టికెట్ కొంటే మరో టికెట్ ఉచితంగా ఇచ్చారు. అయినా టికెట్లు పెద్దగా అమ్ముడు పోలేదు, అంతే కాకుండా ఆక్యుపెన్సీ పెద్దగా నమోదు కాలేదు. మొదటి రోజు వసూళ్లు అత్యంత దారుణంగా ఉన్నాయంటూ బాక్సాఫీస్ వర్గాల ద్వారా సమాచారం అందుతోంది. విశ్వసనీయంగా అందుతున్న సమాచారం ప్రకారం మేరే హస్బెండ్ కీ బివి సినిమాకు మొదటి రోజు కేవలం రూ.2 కోట్ల వసూళ్లు నమోదు అయ్యాయి. నేడు, రేపు వీకెండ్ కావడంతో వసూళ్లు కాస్త పుంజుకునే అవకాశాలు ఉన్నాయనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఎంతగా పుంజుకున్నా సినిమా లాంగ్ రన్‌లో కనీసం రూ.20 కోట్లను నమోదు చేసే అవకాశాలు కనిపించడం లేదు అంటూ బాక్సాఫీస్ వర్గాల వారు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. రూ.50 కోట్లకు మించి ఖర్చు చేసి ఆ సినిమాను రూపొందించారు. కాని సినిమా ఫలితం చూస్తే డిజాస్టర్ తప్పేలా లేదని కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. రకుల్ ప్రీత్ సింగ్ ఈ సినిమాపై చాలా ఆశలు పెట్టుకుంది. ఈమె పాత్రకు ప్రాముఖ్యత దక్కడంతో పాటు నటించేందుకు స్కోప్ దక్కిందట. కనుక సినిమా హిట్ అయితే బాలీవుడ్‌లో మరో మూడు నాలుగు ఆఫర్లు వస్తాయని ఆశ పడింది. కానీ రకుల్ ప్రీత్ సింగ్‌కి బ్యాడ్ టైమ్ నడుస్తున్నట్లుగా ఉంది. అందుకే మరోసారి ఆమెకు ఈ సినిమాతోనూ నిరాశే మిగిలింది. రకుల్ సినీ కెరీర్ ఖతం అయిందా అంటూ అనుమానాలు వచ్చే విధంగా ఈ సినిమా సైతం బాక్సాఫీస్ వద్ద బొక్క బోర్లా పడింది. ఈ సినిమా ఫెయిల్ కావడంతో రకుల్ ప్రీత్ సింగ్ కి బాలీవుడ్‌లోనూ ఆఫర్లు మరింత కష్టంగా మారే అవకాశాలు ఉన్నాయి అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

## వీరమల్లు నర్గీస్ రహస్య వివాహం..




పవన్ కళ్యాణ్ ప్రస్తుతం నటిస్తున్న 'హరి హర వీరమల్లు' సినిమాలో నర్గీస్ ఫక్రీ కీలక పాత్రలో నటిస్తున్న విషయం తెల్సిందే. ఆమెది గెస్ట్ రోల్ అయినా సినిమా కథలో ఆమె పాత్ర అత్యంత కీలకంగా ఉంటుంది అంటూ మేకర్స్ చెబుతూ వస్తున్నారు. ఇప్పటికే సినిమా కోసం ఆమె పోర్షన్ షూటింగ్ పూర్తి చేశారని తెలుస్తోంది. నర్గీస్ ఫక్రీ బాలీవుడ్‌లోనూ ఈమధ్య కాలంలో స్పీడ్‌గా సినిమాలు చేయకుండా స్లో అండ్ స్టడీ అన్నట్లుగా సినిమాలు చేస్తోంది. కొత్త సినిమాలకు కమిట్ కాకపోవడంకు కారణం ఏంటి అంటూ గత కొన్ని రోజులుగా ఈ అమ్మడి గురించి జాతీయ మీడియాలోనూ కథనాలు వస్తున్నాయి. ఎట్టకేలకు నర్గీస్ ఫక్రీ ఇండస్ట్రీలో బిజీగా లేకపోవడానికి కారణం తెలిసింది. ఆ సినిమాపై ప్రధాని మోదీ ప్రశంసలు ఇటీవల నర్గీస్ ఫక్రీ తన బాయ్ ఫ్రెండ్ టోనీ బేగ్‌ను వివాహం చేసుకుంది. గత కొన్నాళ్లుగా వీరిద్దరూ ప్రేమలో ఉన్నారు. ప్రేమించుకుంటున్న వీరిద్దరూ ఒకటి రెండు సార్లు మీడియా కంట పడ్డారు. కానీ ఆ సమయంలో నర్గీస్ పెద్దగా రియాక్ట్ కాలేదు. వ్యాపారవేత్త అయిన టోనీ బేగ్‌తో వివాహం కారణంగా నర్గీస్ ఈమధ్య కాలంలో సినిమాలను తక్కువ చేసింది. రాక్‌స్టార్ సినిమాతో బాలీవుడ్‌కి పరిచయం అయి అదే పేరుతో రాక్‌స్టార్ నర్గీస్ అంటూ పిలిపించుకుంటున్న నర్గీస్ ఆ తర్వాత బాలీవుడ్‌లో ఎన్నో సినిమాల్లో నటించి మెప్పించింది. సోషల్ మీడియాలో ఈమెకు ఉన్న ఫాలోయింగ్ గురించి ఎంత చెప్పినా తక్కువే. ప్రస్తుతం హరి హర వీరమల్లు సినిమాతో పాటు హౌస్‌ఫుల్ 5 సినిమాలోనూ నటిస్తోంది. ఆ సినిమాల షూటింగ్ పూర్తి చేసి పెళ్లి పీటలు ఎక్కిన నర్గీస్ తిరిగి సినిమాల్లో నటించేందుకు కొంత సమయం తీసుకునే అవకాశాలు ఉన్నాయి. చిన్న బ్రేక్ తీసుకుని బాలీవుడ్‌లో రీ ఎంట్రీ ఇవ్వనున్న నర్గీస్‌కి ఆ సమయంలో ఆఫర్లు వస్తాయా అనేది చూడాలి. నర్గీస్ వివాహం గురించి ముందస్తు సమాచారం లేకపోవడంతో పాటు, ఇండస్ట్రీకి చెందిన వారిని ఆహ్వానించకపోవడం ఇంకా పలు కారణాల వల్ల మీడియా వర్గాల్లో రకరకాలుగా పుకార్లు షికార్లు చేస్తున్నాయి. ముఖ్యంగా నర్గీస్ టోనీ బేగ్‌ల వివాహం రహస్యంగా జరిగిందనే పుకార్లు షికార్లు చేస్తున్నాయి. అమెరికా లాస్ ఏంజెల్స్‌లోని ఒక స్టార్ హొటల్‌లో వీరిద్దరి వివాహం జరిగింది. వారి సన్నిహితుల ద్వారా ఈ విషయం బయటకు వచ్చింది. కానీ ఇప్పటి వరకు నర్గీస్ ఫక్రీ తన వివాహం గురించి బయటకు చెప్పలేదు. సాధారణంగా సెలబ్రెటీలు తమ పెళ్లి ఫోటోలను ఎప్పటికప్పుడు సోషల్ మీడియా ద్వారా షేర్ చేస్తూ ఉంటారు. కానీ ఈ అమ్మడు మాత్రం పెళ్లి ఫోటోలను షేర్ చేయక పోవడం విడ్డూరంగా ఉందంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఇంతటి సీక్రెట్ వ్యవహారంగా పెళ్లిని ఎందుకు ఉంచుతుంది అంటూ కొందరు ప్రశ్నిస్తున్నారు. ముందు ముందు అయినా నర్గీస్ తన పెళ్లి విషయాన్ని అధికారికంగా వెల్లడిస్తుందా లేదా రహస్యంగానే కంటిన్యూ చేస్తుందా

## చిరంజీవి చేతుల మీదుగా 'మాస్టర్ ఆఫ్ సస్పెన్స్ హిచ్‌కాక్' సెకండ్ ఎడిషన్ లాంచ్



ప్రపంచ సినిమాపై తనదైన ముద్ర వేసిన దర్శకుల్లో ఆల్ఫ్రెడ్ హిచ్‌కాక్ ఒకరు. సస్పెన్స్ థ్రిల్లర్స్ తీసే దర్శక రచయితలకు ఆయన సినిమాలు ఇన్స్పిరేషన్. ఆల్ఫ్రెడ్ హిచ్‌కాక్ 125వ జయంతి సందర్భంగా, అలానే ఆయన తొలి సినిమా విడుదలై వందేళ్లు అయిన సందర్భంగా హిచ్‌కాక్ సినీ జీవితంపై 'మాస్టర్ ఆఫ్ సస్పెన్స్ హిచ్‌కాక్' పేరుతో సీనియర్ జర్నలిస్ట్, సినీ రచయిత పులగం చిన్నారాయణ – ఐఆర్‌టిఎస్ అధికారి రవి పాడితకలిసి పుస్తకం తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. డిసెంబర్ 18న ఈ పుస్తకం ఫస్ట్ కాపీ విడుదలైంది. ఐదు రోజుల్లో పుస్తకాలు అన్నీ అమ్ముడు కావడంతో సరికొత్త చేర్పులతో సెకండ్ ఎడిషన్ లాంచ్ చేశారు. 'మాస్టర్ ఆఫ్ సస్పెన్స్ హిచ్‌కాక్'బుక్ సెకండ్ ఎడిషన్ తీసుకొచ్చారు. దీనిని మెగాస్టార్ చిరంజీవి లాంచ్ చేశారు. 'మాస్టర్ ఆఫ్ సస్పెన్స్ హిచ్‌కాక్' బుక్ చూసిన చిరంజీవి ఆసక్తి కనబరిచారు. తాను పుస్తకం చదువుతానని తెలిపారు. తెలుగులో ఇటువంటి పుస్తకం తీసుకు రావడం అభినందనీయం అని ప్రశంసించారు. ఇంకా ఆయన మాట్లాడుతూ... "హిచ్ కాక్ సినిమాలు కొన్నిటిని నేను కాలేజీ చదువుతున్న రోజుల్లో చూశాను. ఈ పుస్తకాన్ని ఖాళీ సమయం దొరికినప్పుడల్లా పది పదిహేను రోజుల్లో చదివేస్తాను. ప్రపంచ సినిమా చరిత్రలో దిగ్గజ దర్శకుడి గురించి తెలుగులో బుక్ రావడం అభినందనీయమన్నారు.

## రోజుకు ఒక్కసారే భోజనం, నో బిర్యానీ.. ఛాంపియన్స్ ట్రోఫీ కోసం 9 కిలోలు తగ్గిన షమీ..



**న్యూఢిల్లీ–నవభూమి:** కొంతకాలంగా గాయాల సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న దిగ్గజ బౌలర్ మహ్మద్ షమీ ఛాంపియన్స్ ట్రోఫీ కోసం బలంగా సన్నద్ధమయ్యాడు. మరో స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా గాయం కారణంగా దూరం కావడంతో టీమిండియా బౌలింగ్ దళానికి షమీ నాయకత్వం వహిస్తున్నాడు. బంగ్లాదేశ్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో అంచనాలకు అనుగుణంగానే రాణించాడు. ఐదు వికెట్లు దక్కించుని బంగ్లా బ్యాటర్లను కట్టడి చేశాడు. వన్డేల్లో బంగ్లాదేశ్‌పై అత్యుత్తమ గణాంకాలను నమోదు చేశాడు.దాదాపు 14 నెలల విరామం తర్వాత అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగు పెట్టిన షమీ ఫిట్‌నెస్ కోసం అమితంగా శ్రమించాడట. బెంగళూరులోని జాతీయ క్రికెట్ అకాడమీలో చెమటోడ్చాడట. కఠినమైన వ్యాయామం, డైటింగ్ చేసి ఏకంగా 9 కిలోల బరువు తగ్గాడట. ఆ విషయాన్ని ఓ ఇంటర్వ్యూలో షమీ వెల్లడించాడు. టీమిండియా మాజీ క్రికెటర్ నవ్‌జ్యోత్ సింగ్ సిద్ధూతో చిన్న చిట్‌చాట్‌లో పాల్గొన్నాడు. ఆ వీడి యోను బీసీసీఐ తన సోషల్ మీడియా ఖాతాలో షేర్ చేసింది. ఆ వీడియోలో షమీ తన ఆహారపు అల వాట్ల గురించి, గాయం నుంచి కోలుకునేందుకు చేసిన ప్రయత్నాల గురించి మాట్లాడాడు.

## నాడు పంతం నెగ్గించుకుంది.. నేడు పాక్‌పై భారత్ ఏం చేయబోతుంది



**న్యూఢిల్లీ–నవభూమి:** ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ మొదలైంది.. ఇప్పటికే నాలుగు మ్యాచ్‌లు పూర్త య్యాయి. ఐదో మ్యాచ్ ఫిబ్రవరి 23 ఆదివారం దుబాయి వేదికగా జరగబోతుంది. ఇప్పటివరకు జరిగిన నాలుగు మ్యాచ్‌లు ఒక ఎత్తైతే ఆదివారం జరగబోయే మ్యాచ్ మరో ఎత్తు. ఈ మ్యాచ్ కోసం క్రీడాభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్నారు. భారత్, పాకిస్తాన్ మధ్య మ్యాచ్ అంటేనే ఓ భీకర పోరు. మ్యాచ్ జరుగుతున్నంతసేపు యుద్ధ వాతావరణమే. పక్క దేశంతో మన దేశం యుద్ధం చేస్తోంది.. విజయం ఎవరిదో అంటూ రెండు దేశాల ప్రజలు ఎదురుచూసే అసలు సిసలైన మ్యాచ్. ఈ మ్యాచ్ కోసం భారత్, పాకిస్తాన్ క్రికెట్ అభిమానులే కాదు.. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న క్రికెట్ అభిమానులు ఈ రెండు దేశాల మధ్య క్రికెట్ మ్యాచ్‌ను ఎంతో ఇంట్రెస్టింగ్‌గా చూస్తారు. పాకిస్తాన్ గడ్డపై మ్యాచ్‌లు ఆడేది లేదని, తటస్థ వేదికలపై ఆడేందుకు సిద్ధమని ప్రకటించి.. తన పంతాన్ని నెగ్గించుకున్న భారత్.. ఆదివారం నాటి మ్యాచ్‌లో పాక్‌ను చిత్తు చేయబోతుందా.. లేదంటే పాక్ భారత్‌పై పైచేయి సాధించబోతుందా అనే ఆసక్తి నెలకొంది.

## పాపం పాకిస్తాన్ అభిమానులు.. ఈసారి మ్యాచ్ ఓడిపోయినా టీవీలు పగలగొట్టలేరు..



**న్యూఢిల్లీ–నవభూమి:** క్రికెట్ మైదానంలో దాయాది దేశాల సమరం అంటే ఉద్రిక్తతలు సామాన్యంగా ఉండవు. భారత్, పాక్ మ్యాచ్ అంటే ఇరు దేశాల అభిమానులకే కాదు.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రికెట్ ఫ్యాన్స్‌కు పెద్ద పండుగతో సమానం. ముఖ్యంగా ఐసీసీ ఈవెంట్లలో భారత్, పాక్ మ్యాచ్ జరుగుతోందంటే క్రికెట్ ప్రపంచం చూపు మొత్తం అటువైపే ఉంటుంది. ఆ హై ఓల్టేజ్ మ్యాచ్‌లో ఏ జట్టు ఓడిపోయినా ఆ దేశ అభిమానులు తీవ్ర ఆగ్రహానికి గురవుతుంటారు. అయితే ఇప్పటివరకు జరిగిన ఐసీసీ మ్యాచ్‌ల్లో పాకిస్తాన్‌పై భారత్‌దే పై చేయి. ఛాంపియన్స్ ట్రోఫీలో భాగంగా ఫిబ్రవరి 23 (ఆదివారం)వ తేదీన భారత్, పాక్ మ్యాచ్ జరగబోతోంది. ఇప్పటికే న్యూజిలాండ్ చేతిలో ఘోర పరాజయాన్ని మూటగట్టుకున్న పాకిస్తాన్‌కు భారత్‌తో మ్యాచ్‌లో తప్పనిసరిగా గెలవాల్సిన పరిస్థితి. సాధారణంగా భారత్‌తో జరిగే ఐసీసీ మ్యాచ్‌ల్లో పాకిస్తాన్ ఓడిపోతే ఆ దేశ అభిమానులు విపరీత చర్యలకు దిగుతుంటారు. భారత్ చేతిలో పరాజయాన్ని జీర్ణించుకోలేక అభిమానులు టీవీలు పగలగొడుతుంటారు . అయితే ఈ సారి మాత్రం అలాంటి సీన్ ఉండదని ఆ దేశ మాజీ క్రికెటర్ బాసిత్ అలీ. ఈసారి భారత్‌తో జరిగే పాకిస్తాన్ ఓడిపోయినా అభిమానులు టీవీలపై తమ ప్రతాపాన్ని చూపించలేరని చెబుతున్నాడు.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**